
ఉగాది శుభాకాంక్షలతో!

* ...ధరలో ...% ...
మి... మొత్తాన్ని, 11, 17, 23, 29 ... 35 నెలలలో వాయిదాలలో తీర్చవచ్చు...
* మీ పాత బ్లా... అండ్ వైట్ టి.వి. మాకిచ్చి మీకి... న కలర్ టి.వి.ని తీసుకోవచ్చు.
* డబ్బు మొత్తం ఒకే... చెల్లించేటట్లయితే గొప్ప తగ్గింపు ...ంది.
* మీ ఆర్డర్లు ఎక్కువ ఉం...కోసం ప్రత్యేకమయిన వాయిదా పద్ధ...ద్దా ఉంది.



ఇవేగాక షేము వీడియో కవరేజ్ కూడా చేస్తాము. దీనికోసం మావద్ద అతి ఆధునిక మయిన వీడియో పరికరాలున్నాయి.

మావద్ద అన్ని కంపెనీల టి.వి.లు, వి.సి.ఆర్.లు, వి.సి.పి.లు, రెఫ్రిజిరేటర్లు, డిసర్ట్ కూలర్లు, వంటసామాన్లు, వాషింగ్ మెషీన్లుకూడా దొరుకుతాయి.


Digiana TV
The Spirit of Excellence!




UPTRON TV
The choice in Black & White. And in Colour too.



HOMETECH
FROM
Crompton Greaves



televista
Only the best carry our name



OPT...CA colour TV
To... than time



Duke TV



విడియువాణి ఎలక్ట్రానిక్స్

72, చెనాయ్ ట్రేడ్ సెంటర్, పార్క్ లేన్, సికింద్రాబాద్. ph: 74906

తొలిమాట

'జ్యోతి' అభిమానులందరికీ ఉగాది శుభాకాంక్షలు


* * *

ఎలక్షన్ల యుద్ధం ముగిసింది. అదివరకు సినిమాల్లోనే బూతులు విని, చూసేవాళ్ళం. ఇప్పుడు రాజకీయ నాయకుల సాహిత్యం దానిని మించిపోయింది. కనీసం ఈ విషయంలో నయినా మనదేశం ప్రగతి సాధించినందుకు మనను మనమే అభినందించుకుందాం. ఇకపోతే తెలుగుదేశం వాళ్ళ గర్వ భంగం పట్టువాన ప్రజలు చేస్తే కాంగ్రెస్ వాళ్ళ విరగ బాయును మండల వానులు విరిచేశారు.

ఈసంచికలో ప్రముఖ రచయిత కీ॥శే॥ శ్రీ కొవ్వరపాటి గంగాధరరావు గారి హాస్యనవల పరకాయప్రవేశం ప్రచు రిస్తున్నాము. శ్రీ కొవ్వరపాటి గంగాధరరావుగారు నాటికలు, నాటకాల్లోనే కాకుండా నవలా సాహిత్యంలో కూడా పాఠకుల అభిమానాన్ని చూరగొన్న రచయిత.

* *

జ్యోతి పాఠకులకు ఓ శుభవార్త ఏమిటంటే అంతర్జా తీయ ఖ్యాతిగాంచిన కార్టూనిస్టులు మేరియో, సురేష్ సావంత్ ల కార్టూన్లు పాఠకులకందించే ఏర్పాటు చేశాము. ఈ సంచిక నుంచీ మీరు ఆ కార్టూన్ల నవ్వుల్లో మునిగి తేలవచ్చు.



ఉత్తరాలు

ఏప్రిల్ నెల జ్యోతిలోని రాంరావు గారి క్రొత్త సీరియల్ "యువత-సవత" ఈ కాలం అమ్మాయిల మన స్తత్వంకి అద్దం పట్టినట్లుగా వుంది. యామినీ సర స్వతి గారు పూజాపుష్పంలో ప్రమీలా, ఆమె తండ్రి రాఘవేంద్ర రా అభి ప్రాయాలు అమోఘంగా వివరించారు. తెలుగు జీవనైన ప్రమీల పాత్ర చాలా చక్కని అదర్శంతో తీర్చి దిద్దేరు. రచ యిత్రులకు ధన్యవాదాలు.
మరి పదవ్యూహం, సీరియల్ వెనక యిస్తున్నారు. పదవ్యూహం కట్ చేస్తే సీరియల్ కథ పోతుందికదా? ఏదైన ఎడ్వర్ టైజ్ మెంటు వెనుక వేస్తే బాగుం టుంది. ఈ మార్పు గమనించగలరు.

కె. రమణమ్మ
విశాఖ పట్నం

శ్రీ. రామనారాయణ "జాప్యం" కథ థీమ్ పాతది. ఇలాంటి కథలు చాలా వచ్చాయి. తర్వాత కొన్ని సినిమాలలో కూడా వాడ బడ్డాయి. క్రొత్త పుస్తకాల్లో క్రొత్త కథలు ఉండాలి. క్రొత్త డబ్బాలలో పాత చాక్లెట్ లా వుం డకూడదు. కథ నడిచే తీరు బాగుంది. ఈ నవలానుబంధం యామినీ సరస్వతి గారి "పూజా పుష్పం" బాగుంది.

మోహన్ రావ్
విశాఖ పట్నం

వమ్మి వీరభద్రరావుగారి 'మాధవి,' రాసిక్ గారి 'టాస్ మీద గెలుపునాది' కథలు బాగున్నాయి యర్రంశెట్టి శాయి ... ... జోకుగా ... ... కోసం ఎవరు ... ... కాంపిటీషన్ లో చల్లా సు ... గారు బహుమతి పొందిన ... పరంగా బాగుంది. జోక్స్ కార్టూన్స్ బాగుంటున్నాయి.


వి. హరా, వి.వాసు
ఖమ్మం

ఏప్రిల్ నెల సంచిక ఎప్పటిలా నిత్య నూతనంగా, సరికొత్త శీర్షికలతో సహా ముంగిట వాలింది. ముఖ్యంగా పోటీలో విజేతల విషయంలో - బహుమ తుల (రొఖ్ఖం, పుస్తకాలు) విషయంలో జాప్యం జరుగుతుంది. దీనిని నివా రించ గలరు. పాఠకులకు పఠనాసక్తిని పెంచే, ఆసక్తిని రేకెత్తించే సరికొత్త శీర్షికలను ప్రవేశ పెట్టి పాఠకులను ప్రోత్స హించ గలరు.

కె. శివరామిరెడ్డి
నందివెలుగు

ఏప్రిల్ 87 జ్యోతి మాస పత్రిక "సూపర్ హిందీ హీరోయిన్ రేఖ" ముఖ చిత్రంతో ఎంతో బాగుంది. కథల్లో శ్రీ కాజ గంగాధరరావుగారి "భయం భయం బ్రతుకు భయం" కథ ... అప్పారావు పాత్ర ద్వారా భయం ... అనర్థాలు కల్గుతాయో చాలా చక్కగా ... రించారు, నవలానుబంధం పూజా పుష్పం యామినీ సరస్వతి గారి నవలలో ... పాత్ర ... అద్భుత ... పన్నె ... తెచ్చింది. ఇలాంటి మంచి మంచి నవలలు ముందు - ముందు అందిస్తారనే ఆశతో -

పోలోజు వెంకటాచారి
హైదరాబాద్



మంత్లీ వెలు వడుతోన్న జ్యోతిలో ఎన్నో మార్పులు మాకు ఆనందాన్ని యిస్తున్నాయి. కాని మీరు ఏప్రిల్ పత్రిక పద బంధము సీరియల్ పేజి వెనుక యివ్వడం యిబ్బందిగా వుంది. కావున దయచేసి మీరు పదబంధము యిచ్చే టప్పుడు దానివెనుక ఏఅడ్వర్ టైజ్ మెంట్ వుంటే బావుంటుంది. అలాగే మీరు యిచ్చే నవలా పరిచయంవల్లఅంత వుపయోగం లేదు. దానికంటే మీరు వేరే ఏదైనా ... ంతు వూరు గురించి గాని, లేదా ... హిస్టారికల్ సంబంధించినది గాని ... యినవి వేయిస్తే గురించి గాని ప్రతే... బావుంటుంది.

యస్. వి. రమణ
కొదాడ

ఈ నెల జ్యోతిలో మాధవి, గ్రోనప్ చైల్డ్ కథలు బావున్నాయ్, "పూజా పుష్పం" నవల, చెరవకురా చెడేడు కథ గూడా బావున్నాయ్. ... 'కంప్యూటర్ డీజింగ్' కి ఎవరు ... పోటు కేటాయించడం మొదలుపెట్టి ... అప్పుడే హుర్రా ... సంఖ్య 50 వచ్చే సిందా? ... మనసారా సవ్వించే ... మేమంతా చాలా ఇష్టపడతాం ఈ శీర్షిక ... జోక్స్ గూడా ఇంట్రెస్టింగ్ గా నడు స్తున్నాయి. ప్రవేశ పెట్టిన కొత్త శీర్షికలు చాలా బాగున్నాయి.

వాలి. హిరణ్మయిదేవి
హైదరాబాద్

ఆవకాయజాడీ

మేరీగోల్డ్

జనతా ఎక్స్‌ప్రెస్ ఉయ్యాలలూగుతూ వచ్చి స్టేషన్‌లో ఆగింది. అప్పటిదాకా లోపల నిండివున్న ప్రయాణీకుల్ని బయటికి కక్కేసి; కొత్త ప్రయాణీకుల్ని లోపలికి తీసుకుంది.

టీ, కాఫీ, డ్రింకులూ, సిగరెట్లూ, మేగజైన్లూ, బొమ్మలూ, పూలూ, అమ్మేవాళ్ళతో, రకరకాల మనుషులతో విజయవాడ స్టేషను మహా కోలాహలంగా వుంది.

కాంతారావు రొప్పుతూ, రోజుతూ వచ్చి సెకండ్ క్లాసులో కూచున్నాడు. వెనకాలే పోర్టర్ తెచ్చిన పెట్టే, [illegible], జాడీ, టెన్నిస్ బ్యాటూ అన్నీ [illegible] కింద సర్దేయించాడు. జాడీ [illegible] ఎవరైనా దాన్ని తోసే ప్రమాదముంది [illegible] తిరిగి దాన్ని కిందినుంచి తీసి పోర్టరు [illegible]యంతో పై బెర్తుమీద జాగ్రత్తగా అమర్చాడు.

పోర్టర్ని డబ్బులిచ్చి పంపేసి, [illegible] దిగా సీట్లో కూచుని, వాచీ చూసుకున్నాడు కాంతారావు. రైలు కదలటానికి ఇంకా [illegible] వుంది. తను కాస్త ముందుగా వచ్చేస్తుంటే ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళి టీ డ్రింక్ తాగిరావటానికి వీలయ్యేది. కాని తనేం చెయ్యగలడు? హైరానా పడిపోతోందని మామయ్య గోలపెడుతున్నా, అత్తయ్య మాత్రం ఆ జాడీనిండా ఆవకాయ నుక్కుతుంటే, దాన్ని బందోబస్తుగా పార్సిల్ చెయ్యటంతో టైమంతా గడిపేసింది.

కాపురంలో తన కుటుంబంలో అందరికీ ఆవకాయ తినటం చేతయినట్టుగా, చెయ్యటం చేతకాదు. అయినా అందరికీ - ముఖ్యంగా నాయనమ్మకు - అత్తయ్య పెట్టిన ఆవకాయంటే ప్రత్యేకమైన మమకారం. అందుకే నాయనమ్మ యీ సంవత్సరం యింట్లో ఆవకాయ పెట్టొద్దని ఆర్డరు జారీ చేసేసి, తన కూతురైన అత్తయ్యకు ఉత్తరం రాసింది, ఓ జాడీ నిండా ఆవకాయ పెట్టి పంపమని.

దాని ఫలితమే యీ జాడీ. మధ్యమధ్య దీన్ని రిక్షాల్లో, రైల్లో చేరవెయ్యలేక తనకి ప్రాణం కడబట్టుకొంది.

గార్డు విజిల్ వేశాడు.

ద్వారంలో గబగబా పెట్టెలోకి వచ్చిం[illegible] జడల కళ్ళజోడు. వస్తూనే కాంతారావు [illegible] ఎదురు సీట్లో తన సామాను సర్దించటం ప్రా[illegible]ంభించింది. ఇంతలో [illegible]లు కదిలింది.

ఆ యువతి అటువైపు తిరిగి కూలీతో మాట్లాడుతుండటం వల్ల, ఆమె మొహాన్ని పరిశీలనగా చూసే ప్రయత్నం చెయ్యలేదు కాంతారావు. ఆమె ఎవరో కాలేజీ విద్యార్థి అయివుంటుందని కాబట్టి, తనకు రైల్లో కాసేపు (దేవుడు మేలు చేస్తే తన స్టేషను వచ్చే వరకూ) 'అడ కంపెనీ' యోగం వుందని నమ్ముకుంటూ, తల వంచుకుని చేతిలోని సినిమా పత్రిక తిరగేయటం ప్రారంభించాడు.

కాని ఆ పత్రికలోని బొమ్మలపై మనసు లగ్నం చెయ్యటానికి వీల్లేకుండా, అతని ముక్కు పుటాలను కమ్మగా తగులుతూ ఆవకాయ పరిమళం వ్యాపిస్తోంది. అతడా పరిమళాన్ని తన్మయత్వంలో ఆఘ్రాణిస్తున్నంతలో, "హలో" అన్న పలకరింపు ఎదుటి సీట్లోంచి వినవచ్చింది.

అతడు తలెత్తి చూసి ఆశ్చర్యపడ్డాడు.

ఎదుటి సీట్లో కూచుని వున్న రెండు జడల కళ్ళజోడు ఎవరో కాదు. తన క్లాస్‌మేట్ పద్మజ. కాలేజికి వచ్చేటప్పుడూ ఓ డజన్ ఇష్టసఖీ మణులతో పరివేష్టించి





నడుస్తూ, మరో దశాబ్దం నుంచి అపరిచిత అబ్బాయిలు తనను 'డార్లింగ్' లాగా వుండేటట్లు అందాలు చిందిస్తూ, 'మిస్ కాలేజీ' అని బిరుదు పొందిన పద్మజ,

కాంతారావు ఆశ్చర్యంలోంచి తేరు కొనే లోపల "ఎక్కడికండీ?" అని అడిగింది పద్మజ.

"ఒంగోలు దండీ"

"ఒంగోలు మీ సొంతవూరా?"

"అవును. మీరెంత వరకూ?"

"నెల్లూరుకు. మా సొంతవూరు. విజయవాడే నను కోండి'... చిరునవ్వుతో మాట్లాడుతున్న పద్మజ పలు వరుస ఎర్రని పెదవుల్లోంచి తళుక్కుమంటుంది. ఆమె అందమూ, చొరవా, ఆశ్చర్యం కలిగించటమే కాక, ఇంకా ముందుకు రావటం వల్ల, మన్ని ప్రశ్నలు వేద్దామనుకుంటే మాటలు తడబడ్డాయి అతడికి. చిన్నప్పటినుంచి చదువుతున్నా, అమ్మాయిలతో మాట్లాడాలంటే భయం అతడికి.

అతని బిడియాన్ని గుర్తించిందేమో, పద్మజ కూడా సంభాషణని పొడిగించలేదు. అతడు చేతిలో పత్రిక పట్టుకుని చదవకుండా బయటికి చూస్తూ వుంటే ఆమె ఏమనుకుందో ఆ మేగజైను? అంటూ తీసుకుంది. అలా మేగజైన్ తీసుకునేటప్పుడు ఆమె చేతివేళ్ళు అతడికి తగిలేసరికి ఆ స్పర్శతో షాక్ కొట్టినట్లయింది. తన కలాంటి అద్భుతమైన అనుభవం కలగటానికి ఆ మేగజైన్ కారణమయింది కాబట్టి, దాన్ని కొనటానికై తను చెల్లించిన రెండు రూపాయిలు పూర్తిగా సద్వినియోగమయినట్లే అనిపించిందతడికి.

రైలు తెనాలి స్టేషన్ సమీపిస్తోంది. ఒకసారి తన ప్యాంటునూ, షర్టునూ చూసుకున్నాడు కాంతారావు. "ఓ ఫస్ట్ క్లాస్ మోతగా వున్నాయి." అనుకుంటూ తృప్తిగా టోపీని పీల్చుకుంటూ తల పైకెత్తి చూశాడు. గుండె గుభేలుమంది!

ఎందుకంటే అప్పుడతడికి తనకన్నా ఉత్సాహంగా పై బెర్తుమీద బైటాయించి ఘుమఘుమలు వెదజల్లుతున్న ఆవకాయజాడీ కనిపించింది. తను రిక్షాలో తెచ్చేటప్పుడో పైన సర్దేటప్పుడో, కొంచెం ఒలికిందేమో దానికి కట్టిన తెల్లనిగుడ్డ కొంతభాగం కొత్తావకాయ నూనెలో తడిసి ఎర్రగా ఫెళ ఫెళలాడుతోంది.

కాంతారావుకు భయంతోపాటు కోపం కూడా వచ్చింది. అత్తయ్య హస్తవాసి వల్ల సంక్రమించిన వాసనా వైభవం ఈ ఆవకాయకు ఎంతైనా వుండవచ్చుగాక! అంతమాత్రంచేత, తను మిస్ పద్మజతో మాట్లాడుతున్నప్పుడే యిది యింత గర్వంగా ఘుమాయించి పోవాలా? ఎన్నో కాలేజీ నాటకాల్లో, ఎలక్షన్‌లలో, సమ్మెల్లో పాల్గొన్న అధునాతన అభ్యుదయ హీరో కాంతారావు ఆవకాయ జాడీతో ప్రయాణం చేస్తున్నట్లు ఈవిడకు తెలిస్తే అప్పుడు ఏమిటి గతి?

అతని ఆందోళనను ఏమాత్రం ఖాతరు చెయ్యకుండా ఆవకాయ పరిమళం మరింత తీవ్రతరమవుతోంది. ఆ పరిమళం ఏ క్షణాన పద్మజ ముక్కుకు తగిలి, ఆమె ఆమె తలెత్తి జాడీవైపు చూస్తుందో, ఏ క్షణాన దాన్ని గురించి అడుగుతుందో అని అతడు హడలి పోతున్నాడు. చెమట లుగుడుగుడుంటున్నాడు.

రైలు తెనాలి స్టేషన్‌లో ఆగివుంది. పద్మజ మేగజైన్ చదవటం మానేసి, కిటికీలోంచే ప్లాట్‌ఫారంమీది సందడిని గమనిస్తోంది. రైలు మళ్ళీ బయల్దేరేలోగా ఆమె ఎప్పుడు తన దృష్టి జాడీవైపు మళ్ళిస్తుందో చెప్పలేరు.

జాడీ ఆమెకు కనబడకుండా ఓ టవల్ తీసి దానిమీద కప్పితే? మంచిదే, కాని అలా కప్పేటప్పుడు ఆమె గమనించి అసలు విషయాన్నంతా పసిగట్టేస్తే - అంతకన్నా ఘోరం వుండబోదు.


రైలు ఆగినంతసేపూ తను ఎదురుగానే వుంటే ఆమె జాడీనే గురించి అడుగుతుందన్న భయంతో అతడు రైలు దిగి ప్లాట్ ఫారం మీదికి వెళ్ళాడు. ఎప్పుడైనా ప్లాట్ ఫారం మీద అడుగు పెట్టగానే కాఫీ స్టాల్ వైపు దారి తీయటం అతడికి అలవాటు. కాని యిప్పుడున్న కష్ట పరిస్థితిలో కాఫీ మీద మనసు పోవటంలేదు.


కాసేపు ప్లాట్ ఫారం మీద అటూ యిటూ తిరిగి, రైలు కదల బోయేటప్పుడు పెట్టెలో ఎక్కాడు.

"కాఫీ కోసం వెళ్ళారా?" అంది పద్మజ. అతడు తిరిగి తన సీట్లో కూచున్నాక.

"లేదండీ"

"మరి?"





మరెందుకు వెళ్ళావో ఆమె తెలా చెప్పగలదు తను? నవ్వు నములుతూ, "ఊరికే. అలా తిరిగొద్దామని," అన్నాడు.

ఆ జవాబులో తృప్తిపడి తిరిగి నిమగ్నమై పోతుందని ఆశించాడతడు. కాని ఆమె దాన్ని మడిచి పెట్టేసి, గుడ్లగూబ లాగా (అని అతడి భావం) అటూయిటూ చూస్తోంది.

ఆమె దృష్టి పై బెర్తు వేపు పోకుండా వుండటానికని అతడే సంభాషణ కొనసాగించాడు - మాటలు తడబడుతున్నా,

"మరి, కాకడిలో మీ వారు ..."

ఆమె మొహం కొంచెం రంగులు మారింది. "యూసీ ... అయామ్ అన్‌మారీడ్" అంది.

"అహ. మీవారుకాదు, మీవాళ్ళు ... అంటే రిలేటివ్స్ ..."

"ఓ ... అదా! రిలేటివ్స్‌కాదు. నా చిన్నప్పటి స్నేహితురాలు, అరుణ అనే అమ్మాయి అక్కడ వుంది. చాలా రోజులుగా నన్ను రమ్మని వాళ్ళ భార్యాభర్తలిద్దరూ రాస్తుంటే యిప్పుడు బయల్దేరాను, వెళ్ళి నాలుగురోజులుండి రావచ్చుగదా అని..."

'అఘోరించకపోయారు, ఇద్దరూ' అనుకున్నాడు కాంతారావు. ఆ ముదనష్టపు స్నేహితురాలెవరో నెల్లూరులోనే వుండాలా? వుందెనుపో, యీ మహాతల్లిని రమ్మని, యిప్పుడే రావాలా? రేపిక్కడ చూడకపోతే కొంపలార్పుకు పోతున్నట్టు! ఒకవేళ రాసినా, యీ పిల్ల మగరాయుడి లాగా బయల్దేరి రావటమేమిటి, తన ఖర్మ కాకపోతే?...

ఈ విధంగా కొనసాగుతున్న కాంతారావు స్వగతం టక్కున ఆగిపోయింది, పద్మజ వేసిన ప్రశ్నతో.

"అద్సా! ఎక్కడిదండీ ఆవకాయ వాసనా?"

పడ్డది పిడుగు!

అయినా ధైర్యం వహించి, ఆమె ప్రశ్నను విననట్టు నటిస్తూ, మేగజైన్‌లో తల దూర్చాడతను. కాని పద్మజ అతన్ని వదిలిపెట్టే ధ్యాసున్నట్టు లేదు.

"ఏమండోయ్, మీకు రావటంలేదా ఆవకాయ వాసన?"

అతను వెర్రి మొహంతో తలెత్తి "ఎక్కడా?" అన్నాడు.

"అదే, తెలీటంలేదు" అంటూ పద్మజ పెట్టె అంతా కలయజూచి, "అదిగో" అంది పైన చూపిస్తూ.

"ఓహో" అన్నాడతను, అది తన దేనని చెబుదామా వద్దా అనుకుంటూ.

"ఎవరిదో," అంది పద్మజ.

"అదే నాకూ తెలిటంలేదు." అనేసి, కాసేపాగి "ఎవరో మరిచిపోయి వెళ్ళుంటారు. పాపం," అన్నాడతడు.

"పాపమేం లెండి. అలాంటి వాళ్ళను పాపం అనకూడదు. లేకపోతే, వాచిపోయి చస్తున్నట్లు ఇంతింత పెద్ద జాడీల్లో అవకాయ నెత్తినేసుకు రావటం దేనికి? తెచ్చాక దాన్ని జ్ఞాపకంగా దింపుకోవద్దూ వెధవసజ్ఞా కాకపోతే ..."


ఆ మాటలు కొరడా దెబ్బల్లా తగులుతున్నాయి కాంతారావుకు. కాని అవన్నీ మౌనంగా భరించక తప్పేటట్టులేదు. "అలా తిట్టకండి పాపం. మతిమరుపు మానవసహజంకదా!' అందామనుకున్నాడు కాని, అలా అంటే జాడీ తనదేనని పద్మజకు అనుమానం కలగొచ్చు; నన్న భయంతో వూరుకున్నాడు.


పద్మజ మళ్ళీ అంది "అసలలాంటి మతి మరపు మనుషులు ప్రపంచంలో వున్నారనుకుంటే, నాకు ఆశ్చర్యానికి బదులు కోపం వస్తుంటుంది. నాన్సెన్స్ ఫూల్స్! అసలు వాళ్ళు అన్నం తింటారో, మరేమైనా తింటారో -"

నోటమాట రాలేదు కాంతారావుకు. ఏం తింటే యీ విడ్డ కెందుకు? యీవిడ పూర్వీకులంతా అన్నానికి బదులు వాయుభక్షం చేశారేమో

"ఏమండీ మాట్లాడరు?" అంది మళ్ళీ పద్మజ.

కోపాన్ని కష్టంగా అణుచుకున్నాడు కాంతారావు. ఈవిడతో ఎవరేం మాట్లాడగలరు? భవిష్యత్తులో యీ పిల్లను





చేసుకోబోయే అభాగ్య మగ జీవికూడా ఏమీ మాట్లాడలేక, పెళ్ళయినే మర్నాడే కాశీయో, హరిద్వారమో చేరవలసిన వాడే కదా - అనుకున్నాడతను.

పైకిమాత్రం నిర్లక్ష్యం కనబరుస్తూ "పోనిద్దురూ - వెధవజాడీ - ఎవరిదయితే మనకెందుకు?" అన్నాడు.

"అయ్యో, అలా అంటారేమిటి? ఆవకాయంటే మీ కసహ్యమా?"

కాంతారావుకు కొద్దిగా ధైర్యం వచ్చింది. ఎబ్బే, అసహ్యం లేదు. చాలా యిష్టం. ఆమాటకొస్తే ఆ జాడీ నాదే. తమాషాకు నాది కాదని చెప్పాను. అనేద్దామనీ అనిపించింది. కాని అందుకు తరుణం మించిపోయిందని వూరుకున్నాడు. పద్మజకు జవాబుగా, "అసహ్యం లేదుగానీ, నేను పికిల్సు అట్టే రెలిష్ చెయ్యనండీ. ఎవడు తింటాడీ పాతకాలపు వంటలు - ఈ ఆధునిక యుగంలో కూడా ..." అన్నాడు.

"అది నేనొప్పుకోను. ఎంత ఆధునిక యుగంలోకూడా...." అన్నాడు.

"అది నేనొప్పుకోను. ఎంత ఆధునిక యుగంలోనైనా మన నాలుక రుచి పూర్తిగా తల క్రిందులై పోతుందంటే ఒప్పుకోవటం కష్టం," అంది పద్మజ.

నాలుక రుచి సంగతి అలా వుంచి, యీ మాటలకు నాలుక వెళ్ళబెట్టాడు కాంతారావు.

మళ్ళీ అంది పద్మజ. "నా మట్టుకు నాకుమాత్రం ఆవకాయకొక ప్రత్యేకత వుందనిపిస్తుంది. అది తెలుగు సంస్కృతిలో ఒక భాగమనికూడా చెబుతుంటాన్నేను. అందుకే, మా యింట్లో వంట మనిషి అరడజన్ కూరలూ, సాంబారులూ తెచ్చి టేబుల్‌మీద వుంచినా, ముందుగా ఆవకాయ రుచి తగలందే ఆవేవీ గొంతులోకి పోవు నాకు...."

కాంతారావు పశ్చాత్తాపంతో తనమీద కోపంతో దహించుకు పోతున్నాడు. ఈవిడకు ఆవకాయ ఇష్టమని ముందే తెలిసుంటే తను గర్వంగా ఛాతీమీద చెయ్యి వేసుకుని, "ఆ జాడీ నాదే. మా అత్తయ్య స్పెషల్‌గా పెట్టింది!" అని ప్రకటించి వుండేవాడుకదా? ఇప్పుడేమనుకున్నా ఏం లాభం? తనది కాదని చెప్పాక, రైలు దిగేటప్పుడు దాన్ని తీసుకెళ్ళటం ఎలా?

రైలుపెట్టె అంతా దాదాపు ఖాళీగా



వుంది. ఓ మూల కూచునివున్న మరో యిద్దరు ప్రయాణీకులు హాయిగా నిద్ర సేవిస్తూ వుండడంవల్ల, వీళ్ళ సంభాషణను వినటంలేదు.

"ఆవకాయంటే నాకంత మమకారం కాబట్టే, ఆ జాడీని అలా మరిచిపోయి వెళ్ళినవాళ్ళమీద అంత కోపం వచ్చింది నాకు. అసలలాంటి మనుషులు ప్రపంచంలో ఎందుకున్నారా అని ..." అంది పద్మజ మళ్ళీ.

కాంతారావుకు మండుకొచ్చింది ఎందుకుండకూడదు? ఉంటే యీవిడకేం కష్టం? వాళ్ళంతా వచ్చి యీవిడ్ని చావగొట్టడం లేదుకదా? తీరిగ్గా కూచుని మాట్లాడుతోంది - తనకు లేనిపోని సమస్య తెచ్చిపెట్టింది చాలక !

"ఆవకాయ ఫ్రెష్‌గా ఉన్నట్టుంది హబ్బ! ఏం వాసనా...." అంది పద్మజ వాసన పీలుస్తూ.

"షటప్" అందామనుకున్నాడు కాంతారావు కోపంతో. కాని అలా అనుకోవటం వరకేకదా తను చెయ్యగలిగింది!

రైలు చీరాల స్టేషన్ దాటింది.

"ఇంత విలువైన ఆవకాయ ఇప్పుడెవరి చేతిలో పడబోతోందో పాపం," అంది పద్మజ.

కాంతారావుకు కొద్దిగా ఆశ అంకురించింది. 'ఎవరి చేతుల్లోనో పడటం దేనికి? నేనే తీసుకు వెడతాను. అందామనుకున్నాడు. కాని ఇవన్నీ పాతకాలం వంటలని తీసి పారేశాక, యిప్పుడిలా అనటం బాగుంటుందా ?'

అందుకని, ఆ వుద్దేశం మార్చుకుంటూ, "ఎవరి చేతుల్లో పడినా మనకేం నష్టం లేద్దురూ ?" అన్నాడు, లోలోపల కుమిలిపోతూ.

"అలాగనకండి. అది పోయి ఏ హోటలు తిండి తినే నాసిరకం చచ్చు మనుషుల చేతిలో పడటం నాకు నచ్చదు. కాబట్టి ఏం చేద్దామంటారు ?"

"మీరే చెప్పండి ;" అన్నాడతడు.

"అలాగయితే ఓపని చేద్దాం....ఎటూ నేను నా ఫ్రెండ్ దగ్గరకి వెళ్తున్నాను కాబట్టి, తీసుకెళ్ళి దానికి ప్రెజెంట్ చేస్తాను. వాళ్ళక్కూడా ఆవకాయ ఇష్టమే అయినా, కొత్త కాపురం కాబట్టి తయారు చేసుకునే పాటి తీరిక వుండక పోవచ్చు. ఇంత మంచి కొత్తావకాయ అనుకోకుండా దొరికితే మా అరుణ సంబరపడిపోతుంది ...,ఏమంటారు ?"

"బాగుంది అయిడియా," అని అభినందించాడతడు.

"పోనీ మీరు తీసుకెళతానంటే తీసుకెళ్ళండి ... నా ఫ్రెండుకి నేనేం ఆవకాయ తీసుకొస్తానని ప్రామిస్ చెయ్యలేదు కదా !"

సంభాషణ యిక్కడి దాకా వచ్చాక, తనే తీసుకెళతాననటానికి అతడేం ఆత్మగౌరవం లేనివాడా ? ట్రిమ్‌గా, కూలింగ్ గ్లాసులు వేసుకుని, బూట్లు టక టక లాడించుకుంటూ బహుదర్జాగా నడిచేవాడు, 'ఆవకాయ కోసం ఆశపడతాడని ఊహించుకోవటమూ ! అంతకన్నా ఆత్మహత్య మేలు.

"నో నో. నాన్సెన్స్. డర్టీ. ఈ తగలాటం నా కెందుకు చెప్పండి ? అసలు, రైలు దిగాక నా టెన్నిస్ బ్యాట్ మోసుకెళ్ళటమే నాకు కష్టం. అలాంటిది యీ ఆవకాయ జాడీ, దాని మీద ఆవకాయ మరకలలో ఆ గుడ్డా - పట్టుకెళ్ళాలంటే ఓ ! హారిబుల్," చాలా ఠీవిగా అన్నాడతడు.

"నాకేం అలాంటి అభ్యంతరాలు లేవనుకోండి. కానీ, ఇంత పెద్ద జాడీని ఎలా పట్టు కెళ్ళటమా అని చూస్తున్నా .... ఉండండి చెప్తాను," అంటూ తన సూట్ కేస్ తెరిచి దానిలోంచి ఓ కాన్వాస్ సంచీ బయటికి లాగింది పద్మజ.

"ఓ హెల్ప్ చేస్తారా ?" అంది.

"రెడీ. చెప్పండి."

"ఆ జాడీని కాస్త కిందికి దించి యీ సంచీలో సర్దగలరా ?"

"ఓ, దానికేం భాగ్యం," అంటూ సంచీ చేతిలోకి తీసుకున్నాడు కాంతారావు. అది చాలా పెద్ద సంచీ. "కిలాడీ పిల్ల, రైల్లో యిలాంటివి కొట్టుకు పోయేందుకే తెచ్చినట్టుంది, గోతంలాంటి సంచీ" అనుకున్నాడు.

అతడు ఏడుపు మొహంతో జాడీని బెర్తు మీంచి కిందికి దింపుతోంటే పద్మజ తన సీటులోంచి కదలకుండానే, "చాలా ట్రబులిస్తున్నాను మీకు," అంది.

"అబ్బె ... ఇట్స్ ప్లెజర్" అన్నాడతడు. లోపల మాత్రం, "నా జాడీని గద్దలాగా తన్నుకుపోయి నువ్వేం బాగుపడతావులే..." అనుకున్నాడు.

జాడీని ఆ సంచీలో జాగ్రత్తగా సర్ది, దాన్ని ఆమె సామాన్ల పక్కనే అమర్చాడతడు.

"థ్యాంక్సండీ," అంది పద్మజ.

మరొక సందర్భంలోనైతే కాలేజీ బ్యూటీ పద్మజనుంచీ అందిన ఈ థాంక్స్‌ను హృదయంలో జాగ్రత్తగా భద్రపరచుకునేవాడు కాంతారావు. కాని ఇప్పుడా సౌందర్యారాధన గురించి పట్టించుకునే స్థితిలో లేడతను. అంచేత, అతడికి వినబడలేదేమోననుకొని మళ్ళీ, "థాంక్సండోయ్" అంది పద్మజ.

ఈసారికూడా అతడు "నో మెన్షన్" అనలేదు. "నీ మొహం మండ" అని మాత్రం అనుకున్నాడు.

ఒంగోలు స్టేషన్ దగ్గర పడుతోంది. కాంతారావుకు నీరసం లాంటిది ఆవరిస్తోంది ... "ఈ చేతుల్తో అత్తయ్య దగ్గర్నుంచీ ఆవకాయ జాడీ అందుకున్నాను. కాని ఈ చేతుల్తో దాన్ని నాయనమ్మకు అందిద్దామనుకున్నాను. కాని ఈ చేతులతోనే దాన్ని ఈ తాటకి (మిస్ పద్మజ !) సంచీలో సర్దేశాను. భగవాన్ ! ఏమిటీ అన్యాయం ?" అని ఆక్రోశించాడతడు.

ఒంగోలు స్టేషన్‌లో రైలాగింది. "వెళ్ళొస్తానండీ" అని పద్మజతో చెప్పి ఆమె నవ్వుతో యిచ్చిన వీడ్కోలును ఏడుస్తూ అందుకుని, మౌనంగా ఆవకాయ జాడీకికూడా భారమైన వీడ్కోలు ఇచ్చిపెట్టి, బెడ్డింగు మాత్రం వేరొకచేతా పట్టుకుని రైలు దిగాడు కాంతారావు. ●

శ్యామ్రాంలజీ-57

(గత సంచిక తరువాయి)

శ్యామ్రావ్ లైన్‌లో నిలబడ్డ ఓ వ్యక్తిని పిలిచాడు.

"నీ పేరేంట్రా ?"

"కొండిగాడండీ -"

"ఎంతవరకూ చదివావ్ నువ్వు ?"

"సదువెక్కడిదండీ - అఆఇఈలన్నీ వచ్చండీ - అంతొరకే -"

"మరి ఏం ఉద్యోగం చేస్తున్నావ్?"

"ఒకటనేం లేదండీ - రైల్లో బఠానీ లమ్ముతుంటాను - అంతకుముందు హోటల్లో క్లీనర్‌గా పని చేశాను-"

"నాటకాల అనుభవం ఏమయినా వుందా ?"

"ఉందండీ! శివరాత్రినాడు మా హోటల్ ఎనక ఆడిన నాటకం సగం చూశానండీ -" "అప్పట్నుంచీ టీ.వి.లో 'ఈరో' వేషం ఏయాల్నుంది దండీ-"

శ్యామ్రావ్ కొడుకు రమణారావ్ అందుకున్నాడు వెంటనే-

"హీరో వేషం నీకిస్తే మాకెంత డబ్బి వ్వగలవ్ ?"

"ఎంతండీ! అంతా కలిపి నా దగ్గర ఆరొందల పాతికుందండీ-అంతా ఇచ్చేత్తా నండీ -"

"ఆరొందల పాతిక్కి హీరో వేషమా? వెళ్ళెళ్ళవయ్యా! ఏదొక చిన్న వేషం అయితే ఇస్తాం -"

"ఏదొకటి ఇయ్యండిసార్! టీ.వి.లో బాగా యాక్షన్ చేయాలనుందినాకు -" శ్యామ్రావ్ రమణారావ్‌తో మాట్లాడాడు.


"పోనీలే-ఏదొకటి ఇద్దాంగాని ఆరొందలూ తీసేసుకో -"

రమణారావ్ డబ్బు తీసుకున్నాడు.

"ఆ! ఇదిగో చూడు! నీ పేరు కొండి గాడుకదూ - నువ్ వేషం వేయటమేకాదు. మా ప్రొడక్షన్ జరిగినన్ని రోజులూ భోజనాలు వడ్డించటం, ప్లేట్లు క్లీన్ చేయటం-సామాన్లు మోయటం లాంటివన్నీ కూడా చేయాలి -"

యర్రంశెట్టి సాయి

తెలుగు టి.వి. వచ్చేసింది




"ఓ - అట్నే బాగా చేస్తాసార్ -"

"అయితే రేపు మాటింగ్ ఇంటికొచ్చే సెయ్ - ఎనిమిది గంటలకే షూటింగ్ స్టార్టవుతుంది"

"అలాగే సార్ -" వాడు వెళ్ళిపోయాడు.

అదంతా చూస్తుంటే మాకు మతిపోయి నట్లయింది.



టి.వి. కార్యక్రమాల్లో ఎవరయినాసరే నటించ వచ్చని మాకు తెలుసుకానీ మరీ ఇలాంటి నటులుకూడా ఎన్నికవుతారని తెలీదు.

రెండుగంటల్లో ఆర్టిస్ట్ ల సెలక్షన్ పూర్తయిపోయింది.

"ఎంతమందిని సెలక్ట్ చేశావ్ ?" రమణారావ్ని అడిగాడు శ్యామ్రావ్

"నూట అరవై మంది అయారు !"

శ్యామ్రావ్ ఆశ్చర్య పోయాడు.

"అదేమిటి? మనక్కావలసింది వంద మందేగా ?"

"ఇంకో అరవై కొత్తపాత్రలు ఇవాళ రాత్రికూర్చుని రాసేస్తాన్లెండి ! వచ్చే డబ్బు ఎందుకు వదులుకోవటం - చాలా మంది రెండు వందలకంటె ఎక్కువ ఇవ్వలేమంటున్నారు. అందుకని తప్పదు మరి -"

"అదేమిటి ? స్క్రిప్ట్ మీరే రాశారా ?" రమణారావ్ నడిగాడు రంగారెడ్డి.

"అవును ! ఇంకెవరు రాస్తారు ?"

"టి.వి. స్క్రిప్టులు రాయటం తెలిసిన రచయిత ఉండాలికదా -" అన్నాడు శాయిరామ్.


శ్యామ్రావ్, రమణారావ్ ఇద్దరూ పగలబడి నవ్వారు.

"ఇదేం సినిమా అనుకున్నారా ! చెత్త స్క్రిప్టు అయితే జనం చూడరని భయపడటానికి ! ఏ చెత్త అయినా చచ్చినట్లు చూడాల్సిందే - మనకు మరింకేంఖర్మ - బోలెడు డబ్బు పోసి గొప్ప రచయితల దగ్గర కెళ్ళటానికి -"

ఇంక లాభం లేదని మేము వచ్చేశాము.

ఆ మధ్యాహ్నానికల్లా షూటింగ్ ఏర్పాట్లన్నీ పూర్తి అయిపోయాయ్. మర్నాడు షూటింగ్ చేయాల్సిన స్క్రిప్టు గురించి కెమెరామెన్, డైరెక్టర్ బోసుబాబూ కాలనీ స్టేజ్ దగ్గర చర్చించి కుంటున్నారు. మిగతా అందరం వాళ్ళచుట్టూ మూగి ఆసక్తిగా చూస్తున్నాం. తర్వాత బోస్ మా కాలనీ ఆర్టిస్టులందరికీ టి.వి.కి, స్టేజికి నటనలో చూపాల్సిన తేడా గురించి ఉపన్యాసం ఇవ్వసాగాడు.

"మీ అందరికీ డ్రామా ఎక్స్పీరియన్స్ ఉందని నాకు తెలుసు - ఇందులో కొంతమంది గవర్నమెంట్ టి.వి. నటు



లున్నారనికూడా నాకు తెలుసు. మీరందరూకూడా తెలుసుకోవలసిందేమిటంటే, మీరు నటన శరీర మంతటితో చేయటం తగ్గించి ఎక్కువగా మొఖంతో ప్రదర్శించటం నేర్చుకోవాలి-"

అప్పుడే ఓ వ్యక్తి ఆటో దిగి మా దగ్గరకు రావటం కనిపించింది. తాగిన వాడిలా తూలుతూ మా దగ్గరకొచ్చాడు.

"మీతో ఒణ్ మినిట్ మాట్లాడాలి!" అన్నాడతను.

"మీరెవరు? ఏం మాట్లాడాలి" అడిగాడు గోపాల్రావ్.

"షాలా అర్జెంట్ విషయం."

"మాట్లాడండి మరి?" అన్నాడు రంగారెడ్డి వినడానికి రేడి అవుతూ.

అతను నిషాగా నవ్వాడు "ఆహాహాహ ఆహాహాహ - ఇక్కడ కాదు - మనం షీక్రెట్‌గా మాట్లాడాలి-ఇంతకూ షాయీరామ్ ఎవరు?" అడిగాడతను.

"నేనే - ఏమిటి సంగతి?" అడిగాడు శాయీరామ్ ముందుకొచ్చి.

"మా కాలనీలో తీసే టి.వి. సీరియల్‌కి మీరే ప్రొడ్యూషర్ అని షెప్పారు ఎవరు షెప్పారు అని అడక్కండి - ఆహా హాహా - అహాహాహా" అంటూ నవ్వాడు మళ్ళీ.

"అడగం లెండి -"

మేము అరడజను మంది అతనిని తీసుకుని పక్క కెళ్ళి నిలబడ్డాము.

"చెప్పండి మీరెవరసలు?"

అతను తూలి ంకిద పడబోయి రంగారెడ్డి చేయి పట్టుకుని పడకుండా నిలబడ్డాడు మళ్ళీ.

"నన్ను ఇంకా గుర్తు పట్టలేదా మీరు ఆహాహాహ - ఆహాహాహ - నేనుషార్! మీరు అదివరకు టి.వి. స్టేషన్లో డ్రామా వేశారు కదా! అప్పుడు నేను కాజువల్ వర్కర్‌గా ఉండేవాడిని. దేవుడి దయవల్ల రెండేళ్ళల్లో ప్రొడ్యూసరయి పోయాను- ఆహాహాహ - ఆహాహాహ-మా అంకుల్ ఢిల్లీ దూరదర్శన్‌లో ప్యూన్ అందుకని ఆహాహాహ - ఆహాహాహ -"

"ఇంతకూ ఇప్పుడేమంటారు?" అడిగాడు రంగారెడ్డి.

"ఏమనేదేముందిషార్! మనకి డైరెక్షన్ చేయటమంటే చాలా ఇష్టం! నాకు పదహారు అవార్డులు కూడా వష్చాయ్!

మా బామ్మర్దికి కూడా డైరెక్షన్ అంటే తెగిష్టం! అందుకని వాడికి మీ టి.వి. సీరియల్ డైరెక్షన్ ఛాన్స్ ఇమ్మని అడగటానికొచ్చాను - ఆహాహాహ ఆహాహాహాహ -"

అందరం మొఖాలు చూసుకున్నాక,

"డైరెక్షన్ చేయడానికి మీ బామ్మర్దిని ఏ క్వాలిఫీకేషన్స్ ఉన్నాయ్?" అడిగాడు జనార్థన్.

అతను నవ్వటం ఆపేశాడు.

"ఏమిషీ? క్వాలిఫికేషనా? టి.వి. సీరియల్ డైరెక్షన్ చేయడానికి క్వాలిఫికేషనెందుకు?" ఆశ్చర్యంతో అడిగాడు.

"ఏమీ తెలీకుండా మరెలా తీస్తాడు?"

"భలేవాళ్ళే - నాలుగు షీరియల్స్ తీస్తే ఆడికే అన్నీ తెలుస్తయ్ - మీరేం భయపడకండి! అయామ్ హియర్ అయామ్ హియర్ - ఆహాహాహ - ఆహాహాహ -"

"మీ షీరియల్స్ డైరెక్షన్ మాకొద్దుగాని ఇక దయషేయండి - ఆహాహాహ - ఆహాహాహ -" అన్నాడు శాయీరామ్ హేళనగా.

అందరూ ఘొల్లున నవ్వారు.


అతనికి కోపం వచ్చేసింది.


"నన్ను ఇన్సల్ట్ షేష్తారా? ఆ! నన్ను ఇన్సల్ట్ షేష్తారా? టి.వి. ప్రొడ్యూషర్ బామ్మరిదికి డైరెక్షన్ ఛాన్స్ ఇయ్యనంటారా? ఎంత ధైర్యం మీకు. మీరింక జన్మలో టి.వి. మొఖం షూడకుండా షేష్తాను-మీ కాలనీటోళ్ళ కసలు టి.వి. - ప్రోగ్రామ్స్ రాకుండా టి.వి. టవర్‌లో మార్పులు షేషేస్తా!" అంటూ కింద పడిపోయాడు. అందరం కలసి అతనిని లేపి నుంచోబెట్టాము. అతను మళ్ళీ పడిపోయాడు. ఇలా అయిదారుసార్లు జరిగాక అతనిని ఓ ఆటో పిలిపించి అందులో ఎక్కించాము.

"రేయ్ - మా బామ్మర్దికి డైరెక్షన్ ఇవ్వనన్నారు కదూ! మీ షీరియల్ ఎలా బయటికొస్తుందో నేను షూస్తా" అంటూ వెళ్ళిపోయాడతను.

"పోపోరా రమ్ బాటిల్" అరిచాడు గోపాల్రావ్.

మర్నాడు షూటింగ్ అనుకున్నట్లే ప్రారంభమయి పోయింది. బోస్‌బాబు తన సినిమా టెక్నిక్ అంతా ఉపయోగించి మొదటి ఎపిసోడ్ మూడురోజుల్లో పూర్తి చేశాడు.





ఎడిటింగ్, మ్యూజిక్ వగైరాలు పూర్తయేసరికి మరో నాలుగు రోజులు పట్టింది. సీరియల్ తాలూకూ మొదటి ఎపిసోడ్ కాసెట్ తీసుకుని అందరం టి.వి. స్టేషన్‌కి చేరుకున్నాం, అప్పటికే క్యామ్రాలాప్, వాళ్ళబ్బాయ్ రమణారావ్ టి.వి. స్టేషన్‌లోనుంచి బయటికొస్తున్నారు.

"ఏమిటి? మీ మొదటి 'ఎపిసోడ్ ఇప్పుడు తెస్తున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు మమ్మల్ని చూసి.

"అవును - ఏం?"

"ఇంత స్లో అయితే ఎలా? నేను వారంరోజుల్లో అరడజను ఎపిసోడ్స్‌కి ఎడిటింగ్, మ్యూజిక్ అన్నీ పూర్తి చేసేశాను-"

అదిరిపడ్డాం అందరం.

"ఏడురోజుల్లో ఆరు ఎపిసోడ్స్ షూటింగ్ చేసేశారా?" నమ్మలేనట్టు అడిగాడు కాయీరామ్.

"మొత్తం పదమూడూ షూటింగ్ అయిపోయినయ్ అనుకోండి - ఎడిటింగ్ మ్యూజిక్ మాత్రం ఆరింటికీ పూర్తి అయింది, వాటన్నిటినీ టి.వి. వాళ్ళు ఓ.కే. చేసేశారుకూడా! రేపే బొంబేవెళ్ళి మాంఛి స్పాన్సరింగ్ కంపెనీని పట్టుకుని అమ్మేసి వస్తాం -" అంటూ వెళ్ళిపోయాడు వాళ్ళు.

మేమంతా బోసుబాబు వేపు చూశాం అనుమానంగా. బోసుబాబు కంగారు పడిపోయాడు.


"అలా చూడకండి గురూ! వాడెలా తీశాడో నాకు తెలీదు గానీ ఒక ఎపిసోడ్‌కి కనీసం రెండు రోజులయినా షూటింగ్ జరగాలి. లేపోతే స్టేజ్ డ్రామా లాగా అయిపోతుంది - మన స్క్రిప్టులో కొంచెం లొకేషన్స్ ఎక్కువ కాబట్టి ఇంకో రోజు ఎక్కువ పట్టింది-" అన్నాడు సమర్థించుకుంటూ.

"మీ కాసెట్‌ని మా దూరదర్శన్ కమిటీ వాళ్ళు చూసి అందులో లోపాలేమీ లేకపోతే ఓ.కే. చేస్తారులెండి! పది రోజుల తర్వాత కనిపించండి -"

పది రోజుల తర్వాత అందరం మళ్ళీ టి.వి. స్టేషన్ కెళ్ళాం.

"వచ్చేశారా? వెరీగుడ్! ఇప్పుడే మీకు లెటర్ పోస్ట్‌చేద్దామనుకుంటున్నాం! ఇదిగో మీ లెటర్ -" అంటూ ఓ లెటర్ మా చేతికిచ్చాడు.





అందరం గుమికూడి చదివాము.

1.) ఆర్టిస్ట్‌ల నటన బావుండలేదు.

2.) కొన్ని పాత్రలు ఉపయోగించిన కొన్ని పదాలు బాగుండ లేదు.

3.) మ్యూజిక్ బాలేదు.

అందరికీ ఆ కాగితం చదివే సరికి వళ్ళు మండి పోయింది.

"ఆర్టిస్ నటన మీకు నచ్చలేదా ? ఆ మాటంటానికి మీరెవరు ? మీ టి.వి. లో గానీ, కమిటీలోగానీ నటనలో డిప్లొమాలు తీసుకున్న వాళ్ళుగానీ, ఆంధ్ర ప్రదేశ్ అంతటా గొప్ప నటుడుగా గుర్తింపు పొందిన వారు గానీ ఉన్నారా?" అడిగాడు శాయిరామ్ కోపంగా.

అధికారి మండి పడ్డాడు.

"మీకు లక్షసార్లు చెప్పాను - గవర్నమెంట్‌ని, టి.వి అధికారులను ప్రశ్నించే అధికారం ఎవ్వరికీ లేదని ! మళ్ళా ఎందుకలా అరుస్తున్నారు ?"

అందరం సైలెంటయిపోయాము.

గోపాల్రావ్ నెమ్మదిగా కల్పించుకున్నాడు.

"ఆర్టిస్ట్‌ల నటన సంగతి అలా వదిలేయండి సార్ ! పాత్రలు మాట్లాడిన కొన్ని మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు."

"అవును ఉన్నాయ్ -"

"స్క్రిప్టు మీరే ముందు మంజూరు చేశారు కదండీ !"

"చేశాం ! కాదని ఎవరన్నారు ?"

"మరి మీరు అంగీకరించిన స్క్రిప్టుకే మీరు ఎందుకు అభ్యంతరం చెప్తున్నారు?"

"ఆ మాత్రం కామన్‌సెన్స్ లేదటయ్యా! స్క్రిప్టు చదివే వాళ్ళు వేరు - అది వీడియో సినిమాగా తీశాక చూసే కమిటి మెంబర్లు వేరు - అంచేత ఎవరి టేస్ట్ వాళ్ళది - మధ్యలో ప్రశ్నించ డానికి మీరెవరు?"

గోపాల్రావ్‌కి కోపం వచ్చింది.

"ఆల్‌రైట్ ఈ విషయం మేము దూరదర్శన్ డైరెక్టర్ గారితో మాట్లాడదల్చుకున్నాం -"

"అయితే వచ్చే నెల పదహారో తారీఖురండి -"

"అదేమిటి ? ఇప్పుడెందుకు మాట్లాడకూడదు ?"

"ట్రాన్స్‌లేటర్ లేడిప్పుడు! వచ్చేనెల పదహారో తారీఖునే వస్తాడతను -"

అందరం మొఖాలు చూసుకున్నాం.

పచ్చి.

"ట్రాన్స్‌లేటరా? ట్రాన్స్‌లేటరేమిటి ?"

"అదేనయ్యా - స్టేషన్ డైరెక్టర్‌తో మీరెలా మాట్లాడగలరు ? ఆయన భాష మీకు తెలీదు, మీ భాష ఆయనకు తెలీదు. అందుకని అనధికార పూర్వకంగా ఓ ట్రాన్స్‌లేటర్‌ని ఏర్పాటు చేశాం ! ఆ ట్రాన్స్‌లేటర్ ఒక్కడికే బీహారీ భాష వచ్చు-"

"బీహారీ భాషెందుకు రావటం ?"

"స్టేషన్ డైరెక్టర్ మరి బీహార్‌కి చెందినవాడు గనుక ! ఆమాత్రం కామన్ సెన్స్ లేదామీకు !"

"దాబ్బాయి - ఇప్పుడు మమ్మల్నేం చేయమంటారో చెప్పండి !"

"అలా దారికిరండి ! రూల్సూ, రూల్సూ అంటే మీ సీరియల్ మొదటి భాగం పట్టుకుని మా స్టేషన్‌చుట్టూ, కోర్టు చుట్టూ తిరిగి రిటైరయి పోతారు ...మీరు ఈ షూటింగ్‌కోసం ఇంతవరకూ చేసిన ఖర్చుకూడా గోవిందా గోవిందా -"మాకు భయం వేసింది.

"అంటే ఇప్పుడు మళ్ళీ షూటింగ్ చేయక తప్పదంటారా ?"

"తప్పదయ్యా! తప్పదన్నాక తప్పదు."

"పోనీ మార్పులు షూటింగ్ చేసు కొచ్చాకయినా ఇంకేట్రబులూ లేకుండా ఓ.కే. చేస్తారా ?" అడిగాడు జనార్ధన్.


అధికారి కోపంగా లేచి నిలబడ్డాడు తన సీట్లోనుంచి


"ఏయ్ - ఇక్కడినుంచి పోతారా లేదా ?"

"ఎందుకండీ అంతకోపం ? మావాడు పొరపాటుమాట్లాడితే చెప్పండి వింటాడు" అన్నాడు రంగారెడ్డి.

"లేపోతే ఏమిటయ్యా! వారానికోసారి మారిపోతుంటాయ్. మరి అప్పటి సంగతి ఇప్పుడెదా చెప్పమంటారు ? ఇవాళ "ఓర్నాయనో" అన్న పదం మీరు మీ సీరియల్లో ఎక్కువగా వాడారు. అయినా మేము అభ్యంతరం చెప్పటంలేదు. రేపు రెడ్ లైన్స్ మారి అదేమాకు చిరాకు కలిగించవచ్చు - అప్పుడు అది తీసేయమని మేము డిమాండ్ చేయవచ్చు-"

మేము ఇంక చేసేదిలేక వెనక్కి తిరి





గాము.

బయట గేటు దగ్గరే నిలబడి ఉన్నాడా లావుపాటి వ్యక్తి మమ్మల్ని చూసి తూలుతూ దగ్గర కొచ్చాడు.

"ఏయ్ - మర్యాదగా డైరక్షన్ మా బామ్మరిదికియ్యండ్రా అంటే ఫోజులు కొడతారా! ఒరేయ్ - మీ ఎపిసోడ్ స్క్రీన్ చేసిన కమిటీ మెంబర్లిద్దరిలో న్నొకళ్ళు డ్నిరా! అదసలు టి.వి.లో ఎలా వస్తుందో చ్చూస్తా ఆహాహాహా. ఆహాహాహా-" మాకు అప్పుడు అర్థమయింది. మా ఎపిసోడ్‌కి ఏవేవో వంకలు పెట్టి ఎందుకు రిజెక్ట్ చేసిందీనూ.

"బాస్ - మనం ఇలా ఊరుకుంటే లాభంలేదు - ముందు వీడిని చట్నీచేసేస్తాను-" అన్నాడు చంద్రకాంత్ ముందుకి దూకుతూ.

"అవ్ అన్నా - సాలేకో - ఖతమ్ కర్‌దేంగే" అన్నాడు యాదగిరి.

రంగారెడ్డి వాళ్ళిద్దరినీ వెనక్కి లాగేడు.

"ఏయ్ టి.వి. స్టేషన్లోకొచ్చి వాళ్ళ మీద చేయి చేసుకోవటం మంచిదికాదు, ఏదండి -"

అందరం కాలనీకి తిరిగివచ్చాం.

శ్యామల్రావ్ మా కోసమే ఎదురు చూస్తూ కనిపించాడు.

"ఏమిటి-మీ ఎపిసోడ్ రిజెక్ట్ అయిందటగా?" హేళనగా అడిగాడు.

"అవును - ఎంత బాగా తీసినా రిజెక్ట్ చేశారు-"

"పిచ్చివాళ్ళల్లారా! మీ రెప్పుడూ ఇంతే; అన్నిచోట్లా ఆలస్యమే! అన్నిట్లోనూ వెనక బడటమే! నా మాటవిని - నన్ను మీ ఏజెంట్‌గా పెట్టుకోండి. మీ 'ఎపిసోడ్' రెండురోజుల్లో ఓ.కే. చేయిస్తాను - నాకు పదివేలు కమిషన్ ఇవ్వండి చాలు -"

"నీకు పది వేలు కమిషన్ ఇవ్వాలా?"

"మీ ఇష్టం! బలవంతమేం లేదు. మీరు ఖర్చు చేసిన ముప్ఫయ్‌వేలూ సద్వినియోగం అవాలంటే ఇంకో పది వేలు ఖర్చు చేయక తప్పదు మరి!"

"ఇదన్యాయం! నువ్ తీసిన చెత్తను వెంటనే ఓ కే చేసి మేము ఇంత జాగ్రత్తగా, చక్కగా తీస్తే రిజెక్ట్ చేస్తారా?"

"ఇదిగో చూడండి! ఇక్కడ బోడి క్వాలిటీ ఎవరికీ అఖ్ఖర్లేదు. అందరికీ డబ్బు

కావాలి! ప్రొడ్యూసర్‌గా నీకు, శాంక్షన్ చేసే వాళ్ళుగా టి.వి కమిటీ మెంబర్లు, దానిని ప్రచారం చేసే కంపెనీ వాళ్ళు, ఆ ప్రచారాన్ని అమ్మే ప్రభుత్వం; అందరికి డబ్బే అవసరం! ఇంత మందికి డబ్బు అవసరమయి సప్లయ్ చేసే వాళ్ళ గొడవ మన కెందుకు? చూస్తాడు, లేకపోతే ఛస్తాడు-"

గత్యంతరం లేక అతని కండిషన్స్‌కి ఒప్పుకుని మా ఎపిసోడ్ శాంక్షన్ చేయించమని అతన్ని చేతిలో పెట్టాము మేము.

"అసల్సంగతేమిటంటే-మా రెండో బామ్మర్దినే ఈ సీరియల్స్ స్క్రిప్ట్ సెలక్షన్ కమిటీలోనూ, ఎపిసోడ్స్ స్క్రీనింగ్ కమిటీలోనూ హానరరీ మెంబర్‌గా వేయించేశాను కనుక మన కేమీ ప్రాబ్లెమ్ ఉండదు-" అన్నాడతను.

అతను చెప్పినట్టుగానే-

-రెండు రోజుల్లో ఎలాంటి మార్పులు లేకుండానే, కొంచెం డబ్బింగ్‌తో ఎపిసోడ్‌ని ఓ,కే చేశారు.

తరువాతి ఘట్టం బొంబేలో జరుగుతుందని మాకు తెలుసు.

అందుకని నేనూ, రంగారెడ్డి, జనార్ధన్ శాయిరామ్ బొంబే చేరుకున్నాం. ఎడ్వర్టయిజింగ్ ఏజన్సీల వాళ్ళ చుట్టూ పదిహేను రోజుల పాటు తిరిగాము.

"మీ ఎపిసోడ్ మేము కొంటే మాకెంత కమిషనిస్తారు?" అడిగాడు ఒక కంపెనీలో అధికారి.


"అదేమిటి? మీ క్కూడా కమిషన్ ఇవ్వాలా?"


"అవునుమరి! తెలుగు టి.వి. సీరి



యల్స్ క్వాలిటీ ఎలా వుంటుందో మాకు తెలుసు. అలాంటి చెత్త టాటా బిర్లాలాంటి పెద్ద పెద్ద కంపెనీలతో కొనిపించాలంటే కొంచెం రిస్కే కదా మాకు! మీ శ్యామ్రావే మాకు పాతిక వేల రూపాయలు బహుమతిగా ఇచ్చాడు. ఇప్పుడు చూడండి ఆయన తీసిన సీరియల్స్ అన్నీ వారానికి యాభై వేలు చొప్పున అమ్మేసి పెట్టాను నేను-"

వాడికి పాతిక వేలివ్వటానికని కాదు గానీ, ఇలా లంచాల ఊబిలో దిగబడి పోవటం నచ్చలేదు మాకు. మరో నెల రోజులు వివిధ కంపెనీలకు, ఎడ్వర్టయిజింగ్ ఏజన్సీలకి తిరిగి ఎక్కడా మా ఎపిసోడ్ అమ్ముడుపోక తిరుగు ముఖం పట్టాము.





ఆ తరువాతి వారంనుంచే శ్యామ్రావ్ సీరియల్ ప్రారంభమయింది టి.వి.లో - కాలనీ వాళ్ళందరం దానిని అతి విషాదంగా చూశాం.

ఎందుకంటే అంతవరకూ "పరమ చెత్తగా" ఉన్నాయని విమర్శించిన ప్రభుత్వ డ్రామాలే ఎంతో ఉత్తమంగా అనిపించ సాగినయ్. అప్పుడు.

ఆ తరువాత ఓరోజు శ్యామ్రావే వచ్చాడు మా దగ్గరకు.

"మీ సీరియల్ మాకు అమ్మేయండి" దాని మిగతా భాగమంతా నేనే షూటింగ్ చేసి రిలీజ్ చేస్తాను - మీకు ఇంతవరకూ అయిన ఖర్చు మాత్రం ఇచ్చేస్తాను-" అన్నాడతను.

ఆరాత్రి అందరం స్టేజి దగ్గర సమావేశమయాము.

ఆ ఎపిసోడ్ శ్యామ్రావ్‌కిచ్చేసి మా డబ్బు మేము సంపాదించుకోవటమా లేక అతని ఆఫర్ తిరస్కరించడమా అనే విషయంమీద తర్జన భర్జనలు జరిగాయ్.

చివరకు అందరం ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నాం.

ఎపిసోడ్‌ని శ్యామ్రావ్‌కి అమ్మి మరో దారుణమయిన చెత్తను ప్రజల మీద రుద్దటం కంటె ముప్పయ్‌వేలు నష్టం భరించి దానిని తగల బెట్టటం మంచిదని!

అదేరాత్రి చలిమంటలో టి.వి. సీరియల్ కాసెట్ మసి అయిపోయింది. అది బొగ్గుగా మారి పోతుంటే మా అందరికీ కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్. అయినా లోలోపల సంతృప్తి మాత్రం నిండి పోయింది - మేము ఓ మంచిపనిచేశామని! ●

మిత్రవైరం

వసుంధర

మా పక్కింట్లో నారాయణ మూర్తిగారుండడం మా అదృష్టమేనని మా యింటికి వచ్చి వెళ్ళిన బంధువులంతా అంటూంటారు.

నారాయణ మూర్తిగారి వయసు నలభై అయిదుంటుంది. ఆయనకిద్దరే పిల్లలు. ఓ అబ్బాయి, అమ్మాయి. భార్య అనుకూలవతి.

వారింట్లో అందరికీకూడా ప్రజాసేవ ముందు. స్వంత పనులు తర్వాత.

నాకు పెళ్ళై ఏణ్ణర్థమయింది. ట్రాన్స్ఫర్‌మీద ఈ ఊరొచ్చి ఎనిమిది నెలలయింది. నారాయణమూర్తిగారి పక్కిల్లు దొరికింది.

నారాయణమూర్తిగారింట్లో టెలిఫోనుంది. అక్కడ పబ్లిక్ టెలిఫోను కంటె పెద్ద క్యూ ఉంటుంది. ఆ వీధిలోవాళ్ళు, ఆ వీధిలో వాళ్ళకి తెలిసినవాళ్ళు, తెలిసిన వాళ్ళకి తెలిసినవాళ్ళు - అందరూ విధిగా ఆయన ఫోన్‌నే ఉపయోగిస్తారు. ఇంటికొచ్చిన వారిని నవ్వుతూ పలకరించడమే కాక ఆయన భార్య కాఫీ టీలతో సత్కరిస్తుంది.

నారాయణ మూర్తిగారు అన్ని తెలుగు వార, మాస పత్రికలూ-కొన్ని ప్రముఖ ఇంగ్లీషు పత్రికలూ - చాలా తెలుగు నవలల్లా కొంటారు. ఆయన కొంటున్నారని చాలామంది పుస్తకాలు కొనడం మానేశారు ఆ వీధిలో పుస్తకాల గురించి వచ్చే పోయేవారితో కూడా ఆయన ఇల్లు సందడిగా ఉంటుంది.

నారాయణమూర్తి గారింట్లో స్టీరియో రికార్డు. ప్లేయర్సు కాసెట్స్ డెక్కు- ఉన్నాయి. ఆయన చాలా రికార్డులు, కాసెట్స్ కొంటారు. ఎందరో ఆయనకు కాసెట్స్‌చ్చి పాటలు రికార్డింగు చేయించుకొంటూంటారు.

మాకు రేషన్‌కార్డు ఆయనే సంపాదించి పెట్టారు.

నా ఆఫీసు టైముకీ రేషను షాపుల టైములకీ కుదరడంలేదని మా రేషన్ తెచ్చి పెట్టే బాధ్యత ఆయన తన కొడుక్కిచ్చాడు.

ఆయనలో ప్రత్యేకతేమిటంటే ఎప్పుడూ దేనికీ విసుక్కోడు.

టెలిఫోను గురించి మీకిబ్బంది కదా అంటే, ఆ వంకనైనా కాస్త మాయింటికొస్తున్నారు కదా అంటాడాయన. అనవసరంగా కాఫీ టీ లెందుకండీ అంటే ఇంటికొచ్చినవారికి ఆ మాత్ర మివ్వగల స్తోమతుండడం నా అదృష్టమంటాడాయన పుస్తకాల గురించైతే - కొన్న పుస్తకం ఎక్కువ మందిచేత చదివిస్తేనే - కొన్నవాడు ధన్యుడౌతాడంటాడాయన. రికార్డింగ్ గురించి - "ఇందులో శ్రమేముంది నేను పాటలు వింటూంటే అటు రికార్డింగై పోతుంది-" అంటాడాయన.

ఇలా ఇతరులకేదుపకారం చేసినా అందువల్ల తనే ఏదో ప్రయోజనం పొందుతున్నట్లు మాట్లాడడం ఆయన ప్రత్యేకత

నాకూ, శ్రీమతికీకూడా నారాయణ మూర్తిగారన్నా, ఆయన కుటుంబమన్నా, ఎంతో యిష్టమేర్పడింది.



ఆ వీధిలో ఏ ఇద్దరు కలుసుకున్నా నారాయణమూర్తిగారి గురించే మాట్లాడు కుంటాం.

"అడిగితే సాయపడేవారే అరుదు. అలాంటివడిగి సాయపడేవారు దొరికితే అది మన అదృష్టం-" అనేది తరచుగా మేమనుకునేమాట.

ఇలా ఉండగా నా పక్కింట్లో వాటా ఖాళీ అయింది. అందులోకికూడా కొత్త దంపతులు వచ్చేరు. అతడిపేరు రమణ, ఆమె పేరు శాంత.

ఆ వీధికి మేమూ, వాళ్ళూ మాత్రమే కొత్తదంపతులం, అందువల్ల శ్రీమతికీ, శాంతకూ - నాకూ, రమణకూ మంచి దోస్తీ కుదిరింది. తరచు కలుసుకుంటూండే వాళ్ళం.

రమణ స్వభావం వేరు. అతడికి మంచి చొరవుంది. ఎక్కడికైనా వెళ్ళి ఏమైనా సాధించుకు రాగలడు. శాంత తన భర్త సామర్థ్యం గురించి కథలుగా చెబుతూం టుంది.

"మీకేం కావాలన్నా నన్నడగండి. నేను చేసి పెడతాను" అంటూండేవాడు రమణ.

"ఈ వీధిలో అందరూ అన్నింటికీ నారాయణమూర్తిగారిమీద ఆధారపడ తారు-" అన్నాను. రేషన్ కార్డుకు నారాయణమూర్తిగారితో చెప్పడం మంచి దన్నాను. రమణ అభిమాన పడ్డాడు. మర్నాడికల్లా తనే సంపాదించుకునివచ్చి గర్వంగా నాకు చూపించాడు.

"ఒకరి సాయం అక్కర్లేదు నాకు. ఇది సంపాదించడానికి మీకెంత ఖర్చ యింది ?" అన్నాడతడు.

"పదిరూపాయలు-" అన్నాను.

"నాకు అయిదే అయిదు రూపాయ లయింది. మీరు దెబ్బ తిన్నారు. బహుశా అది నారాయణ మూర్తిగారి కమీషనై ఉంటుంది..."

"ఛా-ఆయనలాంటిమనిషి కాదు...." అన్నాను.

"కమీషనంటే కమీషన్ కాదు-" అన్నాడు రమణ- "చాలాకాలంగా ఇక్కడున్న మూలాన ఆయనకు నాలుగురకాల మనుషులతో పరిచయ ముంటుంది. మీలాంటి వారిచేత ఆయన అయిదిచ్చేచోట పదిప్పిస్తే-ఆయన పనులన్నీ ఊరికే అవుతూంటాయి."

నేను మాట్లాడలేదు.


ఆ విధంగా ప్రారంభించాడు రమణ.

అతడు నారాయణ మూర్తిగారికంటే చురుకుగా ఆయన సాధించలేని పనులన్నీ సాధించుకు వస్తున్నాడు. ఆ వీధిలో నారాయణ మూర్తిగారిని మించిన పేరు తెచ్చుకోవాలని అతడి తాపత్రయం.

"పుస్తకాలు మనంఒక్కరిమే ఎందుకు చదవాలి ? అందరూ తలోపుస్తకం కొనుక్కుని చేతులు మార్చుకుంటే మనం ఒకరి దయా ధర్మంమీద ఆధారపడ్డట్టవదు-" అన్నాడతడు.

ఇది చాలామందికి నచ్చింది. ఉన్నట్టుండి మా వీధిలో ఎందరిలోనో ఆత్మ గౌరవం గురించిన ఆలోచన లేచింది. ఇంతకాలం తామెవరికో అమ్ముడు పోయి నట్టూ - అందులోంచి బయటపడినట్టూ అందరూ అనుకోసాగారు.

నారాయణ మూర్తిగారింటికి పుస్తకాలకు వెళ్ళేవారి సంఖ్య తగ్గిపోయింది. నేనుమాత్రం ఇంకా ఆయనింటినుంచే



పుస్తకాలు తెచ్చుకుంటున్నాను. వీధిలో ప్రారంభమైన పుస్తకాల ఉద్యమం గురించి విని- "మంచిది పత్రికలను ప్రోత్సహించడానికి చదివితే చాలదు... కొనాలికూడా !" అన్నాడాయన.

"మీరూ క్లబ్బులో చేరి కొన్ని పుస్తకాలు కొనడం తగ్గించేయకూడదూ ?" అన్నాను.

"చదవాలనుకున్న పుస్తకం కొనుక్కోవడం నా అలవాటు -"

ఇది నేను రమణకు చెప్పాను.

"అంటే ఇంకా నీకర్థంకాలేదా ? ఆయన ఇంతకాలం తననుంచి పుస్తకాలు తీసుకుని వెళ్ళిన వారిని చిన్నబుచ్చుతున్నాడు..."

నిజమేననిపించింది నాకు. నేనూ పుస్తకాల క్లబ్బులో చేరాను.

ఫోన్స్ గురించికూడా రమణ ఇలాంటి ఉద్యమమే లేవదీశాడు.

"నారాయణ మూర్తిగారికి అహంకారం. తనింటికి ఒకరు వెళ్ళడమేకానీ ఆయన ఒకరింటికి వస్తాడా ? అలాంటి వారింటికి ఫోన్ చేయడానికి వెళ్ళడ మెందుకు ? అర్థరూపాయిస్తే హోటలు వాడు చేసుకోనిస్తాడు!" అన్నాడు రమణ.

మా వీధికి చివరగా ఓ హోటలుంది. రమణ పేరుచెప్పి హోటలువాడికి ఫోను గిరాకీ పెరిగింది.

నారాయణమూర్తి గారింటికి ఫోను గురించి వెళ్ళేవారి సంఖ్య తగ్గిపోయింది.

ఒకరోజు నేనాయనింటికి వెళ్ళి- "మీరూ, మీ ఇంట్లోవాళ్ళూ ఇల్లు కదలరు. కాస్త నలుగురిళ్ళకి వెళుతూండరాదూ ?" అన్నాను.

"తీరికెక్కడిదయ్యా ?" అన్నా రాయన.

"ఇదివరకైతే పుస్తకాలగురించీ, ఫోన్ గురించీ, జనాలు వస్తూండేవారు. ఇప్పుడు మీకు రికార్డింగు పనికూడా తగ్గిపోయింది"

"బాగుందయ్యా. అప్పుడు కొన్ని పుస్తకాలు చదువుకుందుకు తీరుబడి ఉండేది కాదు. ఇప్పుడాపని చేస్తున్నాను. మా ఆవిడ ఇంటి డెకరేషన్ మారుస్తోంది. తను మంచి ఆర్టిస్టు. పిల్లలేమో సంగీత సాధన చేస్తున్నారు..." అని- "ఇంట్లో వుంటే ఎన్నో మంచిపనులు చేసుకోవచ్చు ఎందుకయ్యా ఊసుపోక కబుర్లకోసం అటూ యిటూ తిరగడం-" అన్నాడాయన.

"అయితే మీరెవరిళ్ళకూ వెళ్ళరా?" అన్నాను.

"పిలిస్తే తప్పకుండా వెడతాను. పిలవ

క్కుండా ఒకరింటికి వెళ్ళే అలవాటు నాకు లేదు..."

"మీ యింటికి వచ్చేవారూ అలాగే అనుకుంటే?"

"మన వీధిలో వాళ్ళలో పిలిచే అవకాశం నాకిచ్చినవారెందరున్నారు చెప్పు."

నేను మాట్లాడలేదు. ఇదీ రమణకు చెప్పాను.

"ఆత్మ గౌరవమున్న వాడెవడూ ఆయనింటికి వెళ్ళడు" అన్నాడు రమణ. అతడాయన మాటలకు మంచి ప్రచారం తీసుకుని వచ్చేడు.

వీధిలో నారాయణ మూర్తిగారి గురించిన దుష్ప్రచారం ఘోరంగా సాగిపోతోంది.

ఆయన అహంకారి. తనింటికి అంతా రావాలి. తనొకరింటికి పిలవందే వెళ్ళడు. ఆయన అందరికీ సాయపడతాడు. తనొకరి సాయాన్నాశించడు.

రమణ రాకుంటే ఈ విషయం మేమెవ్వరం తెలుసుకోలేక పోయేవాళ్ళం. ఇప్పుడంవరం ఇంచు మించు అయనింటికి వెళ్ళడం మానేశాం.

ఆ వీధిలో నారాయణ మూర్తిగారినే అంటిపెట్టుకున్న వారొకరో యిద్దరో మిగిలారు. వారిదగ్గర చాలామంది ఆయన్ను గురించిన సూటీ పోటీ మాటలనేవారు.

నారాయణ మూర్తిగారిలో మార్పు లేదు. ఆయన ఎప్పటిలాగే నలుగుర్నీ నవ్వుతూ పలకరిస్తున్నాడు. సాయం కావాలా అనడుగుతున్నాడు. ఈమధ్యనే ఆయన వీడియోకూడా కొన్నాడు.

"జనాల్నాకర్షించడానికిదో ఎత్తు. ఎవరూ చూడ్డానిక్కూడా వెళ్ళొద్దు-" అన్నాడు రమణ.

నారాయణ మూర్తిగారు ఎవర్నీ పిలవలేదు.

చూడ్డానికెవరూ వెళ్ళలేదు.

నాకూ నారాయణ మూర్తిగారికీ కూడా ఇప్పుడంతంత మాత్రంగానే ఉంటోంది. అయన్ను చూడగానే నాలో ఆవేశం రగుల్తోంది. ఆయన ఎప్పటిలాగే ఉండగల్గుతూంటే నాకు వళ్ళు మండిపోతోంది.

ఇలా ఉండగా ఒక రోజున నాకు టెలిగ్రాం వచ్చింది.

మా అత్తగారి ఆరోగ్యం బాగోలేదట. వెంటనే బయల్దేరి రమ్మని ఉందందులో.

టెలిగ్రాం ఆ ర్రోజుల తర్వాత అందింది.

శ్రీమతి ఏడుపు లంకించుకుంది.

అత్తగారి పొజిషనెలాగుందో అర్జంటుగా తెలుసుకునేందుకు నేను కాఫీహోటలుకు వెళ్ళాను-ఫోన్ చేయాలని!

అది అవుటాఫార్డరు.


దగ్గర్లో నారాయణ మూర్తిగారికి తప్ప ఫోన్ లేదు.

రమణకు చెప్పుకున్నాను.

అర్జంటైనప్పుడామాత్రం ఫోన్ వాడుకుంటే తప్పులేదు. నారాయణ మూర్తి గారింటికి వెళ్ళు-" అన్నాడు రమణ.

రమణ తేలిగ్గా అనేశాడుకానీ నాకు మనసొప్పలేదు.

పిలవందే ఎన్నిసార్లో నేనూ, శ్రీమతి ఆయనింటికి వెళ్ళాం. ఆయనమాత్రం పిలవందే రానన్నాడు. అహంకారి ఆయన గురించి వ్యతిరేక ప్రచారాన్ని నేనూ నమ్మి ప్రచారంకూడా చేశాను. అలాంటప్పుడు ఆయనింటికి నేనెలా వెళ్ళగలను?



జయరామయ్యగారింటికి వెళ్ళాను. ఆయన చుట్టాలెవరికో ఫోనుంది. వాళ్ళిల్లు కాస్త దూరమే అయినా మరీ పోస్టాఫీసంత దూరం కాదు.

జయరామయ్య నవ్వి - "నారాయణ మూర్తిగారున్నారుగా -" అన్నాడు.

"ఆయనింటికా?" అన్నాను నిరసనగా.

"ఏం-ఇదివరకెన్నడూ వెళ్ళలేదా?"

"అప్పట్లో ఆయన అహంకారం గురించి తెలియదునాకు-"

"అహంకారమంటే?"

చెప్పాను.

"ఇతరులను సాయమడక్కుండా - వారికి సాయపడితే అది అహంకారమనిపించుకుంటుందా?" అన్నాడు జయరామయ్య.

"అనిపించుకుంటుంది కాబట్టే వీధంతా అయన్ని వెలివేశారు..." అన్నాను.

"వెలివేయడమేమిటి? ఆయన నిక్షేపంలా ఉన్నాడు..."

"ఇప్పుడెవరూ ఆయనింటికి వెళ్ళడం లేదు..."

"ఒకప్పుడాయన రమ్మన్నాడని వెళ్ళారా? ఎవరి అవసరం కొద్దీ వారు వెళ్ళారు..." అన్నాడు జయరామయ్య.

"అయితే మాత్రం ఆయన కాస్త మర్యాద చూపవద్దూ?"

మర్యాదంటే ఏమిటి? నీ అవసరం గురించి నువ్వు వాళ్ళింటికి వెడితే అవసరం లేకున్నా నీ యింటికాయన రాక పోవడమా? నీకు సాయం చేసినందుకు అవసరం లేకపోయినా తను ఏదో ఒక సాయమడగడమా? అన్నాడు జయరామయ్య చిరాగ్గా.

ఏంచెప్పాలో అర్థంకాక - "ఇచ్చిపుచ్చు కోవడంలోనే సహజీవనముంటుంది -" అన్నాను,

నారాయణమూర్తిగారు నీకంత సులభంగా అర్థం కాదులే. ముందాయనింటికి వెళ్ళి నీ పరిస్థితి చెప్పుకో - రమణకూ ఆయనకూ తేడా తెలుస్తుంది-" అన్నాడు జయరామయ్య.

"ఇంత జరిగేక ఆయనింటికెలా వెళ్ళను?" అన్నాను.

"నువ్వేదో ఊహాలోకంలో ఉన్నావు. ఇంత జరిగిందనుకునేందుకు మీ ఇద్దరి మధ్య నా గొడవలయ్యాయా, ఏమ

న్నానా?" అన్నాడు జయరామయ్య నవ్వుతూ.

నిజమే! నా భావాలన్నీ హీనసికం.

ఏమైతే అయిందని జయరామయ్య సలహా పాటించేను. నారాయణమూర్తి గారు సాదరంగా నన్నాహ్వానించి విషయం తెలుసుకుని వాళ్ళబ్బాయిని పిలిచి "ఒరేయ్-నువ్వుఅంకుల్ని స్కూటరుమీద సీతాపతి మామయ్యింటికి తీసుకుని వెళ్లు" అన్నారు.

"ఏం - మీఫోన్ పని చేయడంలేదా?"

"నా ఫోనైతే ఎస్‌టీడీ చేయడానికి లేదు. నాది మామూలుద్యోగం. దూరాన్నుంచి కాల్స్ రిసీవ్ చేసుకుందుకూ, లోకల్ కాల్స్ చేసుకుందుకూ తప్ప నాకు ఫోనవసరమేముంది? ఇక్కడ్నించయితే ట్రంకాల్ చేయాలి. అందుకెంతసేపైనా ఎదురు చూడాల్సి రావచ్చు. నా బావ మరిదిది వ్యాపారం...."

నేను మొహమాటపడినా బలవంతపెట్టి ఆయన పంపించేరు. నేను ఫోన్ చేశానాయన బావ మరిది ఇంటినుంచి.

అత్తగారి పరిస్థితి బాగుంది ఒకేఒక్క రోజు చాలా ప్రమాదకర పరిస్థితి ఏర్పడితే టెలిగ్రాం ఇచ్చారుట. ఆ మర్నాడే పరిస్థితి మామూలుగా అయిపోయింది. ఇప్పుడు మేము వెళ్ళాల్సిన అవసరం లేదు. టెలిగ్రాం ఆలస్యంగా అందిందని వాళ్లు చాలా ఆశ్చర్య పడ్డారు.

సంతోషంగా యింటికి వెళ్ళాను.

"ముందు నారాయణమూర్తిగారికి థాంక్స్ చెప్పుకోవాలండీ అంది శ్రీమతి.

ఇద్దరం వాళ్ళింటి కెళితే ఆయనెంతో సాదరంగా ఆహ్వానించారు. ఇంటిల్లిపాదీ ఎప్పటి లాగే ప్రేమగా మాట్లాడారు.

ఆయనను అకారణంగా ద్వేషించినందుకు బాధపడి నా కళ్ళు తెరిపించినందుకు కృతజ్ఞతా పూర్వకంగా జయరామయ్య ఇంటికి కూడా వెళ్ళాను.

"రమణ ఒక్క మాటతో నిన్ను వదుల్చుకున్నాడు. నారాయణమూర్తి తన కొడుకు స్కూటరు మీద తన వాళ్ళింటికి పంపాడు. అది అహంకారమంటాడు రమణ. కానీ నీ సమస్యను నీ కనుకూలంగా పరిష్కరించడం ఆయన బాధ్యతగా తీసుకున్నాడు. అది అర్థం చేసుకుంటే చాలు నువ్వు..."


"ఇకనుంచి పుస్తకాలాయనింటి నుంచే తెచ్చుకుంటాను అన్నింటికీ ఆయన పైనే ఆధార పడతాను..." అన్ననావేశంగా


"అపని మాత్రం చేయకు. ఆయన సాయం తీసుకోవడంలోనే ఆయన్ను గౌరవించడ మనుకుంటే అది నీ తెలివి తక్కువ తనం అవుతుంది -" అన్నాడు జయరామయ్య.

"అంటే?"

"సాయం పొందే మనిషిలో ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్ ఉంటుంది. రమణ వంటి వారికాంప్లెక్స్‌ను రెచ్చగొట్టి నారాయణమూర్తిగారి వంటివారి మీద అపార్థాలు సృష్టించగలరు. అయితే మూర్తి గారికి రమణ తనకు తెలియకుండానే ఉపకారం చేస్తున్నాడు. ఎదుటి మనిషిలో మంచితనం కంటె చెడ్డను వెతకడానికే ప్రతి మనిషీ ప్రయత్నిస్తాడు. అందుకే నువ్వూ అతడి మాటలు నమ్మావు. మీ వంటి వారుండకపోతే నారాయణమూర్తి గారికి చేతినిండా పనెక్కువై చాలా ఇబ్బంది పడాలిగదా! రమణ ధర్మమా అని ఆయింట్లో వాళ్ళందరికీ స్వంత పనులు చూసుకునే తీరిక ఏర్పడింది. తమకుతామై వారెవరినీ కాదనరుగదా!" అన్నాడు జయరామయ్య.

అప్పుడు నాకు నారాయణమూర్తిగారికి సంబంధించి నాకంటే రమణే మంచి మిత్రుడనిపించింది.





తోటకూర ఆశాలత



నిలువెత్తు నున్న రామచంద్రుడు ఫోటో మీద పడివున్నది ఆమె శవం. బహుశ ఆ ఆగంతకుడు అత్యాచారం జరుపుతుంటే నిస్సహాయతతో తనను రక్షించమంటూ ఆ తండ్రి ఫోటోను కావలించుకుని వుంటుంది.

రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడికి ఒకేఒక కూతురు. అమెరికాలో చదువుకుంటున్న మేనల్లుడికిచ్చి పెళ్ళి చేయాలన్నది ఆయన ఆశయం. ఒకరోజున రామచంద్రుడి పేరు చెబితేచాలు గూండాల గుండెల్లో రైళ్ళు



పరుగెత్తేవి. అటువంటి రామచంద్రుడి ఇంటికి వచ్చి, ఆయన ఒక్కగానొక్క కూతుర్ని ఇంట్లోనే రేప్‌చేసి హత్య చేశారు.

రామచంద్రుడు ఏం ఆలోచిస్తున్నాడో ఏమోగాని పిచ్చివానిలా అలాగే కళ్ళప్పగించి చూస్తూండిపోయాడు. ఆయనను ఆ స్థితిలో పలకరించడానికి ఏ ఒక్కరికీ ధైర్యం చాలలేదు. కపిలకూడా ఏమీ పాలుపోక అలాగే చూస్తుండిపోయింది. సరిగ్గా ఆ సమయంలోనే సిగరెట్ ప్యాకెట్ పట్టుకుని వచ్చాడు గూర్ఖా. అక్కడి దృశ్యాన్ని చూసి, "చిన్నమ్మగారూ..." అంటూ ఏడుస్తూ ఆమె దగ్గరకు వెళ్ళబోయాడుగాని "బహదూర్, ఠైరో..." అన్న కేక విని ఆగిపోయాడు.

ఆ కేక పెట్టింది రామచంద్రుడు.

"దిసీజ్ ఎ క్లీన్ రేప్ అండ్ మర్డర్ కేస్. ఎవరూ దేనినీ తాకకండి" అని "కపిలా, బయట ఎక్కడినుంచయినా ఫోనుచేసి ఎస్.పి. రంజిత్‌ని వెంటనే రమ్మను" అన్నాడు.

అప్రయత్నంగా బయటకు నడిచింది కపిల. ఆమెకు ఎస్.పి. రంజిత్ దొరకలేదు. ప్రమాదంలో చిక్కుకుని హాస్పిటల్‌లో చేరినవారి పరిస్థితి తెలుసుకోవటానికి ప్రమాదం విషయమై కలెక్టరుకి పూర్తి సమాచారాన్ని అందించడానికి బయటకు వెళ్ళాడు. ఎ.ఎస్.పి.కి. ఇన్‌ఫర్‌మేషన్ పోస్టుచేసింది. ఫలితంగా మైక్రో ఫోనుద్వారా విషయాన్ని రంజిత్‌కి తెలియజేయడం జరిగింది. ఘుటాహుటిన రామచంద్రుడు ఇంటికి చేరుకున్న రంజిత్, రామచంద్రుణ్ణి చూస్తూనే తలకు వున్న టోపీ తీసి పట్టుకుని, "అయామ్ సారీ సార్..." అన్నాడు.

"నో రంజిత్, నిన్నగాక మొన్న పట్టపగలు పదిమందీ చూస్తుండగా ఓ కాలేజీ విద్యార్థినిని తీసికెళ్ళి మానభంగం చేసి హత్యచేశారు. బస్సు ఆపి అందులో ప్రయాణం చేస్తున్న ఓ అమాయకురాలయిన ముసలమ్మను దింపి చెట్టుకి ఉరి తీశారు. ఈ రోజున ఓ వైపున విధ్వంసకాండ సృష్టించారు .... మరోవైపున నా యింట్లోకి ప్రవేశించి

జరిగినకథ:—

కాంగ్రేసేతర ప్రభుత్వం అధికారంలోనున్న రాష్ట్రంలో విజయవాడవంటి పట్టణమది. ఆ పట్టణంలో స్పెషల్ మెజిస్టీరియల్ పవర్స్‌తో శాంతి భద్రతల్ని పునరుద్ధరించడానికి అర్బన్ ఎస్.పి.గా రంజిత్‌ని నియమిస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కాలేజీ విద్యార్థినిని మానభంగం చేసి హత్య చేస్తాడు. యు. ఎస్. ఆర్గనైజర్ వెంకట్ బంద్‌కి, నిరసన ప్రదర్శనకి పిలుపు ఇస్తాడు. వెంకట్ శత్రువు అయిన కుమార్ ప్రశాంతంగా సాగే ఊరేగింపులోఅరాచకం సృష్టిస్తాడు. "మహానాడు" దినపత్రిక రిపోర్టర్ కపిల ఆ ఘోరాన్ని ఫోటోలతో సహా తన పేపరుకి రిపోర్టు అందిస్తుంది. మహానాడు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ మధు ఆమెను అభినందించి రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడు ఇంట్లో అత్యాచారం జరిగిందని తెలియజేస్తాడు కపిల రామచంద్రుడు ఇంటికి బయల్దేరింది.

ఆ తర్వాత—



నా కూతుర్నే—" అంటూ ఆ తర్వాత చెప్పలేక పోయారు. ఆయన ఎంతగా ఆవేదన చెందుతుందీ బిగిసిన ఆయన పిడికిలి, మెడదగ్గర ఉబ్బిన ఆయన నరాలు, ఎర్రబారిన ముఖం చెబుతున్నాయి.

"రంజిత్, ప్లీజ్ నేను నా కూతుర్ని ఇలా చూడలేక పోతున్నాను. కేరీఆన్ యువర్ డ్యూటీ...." అని ఒక్క నిమిషం ఆగి, "మిస్టర్ రంజిత్....ఈ ఘోరానికి తలపడ్డవాణ్ణి వారంరోజులలోపు నీవు పట్టుకున్నావా సరే! లేకపోతే నేనే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవలసి వస్తుంది" అన్నాడు.


రగిలే కొలిమిలా నిలబడివున్న రంజిత్ పెదవి కదపలేదు. ఎ.ఎస్.పి. వైపు సాలోచనగా చూశాడు. ఇంతలో కపిల తనకు కావలసిన ఫొటోలు తీసుకుని, గూర్ఖా నుంచి సమాచారాన్ని సేకరించి ప్రెస్‌వైపు దారితీసింది.

* * * *

"మహానాడు" మేనేజింగు డైరెక్టర్ మధు మహదానందంతో అప్పుడే ప్రింట్ అయిన ఎడిషన్ చూస్తున్నాడు. ఆరోజు జరిగిన భీభత్సకాండను ఫొటోలతోసహా, ప్రత్యక్ష కథనంతో ప్రచురించి మిగిలిన పేపర్లకన్నా తన ప్రత్యేకత ఏమిటో నిరూపించుకుంది. ఇప్పుడు రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడి ఇంట్లో జరిగిన రేప్-మర్డర్ న్యూస్‌ని తన పేపరు ఒకటే ప్రచురించింది. దీనితో తన పేపరు సర్క్యులేషన్ మరో పదివేలు పెరగడం ఖాయం అనుకున్నాడు. తాను అనుకున్నది సాధిస్తున్నందుకు అతడికి చాలా తృప్తిగా వుంది. స్కాచ్ విస్కీ సేవిస్తూ ఆ ఆనందాన్ని తానొక్కడే అనుభవిస్తున్నాడు.

* * * *

అవకాశం వచ్చిందిగదా అని కలెక్టరు అన్నమాటలు అంపశయంలా రంజిత్‌ని పొడుస్తున్నాయి. దానికితోడు రామచంద్రుడు ఇంట్లో అతడి కుమార్తెనే రేప్‌చేసి హత్యచేశారు. దినపత్రికలన్నీ ఈ విషయాన్ని ప్రముఖంగా ప్రచురిస్తున్నాయి. తన అసమర్థతని ఎత్తి చూపుతున్నాయి. ముఖ్యమంత్రి తనపై ఎంతో నమ్మకంతో అర్బన్ ఎస్.పి.గా స్పెషల్ మెజిస్ట్రీరియల్ పవర్స్ కట్టబెట్టారు. ఇంత మందీ, మార్బలం పెట్టుకుని తాను సాధించిందేమిటి? ముఖ్యమంత్రికి - హోం మినిస్టరుకి ఏమని సమాధానం చెప్పుకోగలడు? భర్తల్ని పోగొట్టుకున్న భార్యలకి - బిడ్డల్ని పోగొట్టుకున్న తల్లులకి — ఆస్తిని పోగొట్టుకున్న తల్లులకి - ఆస్తిని పోగొట్టుకున్నవారికి



తానేం సంజాయిషీ ఇవ్వగలడు? ఇంత బతుకు బతికి, ఇన్ని జిల్లాల్లో తనకు ఎదురులేదనిపించుకున్న తాను ఒకటి కాదు, రెండుకాదు ఇన్ని అపజయాలను ఎదుర్కొనటమా?- అనుకున్నాడు రంజిత్.

తన ఆఫీసులో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న అతడు కాలాన్ని మర్చిపోయాడు. హైదరాబాదునుంచి ఫోను వస్తుందో - ఏ హాస్పిటల్‌నుంచి ఎటువంటి దుర్వార్త వినవలసి వస్తుందోనని ఆదుర్దాగా ఉన్నాడు. తన కీర్తి ప్రతిష్టల్ని భూస్థాపితం చేయడానికి — తానొక అసమర్థుడని ముద్ర వేయడానికీ ఓ పథకం ప్రకారం జరుగుతున్న కుట్ర అని అభిప్రాయ పడ్డాడు.

రామాపురంలో అత్యాచారం జరపడానికి కుట్ర పన్నుతున్నారని కపిల అందించిన సమాచారం సరైనదే. తాను రామాపురం వెళ్ళడంతో రామచంద్రుడి ఇంట్లో ఈ అత్యాచారం జరిపారు. ఇంతటి ఆర్గనైజేషన్ కెపాసిటీ ఆ వెంకట్‌కి మాత్రమే ఉంది. వాడే ఈ దారుణ మారణకాండను సృష్టించాడు. వాడి అంతం చూడవలసిందే — అనుకున్నాడు ఎస్.పి. రంజిత్.

అప్పుడు సమయం తెల్లవారుజామున నాలుగు గంటలయింది. సరిగ్గా అదే సమయంలో వెంకట్ ఇంటి వాకిటముందు పేపరుబోయ్ విసిరిన "మహానాడు" దినపత్రిక పడింది. పేపరు తీసిచూసిన వెంకట్ రిటైర్డ్ డి.ఎస్.పి. రామచంద్రుడి కూతురి మరణం చూసి స్థాణువయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం ఆ అత్యాచారం కూడా తానే చేసినట్లు ఉండటంతో అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. "పిరికిపందా, నేను లేనప్పుడు నా ఇంటికి వచ్చి ధ్వంసం చేసింది చాలక ఈ రేప్‌లు, మర్డర్‌లు నామీద మోపి నీ చేతులు దులుపుకోవాలనుకుంటున్నావా? అసమర్థపు వెధవా-నా భవిష్యత్తుని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర పన్నిన నిన్ను హతమారుస్తాను. మన ఇద్దరిలో నీవో నేనో ఒకడేరా బతికుండేది..." అని ఆవేశంగా అంటున్న వెంకట్ వైపు చుట్టూవున్న అతడి అనుచరులు ఆందోళనగా చూశారు.

(సశేషం)

సహస్ర నామార్చన

సింహప్రసాద్

ముఖం వేలాడేసుకు వచ్చిన కొడుకుని చూసి "వెళ్ళిన పని అవ్వనట్టుందే" అన్నారు భూపతిరావు గారు.

"అవ్వలేదు. కాలేజీ కమిటీ వైస్ ఛైర్మన్ దగ్గర్నుంచి లెటర్ తీసుకెళ్ళేను. అయినా ప్రిన్సిపాల్ పట్టించుకోలేదు. ఈ కొత్త ప్రిన్సిపాల్ అదో రకం మనిషి నాన్నగారూ. ప్రతిదానికీ రూల్సుని వల్లిస్తూంటాడు..."

"తిండిపోతేమో"

"అబ్బే – ఫలం, పత్రం, పుష్పం, తోయం దేనికీ లొంగడు. అదోరకం పెంకిఘటం."

"నేను కలిసి చూస్తానుండు" పైపంచె భుజానేసుకుని చేతికర్ర వూపించుకుంటూ కాలేజీకి బయల్దేరారు.

కాలేజీ ఆవరణలో ఓ కుర్ర లెక్చరర్ ఆయన్ని విష్ చేశాడు. ఆయనద్వారా ఆ వుద్యోగం సంపాదించుకున్నాడతడు.

"ఏమోయ్! ఎలా వుంది నీ ఉద్యోగం? మీ కొత్త బాస్ ఏమంటున్నాడు?"

"డిసిప్లిన్ అని అరుస్తున్నాడండీ తనకి ముందు పనిచేసిన వాళ్ళంతా అసమర్థులని ఆయన నిశ్చితాభిప్రాయం. అంచేతే స్టాఫ్‌ని ఆ డిపార్ట్‌మెంటునుంచి ఈ డిపార్ట్‌మెంటుకీ, ఇక్కడ్నుంచి అక్కడికీ మార్చేస్తున్నాడు. మొక్కల పూలు కొయ్యకూడదు, ఎక్కడ బడితే అక్కడ సైకిళ్ళు పెట్టకూడదు, గుంపులు గుంపులుగా వుండకూడదంటూ రూల్స్, రెగ్యులేషన్స్ పెంచేస్తున్నాడండీ. పట్టుగొడ్డుకి అరుపు లెక్కువన్నది మీకు తెలీందికాదు"

"చూద్దాం"

చిన్నగా నవ్వుకొని కాలేజీని, పరిసరాల్ని ఓమారు పరికించి తిన్నగా ప్రిన్సిపాల్ గదిలోకెళ్ళి విష్ చేశారు.

ఆయనో పెద్దమనిషిలా కన్పించేసరికి కూర్చోమని కుర్చీ చూపి "చెప్పండి" అనడిగారు ప్రిన్సిపాల్ చిదంబరం.

భావరహితంగా, బ్లాంక్‌గా వున్న ఆయన మొహాన్ని, సూటిగా విషయాని కొచ్చే అతడి తత్వాన్ని, క్లుప్తతనీ చూసిన వెంటనే గ్రహించేశారు భూపతిరావుగారు ఆయన అదో తరహా మనిషని.

"నేను మాజీ కమిటీ మెంబర్ని లెండి మీరు కొత్తగా వచ్చేరని తెలిసి చూద్దామని వచ్చాను"

"యస్సీ" ఈ ఉపోద్ఘాతం వింటోంటేనే తెలుస్తోంది ఏదో పనుండి వచ్చేడని – అని లోపలనుకుంటూ అన్నారు.

"నేనొచ్చి అరగంట పైనే అయింది లెండి"

"అరె! అలాగా. మావల్ల ఆలస్యమేమీ జరగలేదుకదా?" లోపల తిట్టుకుంటూ పైకి నొచ్చుకుంటున్నట్టు మొఖం పెట్టి అన్నారు.


"అబ్బెబ్బే. అదేం కాదండి. మీరొచ్చి కాలేజీ అవతారాన్ని మార్చేశారని చాలా విన్నానండి. అదేమిటో చూద్దామని అన్ని డిపార్ట్‌మెంట్లకీ వెళ్ళి అన్నీ చూసి వస్తున్నాను. మీరు చేతల మనిషని గ్రహించి అభినందిద్దామని వచ్చేను."

చిదంబరం కొంచెంగా నవ్వేరు.

"పెద్దవారు మీలాంటివారి ప్రోత్సాహం వుంటే చాలా చాలా చెయ్యగలను. ఇంతవరకూ చేసింది పిడికెడంత. ఇంకా చెయ్యాల్సింది ఆకాశమంత."

"నిజమే కాని వెయ్యిమైళ్ళ ప్రయాణమైనా మొదలయ్యేది మొదటి అడుగుతోనే. చెయ్యాలన్న తపన, చెయ్యగలనన్న నమ్మకం వుండటం ముఖ్యం. అవి మీలో





పుష్కలంగా వున్నాయి. అంచేత ఆకాశమంత పనైనా సరే అవలీలగా చేసెయ్యగలరని నేను ధీమాగా చెప్పగలను."

"అదంతా మీ అభిమానం" చిన్నగా మందహాసం చేస్తూ అని బజ్జర్ మ్రోగించి ప్యూన్‌తో రెండు కాఫీలు పట్రమ్మన్నారు.

"ఇదివరకు కాలేజీకాంపౌండ్లో అడుగు పెడితే అంతా చిందరవందరగా వుండేది. ఎక్కడ బడితే అక్కడ సైకిళ్ళు నిలబెట్టేసేవారు. గుంపులు గుంపులుగా స్టూడెంట్లు బాతాఖానీ వేసేవారు. మొక్కలు మోడువుల్లా వుండేవి. ఇప్పుడదంతా మారిపోయింది. సైకిళ్ళు షెడ్స్‌లోనే వుంటున్నాయి. మొక్కలన్నీ అందంగా, ఆరోగ్యంగా వున్నాయి, వాటికి పువ్వులు కూడా వుండటం ప్రత్యేక విశేషం".

"అందరూ తమ తమ బాధ్యతల్ని సవ్యంగా నిర్వర్తిస్తూండడమే దానికి కారణం..." తన సంబరం బయట పడకుండా అన్నారు.

"అమ్మమ్మ అలాగనకండి. చేతిలో వున్న అధికారాన్ని పూర్తిగా వినియోగించుకోలేక పోవడం మన దేశపు అధికార్ల మొదటి లక్షణం. ఒత్తిడులకూ, ప్రలోభాలకూ లొంగిపోవడం రెండో లక్షణం. ఆ రెంటికీ మీరు మినహాయింపని చెప్పక తప్పదు. ఇకపోతే ఏ అధికారైనా తనొక్కడూ సరిగ్గా పనిచేస్తూ నీతిగా వుంటే సరిపోదు. తన క్రిందివారందర్నీ సవ్యంగా, సక్రమంగా బాధ్యతాయుతంగా, నీతివంతంగా ప్రవర్తించేట్లు చూడటం అత్యంత ముఖ్యం. ఆ సంగతి గ్రహించి ఆచరణలో పెట్టిన మిమ్మల్నెలా అభినందించాలో తెలీడంలేదు."

"మీలాంటి పెద్దల ఆశీస్సులు పొందగలిగినందుకెంతో ఆనందంగా వుంది."

"లైబ్రరీలో మీరు వ్రేలాడ గట్టిన అట్టలమీది స్లోగన్లు చూశాను. ఒకదానిమీద "దేవాలయంలో ధ్యానం గ్రంధాలయంలో జ్ఞానం" అని రాసివుంది. ఇంకో దానిమీద "ఇక్కడ కళ్ళకి మెదడుకీ మాత్రమే పని చెప్పండి" అని రాసివుంది. అబ్బ! ఇంత గొప్ప గోల్డెన్ వర్డ్స్ ఎప్పుడూ, ఎక్కడా వినలేదు, చూడలేదంటే నమ్మండి. ప్రతి గ్రంధాలయంలోనూ మీ యొక్క కొటేషన్స్ రాయించాల్సిన అవసరం ఎంతైనా వుందండీ....."

ఆ ప్రశంసని చిర్నవ్వుతో స్వీకరించారు. అలాటి బోర్డులు వున్నట్టే తెలీదాయనకి. నిజం చెప్పి ఆ ప్రశంసలు తనకి చెందవని చెప్పుకోవాలన్పించలేదు.

కాఫీలొచ్చాయి.

"పెద్దలఎడ మీకున్న గౌరవాభిమానాలకీ, మీ ఉన్నత సంస్కారానికీ ఇది ప్రత్యక్ష నిదర్శనం" అని పొగడి కాఫీకప్పు అందుకున్నారు.

"ఇదివరకు ప్యూన్లూ, గుమాస్తాలూ మాట విన్పించుకునేవారు కాదు. టైమ్ ప్రకారం పని చేసేవాళ్ళు కాదు. అలాటిదిప్పుడు ఎక్కడ చూసినా, ఎటుచూసినా పంక్చువాలిటీ, డిసిప్లిన్. ఓహ్-గొప్పగా మంత్రించినట్టుగా చేసేస్తున్నారు కదండీ"

"మన కాలేజీకో ప్రత్యేకతనీ, గౌరవాన్నీ తీసుకు రావాలని అహరహం కృషి చేస్తున్నానండి. మీ బోటి పెద్దలు తగు సలహాలిస్తే మరింతగా..."

"అమ్మమ్మ! అంతమాటనకండి. మీముందు మేమెంత చెప్పండి? విజ్ఞాన సర్వస్వాలు మీరు. మేం గాలివాటు మనుష్యులం. ఇంకోమాట. మీరేమనుకున్నా సరే చెప్పక తప్పదు. ఇదివరకటి ప్రిన్సిపాల్ ఆ పదవికి అనర్హుడని నెత్తీనోరూ కొట్టుకున్నా సర్వీసు రూల్సు దృష్ట్యానూ కమిటీ చైర్మన్ మనిషవడం వల్లనూ మిగతావాళ్ళు నాతో పూర్తిగా ఏకీభవించలేదు. ఇప్పుడు కాలేజీలో వచ్చిన మార్పు చూస్తోంటే మీ ముందు పనిచేసిన ప్రిన్సిపాల్సంతా ఎంత అసమర్థులో సాక్ష్యాధారాల్తో ఋజువవుతోందనుకోండి"

వుబ్బి తబ్బిబ్బయ్యారు చిదంబరం.

"మిమ్మల్ని చాలా విసిగిస్తున్నట్టున్నాను. ఏదో పూర్వకాలంవాణ్ణి. ఇంత ఆనందాన్ని కడుపులో దాచుకోలేక వచ్చేను. మీరు శెలవిస్తే శెలవు తీసుకుంటాను" లేవబోతూ అన్నారు.

"మీరలా అనకండి. మీలాటివారి సహాయ సహకారాలే మా కాలేజీకి శ్రీరామరక్ష"

"అన్నట్టు నే వస్తోంటే మావాడేదో కనుక్కోమని చీటీ ఇచ్చాడండీ...." అంటూ జేబులు వెతికినట్టు వెతికి ఓకాగితం తీసిచ్చారు. "అక్కడికీ అన్నాను. నేను



తీసుకెళ్ళటం బావోదురా. నువ్వెళ్ళి ప్రిన్సిపాల్‌గార్ని కలిస్తే క్షణాల్లో పని చేసిపెడతారూ అవటాని..."

"అప్పుడైతే ఏంలెండి. ఒక్కక్షణం కూర్చోండి...." అని చెప్పి హెడ్ క్లర్క్‌ని పిలిచి క్షణంలో పని చేయించి కాగితం చేతిలో పెట్టేశారు చిదంబరం.

కృతజ్ఞతలు చెప్పి ఇంటికొచ్చి ఆ కాగితం కొడుక్కిచ్చారు శ్రీపతిరావు గారు.

అతడమితాశ్చర్యంతో "ఇన్నాళ్ళు తిరిగినా నేను చేయించుకోలేనిది - కనీసం కదపలేనిది మీరు చేయించుకొచ్చారంటే నమ్మలేక పోతున్నాను. మీరెలా సాధించగలిగారు నాన్నగారూ" అనడిగాడు.

"సహస్ర నామార్చన పూజలూ, ధూప దీప నైవేద్యాలు విఫలమైనప్పుడు వదలాల్సిన పాశుపతాస్త్రంరా" అని నవ్వేరాయన.

•••

కంప్యూటర్ టీజింగ్

COMPUTER TEASING COMPUTER TEASING

బహుమతి పొందిన ప్రశ్న:-

గరిగనర్సయ్య రామకృష్ణపూర్

ప్ర పిచ్చివాడి చేతిలో రాయి పెట్టడమంటే?

జ *మనిషి చేతిలో ఓటు పెట్టినట్టు*

బహుమతి పొందిన ప్రశ్న:-

బి. నాగేశ్వరావు నందివెలుగు

ప్ర దేశనాయకుల స్మారక స్థూపాలు నాలుగురోడ్ల కూడలిలోనే ఉంటాయి ఎందుకు?

జ *మ్యూజియంలో పెడితే ఆ సెక్షను ఎవరూ చూడరని*

బహుమతి పొందిన ప్రశ్న:-

జి. రమేశ్‌బాబు ప్రత్తిపాడు

ప్ర రాజులు సొమ్ము రాళ్ళపాలు, మరి ప్రజల సొమ్ము....?

జ *రాజుల పాలు*

బహుమతి పొందిన ప్రశ్న:-

అన్నపు రెడ్డి గంగాధరరెడ్డి తెనాలి

ప్ర ప్రపంచంలోకెల్లా అతి ధైర్యవంతుడు ఎవరు?

జ *భార్యని ఒంటరిగా పోలీస్ స్టేషన్‌కి పంపగలిగేవాడు*

బహుమతి పొందిన ప్రశ్న:-

కె. శివరామకృష్ణప్రసాద్ ఏలూరు

ప్ర 'అర్ధరాత్రిఆడది' ఒంటరిగా ఎప్పుడు నడవగలదు?

జ *వంద సంవత్సరాలు గడిచాక, దేశానికికాదు ఆడదానికి వయసు వంద.*

బొబ్బిలిశ్రీనివాసరావు ద్రాక్షరామ

ప్ర లేడీ కానిస్టేబుల్స్‌కి నైట్ బీట్ వేస్తే?

జ *ఇలాంటి చచ్చుప్రశ్నలు ఎప్పుడు మానతావు శ్రీనివాసరావూ?*

బొబ్బిలిశ్రీనివాసరావు ద్రాక్షరామ

ప్ర "శ్రీ" కి ప్రియమైనది ఏమిటి?

జ *అదిగో మళ్ళీ*

కె. మురళీకృష్ణ హైదరాబాద్

ప్ర 'సారే జహాసె అచ్ఛా హిందూస్మితా హమారా' అంటే ఏమిటి...?

జ *హిందూ స్మితాకాదు హిందుస్తాన్.*

జి. సత్యజిత్ ఖమ్మం

ప్ర మొన్న సంగీత్‌లో నీ ప్రక్క కూర్చున్న పాప ఎవరు కంప్యూటర్ బాబూ...?

జ *హంసధ్వనో-కళ్యాణో*

డి.వి. మురళి మొహన్ కాకినాడ

ప్ర కొన్ని సినీ వారపత్రికలలో బూతు శృంగారం ప్రాధాన్యత వహిస్తోంది దీనిని ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవటంలేదు?

జ *ప్రభుత్వ ప్రతినిధులే బూతుని ప్రోత్సహిస్తున్నారు కాబట్టి.*

లెనిన్‌బాబు కొత్తపేట

ప్ర భూమిమీద పుట్టలేనిది?

జ *చంద్రశిల*

సి.హెచ్. రవీందర్ ముదోలు

ప్ర ఆడవాళ్ళుగా పుట్టడం నేరమా?

జ *ఆడవాళ్ళకి పుట్టటం నేరంకాదు.*

ఆర్. ఎస్, పద్మజ విజయవాడ

ప్ర తమ ఆస్థంతా ప్రజలకే రాసిచ్చిన వాళ్ళే రాజకీయాల్లో చేరాలని విధిస్తే?

జ *బాగానేవుంది. డబ్బు రొటేట్ అవుతుంది. ప్రజల్నుంచి మళ్ళీ వాళ్ళకి*

యస్. బడేజాని పిడుగురాళ్ళ

ప్ర నీకన్నా మంచి బ్రెయిన్ ఉన్న మనిషెవరో సెలవిస్తావా కంప్యూటర్ మిత్రమా?

జ *పిచ్చివాడా! ఈ మాత్రం ప్రశ్నలకి సమాధానం కోసం బ్రెయిన్ కూడా కావాలా!*

యం. బుచ్చేశ్వరావు నందివెలుగు

ప్ర నేటి సాహిత్యం ఎవర్ని ఉద్ధరించడానికి...

జ *బుచ్చేశ్వరావుల్ని*

బి. ఏడుకొండలు నందివెలుగు

ప్ర పైసాకు సైతం కక్కుర్తిపడే వాణ్ణి ఏమనాలి?

జ *మర్కట పిటీటర్*

యస్. కోటేశ్వరావు నందివెలుగు

ప్ర 'ఎమర్జన్సీ' విధించాల్సిన పరిస్థితి ఎందుకొస్తుంది?

జ *టాయిలెట్ పోయినప్పుడు*

కె. వెంకట సాయిరామారెడ్డి పిట్టల వేమవరం

ప్ర మంత్రుల రిటయిర్మెంట్ వయస్సు ఎంత ఉంటుంది. కంప్యూటర్?

జ *వాళ్ళ భార్యలు చెప్పాలి*

జె. కృష్ణరావు గుంటూరు

ప్ర అన్న-పూర్ణయేనా?

జ *కాదు. అన్నీ పూర్ణే*

ధూళిపాళ శేషగిరి రూర్కెలా

ప్ర తెలుగు, తెలుగూ అని గోలపెడుతూ మీ ముఖ్యమంత్రిగారి 'బెంగాలీ వేషం'లో ఉన్న అంతరార్ధంబేమి?

జ *'ధూళి' శేషగిరిగారూ*

కాకరపర్తి శ్రీనివాసరావు తెనాలి

ప్ర 'జ్యోతి' ఎడిటర్ నవ్వాలంటే?

జ *జోకులు భరించలేక యంత్రం కెట్టిలాయి రాజీనామా చెయ్యాలి*

గంగాధర్ నిర్మల్
ప్ర "నేను కాని నీవు, నీవుకాని నేను నేను నేనే మరి నీ వెవరు ?"
జ నేనే నువ్వు నువ్వు నేనే నేనేనువ్వు

జీ.రమేష్‌బాబు ప్రత్తిపాడు
ప్ర వ్యక్తి వ్యక్తికీ మధ్య అవగాహన పెంపొందించే శక్తి ఏమిటి ?
జ జెనటిక్స్

కె. రామ్‌మోహన్ నర్సపూర్
ప్ర ముఖ్యమంత్రి కంప్యూటర్ వేషం వేస్తే ?
జ బూడిద బదులు అయిల్ రాల్తుంది

ధూళిపాళ శేషగిరిరావు రూర్కెలా
ప్ర 'అవినీతి' లేని ఆఫీసు-ఏదో చెప్పు ?
జ పోస్టాఫీసు మాసపత్రికాఫీసు

పి.రాము గుంటూరు
ప్ర మానవుడే మహనీయుడు. మరి రాజకీయ నాయకుడే ?
జ కన్నీబాల్

ఎమ్.ఎన్. వెంకటేశ్వరరావ్ ఏలూర్
ప్ర పోలీస్‌స్టేషన్లో గోడలకు ఎర్రరంగు ఎందుకు వేస్తారు బ్రదర్ ?
జ మరకలు కనిపించకుండా

వై. మురళికృష్ణ రాజమండ్రి
ప్ర రాబోయే తరాలవారికి మనం ఏమిస్తున్నాం ?
జ గత చరిత్ర

పి. కాజా హుసేన్ ఆదోని
ప్ర పెద్ద పెద్ద శిఖరాలు ఎక్కడం ద్వారా గల ప్రయోజనం ఏమిటి ? కంప్యూటర్ జీ.
జ జెండాపాతొచ్చు జెండా ఎత్తేస్తే (అక్కడే చస్తే) నగం దింపొచ్చు

కె. గోపికృష్ణ విజయనగరం
ప్ర "కంప్యూటర్ల కే ఓటు హక్కుంటే ?"
జ తెలుగు కంప్యూటర్ కే మన ఓటు

కె.యస్. మాచన్న తాళ్ళపూడి
ప్ర భారత్‌లో బుల్లెట్ ట్రైన్స్ ? కామెంట్
జ పంజాబ్ మెయిల్

కె. రామారావ్ నింబోలిఅడ్డ
ప్ర ఢిల్లీలో కొందరు మంత్రులు మహమ్మద్ తుగలక్ రోడ్‌లో ఎందుకు అన్నారు ?
జ ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్ళేదారిఅది

గొంట్లారమాదేవి నందివెలుగు
ప్ర పొట్టకోస్తే అక్షరంముక్కరాదు.... ట్టకి, అక్షరం ముక్కకి సంబంధం ఏమిటి ?
జ పెథాలజీ వార్డులో కూడా నయాపైన అంత విలువ వెయ్యండని

కె. వెంకటరాజు తాళ్ళపూడి
ప్ర అన్న కలలు ఎన్నికలలో ఫలిస్తాయా ? వికటిస్తాయా ?
జ ఎన్ని కలలైనా ఎన్నికల కన్న కలలు ! !

జీ. రమేష్‌బాబు ప్రత్తిపాడు
ప్ర వాగ్దానాలు ఎందుకు చేస్తారు ?
జ తొమ్మిది నెలల లేక ఐదు సంవత్సరాల తరువాత మళ్ళీ చేయటానికి

ప్ర 'నడుస్తున్న చరిత్ర' (కామెంట్ ప్లీజ్)
జ చైతన్యరథాన్ని అనుకుని నిద్రపోయింది

జి.ఎమ్.వి.ఆర్. బాబు ఏలూరు
ప్ర తెలివితేటలకు మీకిచ్చే నిర్వచనం ?
జ నేని రోజు ఇన్ని తెలివితేటల్తో భాసించడానికి కారణం - నాకువాడే ట్రిరేటింగ్ అయిలే టింగ్... టింగ్

బి. శ్రీనివాస్ గుంటూరు
ప్ర సృష్టి అంటే ?
జ విశ్వామిత్రుడు చేసేది

ఇందే రామలక్ష్మిదేవి కొత్తగూడెం
ప్ర గొంతెమ్మ కోర్కెలు కోరితే !
జ అంటే రామలక్ష్మిదేవి గొంతెమ్మయినా వర్లేదు

బి.శివనాగేశ్వరావు నందివెలుగు
ప్ర సగ్న సత్యాలంటే ఏమిటి ?
జ ఆలస్యంగా వచ్చి "నేన్నింత్యంగా టాగలేదు సుమీ" అని

ఎస్. వేణుగోపాల్‌కుమార్ విజయనగరం
ప్ర "విద్యార్థులు నవ సమాజనిర్మాతలు!" అని రాసాడోకవి, మరి విద్యార్థినులో?
జ నవ భారత భావిమాతలు

సి.ఎచ్. శ్రీనివాసరావు గుంటూరు
ప్ర ఎస్. బి. ఆర్ వేషాలువేసి మోసం చేయటంలో ఫస్ట్. యా మై కరెక్ట్
జ నీ అభిప్రాయంతో 7శాతం ఏకీభవిస్తున్నాను

వాయిల రమణమూర్తి
ప్ర "సంఘ జీవసంతన్నా జైలు జీవితమే మిన్నఅనిపిస్తోంది!...." మీరేమంటారు ?....
జ మీ అడ్రసు వ్రాయలేదేం ?

కె.యన్. మాచన్న తాళ్ళపూడి
ప్ర భగవంతుని దర్శనానికి వెళ్ళి కళ్ళు మూసుకొంటారెందుకు ?
జ పూజారిని చూడటం ఇష్టంలేక

బి. శివనాగేశ్వరావు తెనాలి
ప్ర వరదలు, తుఫానులవల్ల ఎవరికి ఉపయోగం ?
జ ప్రధానమంత్రి హెలికాప్టర్ పైలట్ కి (టి.వి. టి.వి వస్తుంది కనుక)

శాంతిబాల మండపేట
ప్ర నేటి రచయితలే రేపటి....?
జ ఎడిటర్లు

వెన్నెల రామకృష్ణపూర్
ప్ర మగాళ్ళు చూడగానే ఆడది ఏం చేస్తుంది ?
జ మీరేం చేస్తారో అదే... "పూర్ణమి పువ్వులా విచ్చుకోవటం" వెన్నెల గారూ

ఎన్నికైన ఉత్తమప్రశ్నలకు బహుమతిగా ఈ క్రింది పుస్తకాలలో మీరు కోరుకున్నది ఇవ్వబడుతుంది. మీకు కావలసిన పుస్తకం పేరు, మీ అడ్రస్ కార్డు వెనుక వ్రాయడం మరిచిపోకండి-ఎడిటర్.

డబ్బు డబ్బు		యండమూరి వీరేంద్రనాథ్
యుగాంతం		,,
రాక్షసుడు		,,
రాధ-కుంతి		,,
హ్యూమరాలజీ	(మూడుభాగాల్లో ఏదైనా)	యర్రంశెట్టి శాయి
రైల్వే జంక్షన్		,,
నవ్వు-నవ్వించు	(మూడు భాగాల్లో ఏదైనా)	,,

ప్రేమగీతం

ఇందూరమణి

సరిగ్గా—

మధ్యాహ్నం పన్నెండయ్యింది.

ఆఫీసు మూసేసి మెట్లు దిగుతున్నాను. మా కొలీగ్స్ ఏదో దీర్ఘమైన చర్చల్లో ఉన్నారు. బంట్రోతు గేటు తాళాలు వేస్తున్నాడు.

నాకు అర్జెంటుగా వైజాగ్ వెళ్ళాల్సిన పని పడింది. ఇంటికివెళ్ళి భోజనంచేసి అలా టౌన్ కెళ్ళాలి.

తలదించుకుని ఆలోచిస్తూ నెమ్మదిగా నేనొక్కణ్ణే ఒంటరిగా నడుస్తున్నాను.

"ఒరేయ్ రాజా!"

ఎవరో వెనకనుండి గావుకేక పెట్టి పిలిచేసరికి ఉలిక్కిపడి తలెత్తి చూసాను.

ఎదురుగా—

ఎన్నాళ్ళ తర్వాతో .... ఎన్నేళ్ళ తర్వాతో...గుండెల్లో తన ప్రతిరూపాన్ని మిగిల్చి నా మనసులోనూ ... మెదడులోనూ చితి రగిల్చి తనని ఏకాకిని చేసి వెళ్ళిపోయిన వసంత—!

వసంత ఎవరో ఇద్దరమ్మాయిలతో.... వాళ్ళమధ్య రాజకన్యలా నడుస్తూ వస్తోంది.

ఆమెని అలా ... అంత హఠాత్తుగా చూసేసరికి ఒక్కసారి షాకయ్యాను. నాకు తెలియకుండానే నా శరీరం షేకయ్యింది.

పదేళ్ళక్రితం నాటి మాట.

అప్పటి నా ప్రేమదేవత.

ఒకప్పటి నా ప్రేమ సామ్రాజ్య పట్టమహిషి.

వసంత!!!

నన్నుదాటి ...మా వాళ్ళనుదాటి .... క్రీగంట కూడా తనని తిలకించకుండా.... కనీసం ఈవూరు ... ఈ వాతావరణం ఈ దారులు ... ఈ మేడలు తనకస్సలు ఇంతకు పూర్వం పరిచయమే లేనట్టు తలదించుకుని జోరుగా నడుచుకుంటూ వెళ్ళిపోతోంది.

వసంత!

నా గుండెల్లో ఎక్కడో ... ఏదో... చిన్న సవ్వడి.

"డియర్ రాజా! నేనెందుకు చప్పట్లు చరిచి నిన్ను ఆపేనో అర్థమయిందనుకుంటాను. నీ మాజీ ప్రియురాలు నీ ముందర నుండే వెళ్ళిపోతుంటే నీ ఆలోచనల్లో నువ్వు తల దించుకు సాగిపోతున్నావు, ఈ క్షణం... ఈ అవకాశం ... ఈ అదృష్టం ... ఈ మహాభాగ్యం పోగొట్టుకుంటే ఇంకో జన్మెత్తినా నీ ప్రేమ దేవతని చూడాలన్నా చూడలేవు. కాదంటావా?"

రామకృష్ణ నన్ను చేరుకొని నా భుజం మీద చెయ్యివేస్తూ అన్నాడు.

ఎలా కాదంటాను?

అక్కడే—

అలాగే నిలబడి గతించిన కాలంలా సాగిపోతున్న వసంతని చూస్తూండిపోయాను. ఆమె వీధి చివరి మలుపు తిరిగిన వరకూ .... ఆమె రూపం మసకబారిన వరకూ ... చూస్తూ నిలబడ్డాను.

"మరిక ఈ పేటికి వైజాగ్ వెళ్ళననుకుంటాను." రామకృష్ణ మళ్ళా నవ్వుతూ అన్నాడు.

అప్పుడు మరి!

నా ఆవేదన పెరికి ఎగతాళిగా అనిస్తోంది మరి.


వీధికేసాను.

ఆనాడు—

ఈ వూరు .... వూరంతా ఎలా నవ్వింది? వూరి జనమంతా ఎలా హేళన చేసారు?

ఇప్పటికీ—

ఆరోజు .... ఆ క్షణం ... జరిగిన సంఘటన నా కళ్ళముందు కదులుతూనే



ఉంది.

నా కళ్ళల్లో అప్పటి అవమానజ్వాల ఇప్పటికీ మండుతూనే ఉంది.

వ...సం...త!

నా పాడు మనస్సెందుకో మళ్ళా... మళ్ళా వసంతని చూడాలని....తనివితీరా చూసి తరించాలని తెగ తల్లడిల్లుతోంది.

అప్పటికి — ఇప్పటికీ — వసంతలో ఎలాంటి మార్పూ లేదు. మారిందల్లా ఒక్కటే!

వోణీలు వేసుకు తిరిగిన వసంత ఇప్పుడు చీర కట్టింది.

చీరలో ఎంత నిండుగా ఉంది!

పెళ్ళయి పదేళ్ళయినా ఎంత నాజూకుగా... పెళ్ళికాని పిల్లలా ఎంత అందంగా హుందాగా ఉంది!

ఆ నడక —

నడిచేటప్పుడు ఆ చేతి విసురూ—

ఆ నడకలో జోరు తగ్గలేదు. ఆ చేతి విసురులో హొయలు మాయం కాలేదు. ఆమె శరీర బింకమూ చావలేదు.

'నేనే ... నేనే అన్నివిధాలుగా బాగు దెబ్బలు తిన్నాను.

పెళ్ళి పెటాకులు కాని ముదర బ్రహ్మచారిగా —

ఇల్లూవాకిలీ లేని అనాథగా —

'నా' అన్నవాడెవరూ లేని ఏకాకిగా—

ఒంటరిగా కుంటి బ్రతుకు సాగిస్తున్నాను.

అన్యమనస్కంగానే ఇల్లు చేరుకున్నాను.

ఉదయాన్నెప్పుడో వండిన వంట. ఆఫీసుకువెళ్తూ వండిన వంట. తినబుద్ధి కాక ... ఆకలి అనిపించక మంచం మీద అలాగే వెనక్కి వాలి మేను వాల్చాను.

భూతంలా పొంచిఉన్న గతం ఒక్కసారి మీద పడింది.

జ్ఞాపకాల్లో దొర్లుకుంటూ గతంలోకి జారిపోయాను.

* * *

"వసంతా! ... వసంతా! ఆగు వసంతా! అబ్బ నేనంత జోరుగా నడవలేను వసంతా! ప్లీజ్! అగవూ!"

"రాజూ! ... రా! రాజూ! ఆడపిల్లన్నేను. నువ్వేమో మగాడివి. ఈమాత్రం నడవలేవూ?"

"ఇక నేను నడవలేను వసంత. నా వల్ల కాదు" రోడ్డుమీద చతికిలబడుతూ అన్నాను.


"అబ్బ! రా! రాజూ! ఇంకో మైలుంటుంది. ఇక్కడ్నుంచి ఈ కాలిబాటన వెళ్తే మన గమ్యం చేరుకుంటాం. ప్లీజ్! లే! రాజూ!" నా దగ్గరకు వచ్చి నాచేయి పట్టుకొని లేవనెత్తుతూ అంది వసంత.

"కూర్చో! ఓ అరక్షణం సేద దీర్చుకుని లేచి పరుగెడదాం. ఓకేనా?" చిన్నగా నవ్వుతూ అన్నాను ఆయాసంతో రొప్పుతూ.

"రాజూ! ఈ ప్రమాదకర పరిస్థితిలో కూడా నువ్వెలా నవ్వగలుగుతున్నావో నాకర్థం కాదు.

పద. మనం ముందు భైరవవాక చేరుకుంటే మీ స్నేహితుడు తెల్లారగట్లే అన్ని ఏర్పాట్లతో వస్తాడు. అంతవరకూ మనం ఈ ప్రాంతాల్లో కనిపించ కూడదు. రా!"

వసంతే మగాడై నేనే ఆడపిల్లనైతే ఎంత బావుండేది? నాదంతా ఆడపిల్ల మనస్తత్వం. కాస్త దుఃఖం వచ్చినా



భరించలేను. సంతోషం కలిగినా తట్టుకోలేను.

నిజంగా నేనెంత అదృష్ట వంతుణ్ణి.

వసంతలాంటి ధైర్యవంతురాలిని ... అందగత్తెని .... భార్యగా పొందగలుగుతున్నానంటే — ఇన్నేళ్ళ శాపఫలానికి భగవంతుడు ప్రసాదించిన ఏకైకవరం, మహాభాగ్యం ఇదేనేమో!

అనాథగా పెరిగాను.

అదృష్టంకొద్దీ ఈ వూరొచ్చి పడ్డాను ఉద్యోగరీత్యా. నేనూ ... నా ఉద్యోగం.

వూరు పల్లెటూరైనా పుణ్యక్షేత్రం కావటంచేత ఎప్పుడూ పచ్చగా కలకలలాడుతూంటుంది.

సనాతన సాంప్రదాయంగల గ్రామం అది.

ఊరు వూరంతా పూజారులు...వ్యాపారస్థులు .... ఉద్యోగులే!

అనుకోని విధంగా దేవుడి తెప్పోత్సవంలో పరిచయమైంది వసంత. మా ఇంటిప్రక్క అమ్మాయి వసంత స్నేహితురాలు కావటం మా స్నేహం క్రమంగా ప్రేమగా బలపడటానికి కారణమయింది.

నాకు చరిత్ర లేదు.

వసంత ఆ వూరి దేవాలయం ప్రధానార్చకులవారి ఏకైక కుమార్తె. సత్సాంప్రదాయం గల కుటుంబంలో పుట్టిన వసంత నా ప్రేయసి అయింది.

నా కవిత్వం ఆమెని ఆకట్టుకుంటే ఆమె మధురమైన గాత్రం నన్ను పరవశుణ్ణి చేసింది.

సాహిత్యం - సంగీతం జంటయినట్టే మేమిద్దరం ప్రేమికులమయ్యాం.

* * *

"ఏయ్! రాజూ! ఏమిటి? ఆలోచిస్తున్నావ్! రా! .... అబ్బ! లే రాజూ!" నన్ను బలంగా చేత్తో లేపబోయి నా మీద పడింది వసంత.

నవ్వుతూ వసంతని కౌగిట బంధిస్తూ నిలబడ్డాను.

"పద!" అంటూ నా కౌగిలి విడిపించుకొని నా చేయి పట్టుకొని పరుగు పెట్టింది వసంత.

ఇద్దరం కాలి బాటవెంట పరుగెడుతున్నాం.

వెన్నెల రాత్రులు కావటంచేత దారి మసక ....మసకగానైనా కనబడుతోంది. దారి పొడుగునా పొదలు దెయ్యాల్లా

దట్టంగా ఉన్నాయి.

రెండుగంటలయింది భైరవవాక చేరుకునేసరికి.

విశాలమైన మైదానం. చుట్టూ రాతి చప్టాలు. ఎత్తుగా వేదికలా ఉన్న ప్రదేశంలో ఓ విగ్రహం ఉంది.

నేనావూరొచ్చి రెండేళ్ళు అయిందిగాని ఇంత సుందర ప్రదేశం ఈ మారుమూల ఈ కొండల నడుమ ... ఈ అడవిమధ్య ఉందని ఏనాడూ వినలేదు.

ఆశ్చర్యంగా వసంతకేసి చూసాను.

"ఇదే భైరవవాక. ఇదికూడా ఆ దేవాలయం వారి అధీనంలోనే ఉంది. అయితే — ఈ కాలభైరవ స్వామి దర్శనానికి భక్తులు రారు. శనివారం ఒక్కరోజే వస్తారు. అందుకే మనపెళ్ళి ఇక్కడ ఏర్పాటు చేశాడు మీ మిత్రుడు." నన్ను వాటేసుకుంటూ చెప్పింది వసంత.

"పద! ఆ మూల కూర్చుందాం!" వసంత నడుంచుట్టూ చేయివేసి నడిపించుకుంటూ వెళ్ళాను.

ఇద్దరం ఒకరికొకరం హత్తుకుంటూ కూర్చున్నాం.

"జీవితాంతం ఇలాగే నీ ఒడిలో ... నీ చల్లని నీడలో నా బ్రతుకు తెల్లవార్చాలని నా ఆశ రాజు!" నా ఒళ్ళో తల పెట్టుకుని కళ్ళు మూసుకుంటూ అంది వసంత.

"నాకో! నేను వ్రాసిన పాట నీ గొంతులో వినాలని పేరాశ. తీరుతుందంటావా?" ఆమె రేగిన కురులు సవరిస్తూ అన్నాను.

"కష్టం! ఎందుకంటే-నేను సంగీతం నేర్చుకున్నాక .... నీ పాటకు బాణీ కట్టి



పాడాలి. అది ఇప్పుడిప్పుడే జరిగే పని కాదు." నవ్వుతూ అంది.

"ఎప్పటికైనా తీరుతుందికదా!"

వసంత మొహాన్ని నా చేతుల్లోకి తీసుకొని ఆమె పెదవులమీద ......

"ఛీ! పాడు! ఈ ఆరు ఘడియలూ ఆగలేవా?" అని నన్నొక్కసారి తన రెండుచేతుల్తో వెనక్కి నెట్టి కాలభైరవ స్వామి విగ్రహం దగ్గరకు వెళ్ళి కూర్చుంది వసంత.

"సారీ! వసంత! తప్పయింది. క్షమించవూ!" చెంపలమీద రెండువైపులా చేత్తో చరుచుకుంటూ అన్నాను.

"కాలభైరవ స్వామికి మొక్కుకో! ఏం కోరుకున్నా తప్పక తీరుస్తాడని ప్రతీతి." అంది నెమ్మదిగా చెవులో చెప్తున్నట్టు.

సరిగ్గా—

అదేసమయంలో—


వరుసగా మూడు గంటలు భీకరంగా అతి భయంకరంగా ఆ నిశ్శబ్ద నిశిధిలో ప్రతిధ్వనించాయి.

అప్పుడే—

చీకటి దట్టంగా పేరుకు పోయిన కొండ మీద ఏదో వెలుగు కొండ చిలువలా పాకుతూ వెళుతోంది.

భయంగా వసంత ప్రక్కకు వెళ్ళి కూర్చున్నాను.

"మూడయింది రాజూ! ఈ గంటలు సమయ సూచకంగా కచేరిలో కొడతారు. అదిగో! ఆ కొండమీద చూడు. వెలుగు కదుల్తోందా? అది దేవస్థానం బస్సు. దేవాలయం తెరవటానికి .... ఆ దేవుడికి మేలుకొలుపు పాడటానికి అర్చకుల్ని



తీసుకు వెళ్తోంది."

ఈసరికి మా ఇంట్లో గలాటా ప్రారంభమై ఉంటుంది." నెమ్మదిగా అంది వసంత నాతల తనఒళ్ళోకి లాక్కుంటూ.

"గలాటా ?" ఆశ్చర్యంగా అన్నాను

"అవును. నేను ప్రక్కమీద లేక పోయేసరికి మా నాన్న కంగారు పడ్తూ? నా కోసం మా బంధువులందరి ఇళ్ళూ వెదుకుతారు. ఎక్కడా కనిపించక పోయేసరికి ఇక వూరిమీదపడి ముందుగా నీ గదికి వెళ్తారు" అంది వసంత.

"అమ్మో ! మరెలా ?" భయం ... భయంగా అన్నాను. నా గొంతెందుకో ఎండిపోతోంది. నాకు తెలియకుండానే నా శరీరం చెమట కమ్ముతోంది.

ఆ వూర్లో వసంత నాన్నగారిదే పై చేయి. ఆయన మాటంటే మాటే! ఆయనే ఆ వూరికి మోతుబరి. ఆయనే ఆ వూరి రాజకీయాల నేత.

"మీ స్నేహితుడు రామకృష్ణ ఈసరికి బయల్దేరేసే ఉంటాడు. మనం ఇక్కడ పెళ్ళిచేసుకొని .... ఫొటోలు తీసుకున్నాక వైజాగ్ వెళ్ళి రిజిస్ట్రార్ ఆఫీసులో మనకి వివాహం జరిగినట్టు నమోదు చేయించుకుందాం. ఆ తర్వాత మనమే ధైర్యంగా మా నాన్న ముందుకెళ్ళి నిలబడదాం" ధైర్యంగా అంది వసంత.

వసంత ఇంకా ఏదో చెప్పబోతుండగా నా మొహంమీద టార్చిలైట్ వెలుగు పడింది. ఉలిక్కిపడి ఛటుక్కున లేచి కూర్చున్నాను.

"మీ స్నేహితుడయి ఉంటాడు రాజూ!" ధైర్యం చిక్కబర్చుకొని అంది వసంత.

కానీ—

ఆ వచ్చింది వసంత నాన్నగారి మనుషులు. వాళ్ళతోపాటు రామకృష్ణకూడా ఉన్నాడు.

పాపం! రామకృష్ణని బాగా చితకబాదినట్టున్నారు. తల రేగి ... చొక్కా చిరిగి ... పెదవులు చిట్లి రక్తం కారుతోంది.

నన్నొకతను జుట్టు పట్టుకొని క్రింద పడేసి బలంగా బాది తన్నాడు. అలా ఎందరు కొట్టారో....! ఎందుకు తన్నారో!

వాళ్ళ చిత్రహింసలు భరించ లేక స్పృహ తప్పి పడిపోయాను.

● ● ●

"హవ్వ! ... హవ్వ! అమాయకుడనుకున్నాం. గ్రంధసాంగుడే!"

"ఎరగని నక్కలా ఉండి వూరికే ఎసరెట్టబోయాడు"

"ఏవీ ఎరగనట్టుండి పంతులుగారమ్మాయినే లేపుకుపోయాడా? అమ్మో! వీడిక ఈ యింట్లో ఉంటే నా కూతురు పరువేంగాను దేవుడో!"

గదంతా ఆ మాటలు ప్రతిధ్వనించేసరికి ఉలిక్కి పడి లేచాను.


ఆనాడు—

వూరంతా ఎలా ఎగతాళి చేసింది? ఎందరు ... ఎన్ని రకాలుగా దుర్భాషలాడారు?

ఆ రోజు—

నానుండి దూరమయిన వసంత మళ్ళా ఈ రోజు ప్రత్యక్షమయింది.

వసంతకి అన్నవరంలో పెళ్ళయిందని తెలుసు. కానీ, ఎక్కడికి వెళ్ళిపోయిందో ... ఏ వ్యక్తిని పెళ్ళాడిందో...



ఎలా ఉందో ... ఏమైపోయిందో ... ఇన్నేళ్ళయినా వసంత గురించి వీసమెత్తు కూడా తెలుసుకోలేక పోయాను.

వసంతకి పెళ్ళయిన సంవత్సరమే వాళ్ళ నాన్న హఠాత్తుగా చనిపోయాడు. వసంత అన్నలు ఉద్యోగరీత్యా వూర్లో ఆస్తంతా అమ్మేసి వూరొదిలిపెట్టి పోయారు.

నాలో వసంత జ్ఞాపకాలు మసకబారిపోతున్నాయి.

ఆ వూర్లో వాళ్ళ చరిత్రా సమాధయిపోయింది.

మళ్ళా—

ఇప్పుడు వసంత ప్రత్యక్షమయింది.

ఎలాగైనా వసంతని కలవాలి. ఎలా?

వసంత ఎక్కడికి వెళ్ళుంటుందో నాకు తెలుసు. ఇంతకుముందు తను అద్దెకున్న వాళ్ళింటికి వెళ్తుంది. నాకోసం కాకపోవచ్చు. వాళ్ళ స్నేహితురాలుకోసం వెళ్తుంది.

ఆ ఇంటికి వెళ్తే కొంతైనా సమాచారం లభించవచ్చు.

గభాలున లేచి బట్టలు వేసుకున్నాను. గదిలోనుండి బైటకొచ్చాను.

చీకటి పడింది. సాయంత్రం ఆరు దాటి ఏడుకేసి పరుగెడుతోంది కాలం.

వసంత ఇంకా ఉంటుందా? బహుశా వెళ్ళిపోయుంటుంది. చూద్దాం. వాళ్ళింటికి వెళ్తే విషయం తెలియకపోదు.

ఆ ఇంటికి వెళ్ళేసరికి ఆ అమ్మాయి ఎదురైంది. పాపం! ఎంత చిన్నమ్మాయి ఎలా అయిపోయింది. తను ఈ ఇంట్లో ఉండేటప్పుడు వసంతకన్నా చిన్నపిల్లలా ఉండే ఈ అమ్మాయి ఎలా పాడైపోయింది.

"రా! అన్నయ్యా! ఏవిటి ఇలా వచ్చారు?" పలకరింపుగా అంది ఆ అమ్మాయి.

"ఊరికినే!" అన్నాను అదోలా.

"నాకు తెలుసులే అన్నయ్యా! వసంత కోసమేగా వచ్చింది. తనూ నిన్ను అడిగింది. ఎలా ఉన్నారని....ఏం చేస్తున్నారని ... ఎంతమంది పిల్లలని ... ఎన్ని ప్రశ్నలో?! అన్నిటికీ ఒకే జవాబు చెప్పాను. అప్పటికీ, ఇప్పటికీ ఒకేలా ఉన్నావని." చెప్తూ చెప్తూ దుఃఖం ఆపుకోలేక కళ్ళనీళ్ళు దించుకుంది ఆ అమ్మాయి.

నాకోసం జాలిపడే ఈ పసిపిల్ల

పిచ్చిదా? మంచిదా? నన్ను ఈ లోకమే అసహ్యించుకుంది.

ఈ పిచ్చిపిల్ల నా కోసం కంటతడి పెడుతోంది?!

"ఇంతకీ వసంత ఈ వూరెందుకొచ్చినట్టో" సంశయంగా అన్నాను.

"వాళ్ళాయనకి వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయిందట, వైజాగ్‌లోనే ఉంటున్నారట రేడియో స్టేషన్‌కి ఆడిషన్ టెస్ట్‌కోసం వచ్చి ఇలా వచ్చిందట వూరు చూద్దామని"

"ఆడిషన్ టెస్ట్‌కా?"

"అవునన్నయ్యా!"

"ఆడిషన్ జరుగుతోంది! స్టేషనంతా వారం రోజుల్నుండీ రద్దీగా ఉంటోంది. ఇద్దరికోసం ఆడిషన్ టెస్ట్ ఏర్పాటు చేస్తే మూడొందలమంది వచ్చారు. రోజుకు పదిహేను మందిని పిలిచి పాడిస్తున్నాం" నా మిత్రుడు వారం క్రితం అన్న మాట నా చెవుల్లో మార్మోగింది.

వసంత పూర్తిపేరు నోట్ చేసుకొని "వస్తానమ్మా!" అని చెప్పి వీధిలోకి వచ్చాను.

వసంత కోర్కె తీరబోతోందన్న మాట.

"తనని కోరుకున్న వసంతకి తను దక్కలేదు. కనీసం, ఆమె తన మన శ్శాంతికోసం ప్రాకులాడుతున్న సంగీత మన్నా ఆమెకు ఓ వరమై ఈ ఆడిషన్ టెస్ట్‌లో నెగ్గితే ఎంత బావుణ్ను?"

వసంత నెగ్గక పోయినా నెగ్గించాలి.

నా మిత్రులద్వారా ప్రయత్నించి వసంతకి ఈ అవకాశం అందచేయాలి.

స్థిరంగా ఒక నిర్ణయానికి వచ్చి అప్పటికప్పుడు వైజాగ్ బయల్దేరి వెళ్ళాను.

రేడియో స్టేషన్లో పనిచేస్తున్న మిత్రుణ్ణి కలిశాను. వసంత గురించి చెప్తే ఆ మిత్రు డన్నాడు.

"ఈ ఆడిషన్ టెస్ట్‌కి ఇద్దర్ని కమిటీ మెంబర్లుగా వేసారు. అందులో స్టేషన్ డైరెక్టర్ ఒకరు. రెండోఆయన్ని కలిసి చెప్పగలిగితే నేను స్టేషన్ డైరెక్టర్ గారికి చెప్తాను." అని ఇంటర్వ్యూ చేసినతని అడ్రసు చెప్పాడు.

మిత్రుడు చెప్పిన అడ్రసు ప్రకారం వెళ్ళాను.

ఆ ఇంటి నెంబరు వెదుక్కుంటూ చాలాసేపు తిరిగాను. ఎట్టకేలకు అడ్రసు దొరికింది.

ఇల్లు చాలా బావుంది. పొందికగా చెక్కిన ఆర్చిలా అద్భుతంగా ఉంది. గేటు తీసుకొని లోపలకు అడుగు పెట్టాను.

దారి పొడుగునా రకరకాల పూల మొక్కలు.

వరండాలో ఇద్దరమ్మాయిలు 'సితార' పట్టుకొని కూర్చున్నారు. ఎక్కడనుండో మృదంగ ధ్వని లీలగా వినిపిస్తోంది.


గదిలోనుండి బాల మురళీకృష్ణ ఆల పిస్తున్న మోహన గీతం మనోహరంగా వినిపిస్తోంది.

ఆ కమనీయ వాతావరణానికి నేను తన్మయుణ్ణయ్యాను.

బహుశా ఆ కమిటీ మెంబరు ఇంటిని సంగీత నిలయంగా తీర్చి దిద్దారు అను కున్నాను.

"ఎవరు కావాలండీ?" సితార పట్టు కూర్చున్న పాప లేచి నా దగ్గరకొచ్చి అడిగింది.

"నాన్నగారున్నారమ్మా?" అన్నాను.



"లోపల ప్రక్క గదిలో ఉన్నారు వెళ్ళండి." ఆ పాప మళ్ళా తన సితార దగ్గరకు పరుగందుకుంది.

ఇంట్లో అడుగు పెట్టీ పెట్టగానే నా చెవుల్లో సప్తస్వరాలు వినిపించాయి.

అడుగులో అడుగు వేసుకుంటూ ఆ గది ద్వారం దగ్గరకు వెళ్ళాను. తలుపులు దగ్గరగా వేసున్నాయి.

తలుపుల సందులోనుంచి చూస్తే లోపల వ్యక్తులు కన్పిస్తున్నారు. పిలవాలో పిలవ కూడదో?

క్షణం తటపటాయించాను.

లోపలనుంచి చిన్నగా మాటలు వినిపిస్తున్నాయి.

"వసంతా! పాలు తీసుకు రాగలవా?"

"అలాగే! తెస్తానండి. కొంచెం నే నొచ్చేలోగా ఈ వీణను శృతిచేయరా?"

ఉలిక్కి పడ్డాను.

"ఆ గొంతు..."

తలుపు సందులోనుంచి పరిశీలనగా చూశాను.

వసంత!

ఆ గదిలోనుంచి అలా వంటగదిలోకి గాబోలు వెళ్తోంది.

"వసంత భర్తేనా! తను కలవాలని వచ్చిన వ్యక్తి."

"లోపలకురండి!" గంభీరంగా లోపలనుండి ఆ వ్యక్తి నన్నే పిలిచాడు.

తత్తరపాటు అణుచుకుంటూ లోపలకు వెళ్ళాను తలుపులు నెట్టుకుంటూ.

"కూర్చోండి!" అతనన్నాడు.

నిశ్శబ్దంగా కూర్చున్నాను.

"తీసుకోండి పాలు!" వసంత పాల గ్లాసుతో వచ్చింది.

"వారికివ్వు వసంతా!" అతనన్నాడు.

ఆశ్చర్యంగా కళ్ళింత చేసుకొని నన్ను చూసింది వసంత.


పాలగ్లాసు అందుకున్నాను.


"మీ...రు...!" అతను సందిగ్ధంగా అన్నాడు.

నన్ను నేను పరిచయం చేసుకోలేకపోయాను.

"రాజు! అని చెప్పేదాన్ని కదండి ఇతనే" వసంత తన భర్తకు నన్ను పరిచయం చేసింది.

"హలో! మీరేనా? మీ గురించి వసంత నాకంతా చెప్పింది. మీ అమాయకత్వానికి జాలిపడాలో...బాధపడాలో అర్థంకాలేదు





మాట. గతించిన జ్ఞాపకాలతో .... పీడకలల్తో మీ బ్రతుకును మీరే నాశనం చేసుకుంటున్నారు. పెళ్ళి చేసుకోండి. మీ సాహిత్య సృష్టి మళ్ళా ప్రారంభించండి."

నాకు నోట మాట రావటంలేదు.

అతనికేసి ఆశ్చర్యంగా చూసాను.

అతను మామూలు మనిషేనా? ఇతను అందరిలాంటి వాడేనా? కాదు. ఏమగాడూ సహించని విషయాన్ని ఇతను అతి మామూలుగా .... అతి నిరాడంబరంగా ఎలా చెప్పగలుగుతున్నాడు?

"మీరు వెంటనే పెళ్ళి చేసుకోండి. పెళ్ళి చేసుకుంటే మీ బ్రతుక్కి .... జీవితానికి ఓ సార్థకత ఏర్పడుతుంది. మీ దాంపత్యం సుఖంగా సాగటమే మీ కష్టాలకు సత్ఫలితం .... మీ బ్రతుక్కి పరమార్థం...." అతనే మళ్ళా అన్నాడు.

"సారీ! .... అమ్మా, పిల్లా! ఇలా రండి." వసంత పిల్లల్ని కేకేసింది. వరండాలో సితార సాధనలో ఉన్న అమ్మాయిలిద్దరూ వచ్చారు.

"అన్న లేడా?" వసంత ఆ పిల్లల్తో అంది.

"అదిగో! పెరట్లో మృదంగనాదం వినిపిస్తోందిగా!" స్వాతి తన ఆల్చిప్పల్లాంటి కళ్ళు త్రిప్పుతూ అంది.

నా మనసు ఆర్ద్రమైంది.

నా కళ్ళకున్న పొరలు విచ్చుకున్నాయి.

నా కళ్ళల్లో నాకు తెలియకుండానే కన్నీటిపొర కదిలింది.

"వస్తానండి"

ఆ దంపతులిద్దరికి నమస్కారం చేసి పిల్లలిద్దర్నీ ముద్దు పెట్టుకుని బైటపడ్డాను.

రోడ్డుమీదకు వచ్చి వెనక్కి తిరిగి చూసాను.

వసంత .... పిల్లలు... వాళ్ళ ఆయన వరండాలో నిలబడి నాకేసే చూస్తున్నారు.

నాక్షణం—

ప్రపంచంలో ఏదో మార్పు కనిపించింది.

మనుషులంతా సాధువుల్లా ... భగవంతుల్లా కనిపిస్తున్నారు.

●

సైకాలజీలో - 12 సరదాలు

నిర్వహణ :- కంఠంనేని రాధాకృష్ణమూర్తి

జీవితంలో ప్రతిమనిషికీ సమస్యలు ఎదురవుతుంటాయి. కొందరు సమస్యలను నేర్పుగా పరిష్కరించుకోగల్గితే మరికొందరు పరిష్కరించుకోలేక బెంబేలుపడి పోతుంటారు. సమస్యల్ని పరిష్కరించుకోవటం, పరిష్కరించుకోకపోవటమనేది కొంతవరకు అవకాశాలమీద ఆధారపడినా వాటిని ఎదుర్కొనే మనస్థయిర్యం మాత్రం వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. బాల్యంలో మనం పెరిగిన తీరు, తల్లిదండ్రుల కుటుంబ జీవనం మొదలైనవి ఎవరికిగానీ భవిష్యత్తులో ఏర్పడబోయే వ్యక్తిత్వానికి పునాదులుగా పనిచేస్తాయి. భవిష్యత్తులో మనం ఆశావాదులుగా తయారవుతామా లేక నీరసపు నిరాశావాదులుగా మిగిలిపోతామా అన్నదానికి అంతర్లీనంగా మన మనస్సుమీద పని చేసే ఈ బాల్యానుభవాలు ప్రేరకాలు అయి ఉంటాయి. మీ బాల్య జీవితం ఏ రకంగా గడిచిందో దాని ఫలితంగా భవిష్యత్తులో మీరు జీవన సమస్యల్ని సమర్ధవంతంగా పరిష్కరించుకోగలరో లేదో ఈ కింది ప్రశ్నలకు సమాధానాలివ్వటం ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రశ్నలు :

1. బాల్యానికి సంబంధించి మీకు గుర్తున్న మొట్టమొదటి జ్ఞాపకం ఏమిటంటే :



(ఎ) సంతోషంతో చూడుకుని - వెల్తురుతో కూడుకున్నగది, నవ్వుతూచూస్తున్న మీ తల్లి మొహం.

(బి) భయం గొల్పుతూ - ఎక్కడో తప్పిపోయినట్లుగానూ, ఎవరివో కొత్త మొహాలు కనిపిస్తూనూ.

2. మీ స్కూలు జీవితం ఎలా గడిచిందంటే :

(ఎ) అద్భుతం-మీరో నాయకుడిగా, క్లాసులో ఫస్టు మార్కులతో.

(బి) ఆనంద దాయకం-మధ్యరకం మార్కులు వచ్చేవి, తోటి పిల్లలు ఇష్టపడేవారు.

(సి) బాధాకరం - బాగా తక్కువ మార్కులు వచ్చేవి, పెద్దగా స్నేహితులుండేవారు కూడా లేరు.

3. మీకు పన్నెండేళ్ళు వచ్చేలోపల మీ తల్లిదండ్రులు ఇళ్ళు మారుస్తుండేవారా ?



(ఎ) మాటిమాటికీ మారుతుండేవారు, చిరాకుగా ఉండేది.


(బి) ఒకటి రెండు సార్లు మారి ఉంటారు.

(సి) అసలెక్కడికీ కదల లేదు. ఎప్పుడూ ఒక్కచోటే ఉన్నాము.

4. కుటుంబంలో మీరు :

(ఎ) జ్యేష్టులు లేక ఏకైక సంతానం

(బి) నలుగురయిదుగురు పిల్లల్లో మధ్య వాళ్ళు.




5. మొదటిసారిగా కుటుంబాన్ని వదిలి కొన్నాళ్ళపాటు చుట్టాలింటికో చదువు కోసమో బయటికి వెళ్ళినప్పుడు మీకేమనిపించింది ?

(ఎ) వంటరితనమూ భయమూ

(బి) చాలా ఉత్సాహంగా అనిపించింది.

(సి) కొద్దిగా 'హోమ్‌సిక్‌నెస్' ఫీలయానుగాని సంతోషంగానే అనిపించింది.



6. మీ తల్లి మీపట్ల ఎలా ప్రవర్తించిందని అనుకుంటున్నారు ?

(ఎ) చాలా ప్రేమించేదిగాని అతి గారాబం చేసేది.

(బి) నన్నంతగా పట్టించుకునేదికాదు అసలామెకు నన్ను పట్టించుకునే అంతటి తీరికే ఉండేదికాదు.


(సి) ఓ పద్ధతిలో ప్రేమగాపెంచింది.

7. మీ తండ్రి గురించి ?

(ఎ) బాగా గారాబం చేసేవాడు.

(బి) ఆయన వద్దకు వెళ్ళటానికే భయమేసేది.

(సి) కొంచెం కఠినంగా ఉన్నట్టు కనిపించినా ప్రేమగా చూసేవాడు.



8. మీ తల్లిదండ్రుల సంసారిక జీవనం :

(ఎ) సాఫీగానే గడిచింది.

(బి) మధ్యలో విడిపోయారు వాళ్ళు

(సి) అప్పుడప్పుడూ చిన్న చిన్న గొడవలు జరుగుతున్నా భరించగలిగేవి గానే ఉండేవి.

9. మీ కుటుంబపు ఆర్థిక పరిస్థితి :

(ఎ) జల్సాగానే గడిచేది.

(బి) పెద్ద ఒడుదుడుకులేమీ ఉండేవి కావు.

(సి) ఎప్పుడూ డబ్బుల ఇబ్బందులు ఉండేవి.

10. బాల్యంలో మీ ఆరోగ్యంగానీ మీ కుటుంబ సభ్యుల ఆరోగ్యంగానీ :

(ఎ) అద్భుతం

(బి) అడపా దడపా చిన్న చిన్న అనారోగ్యాలు సంభవించినా పెద్ద చెప్పుకోదగ్గ పెద్ద రోగాలేమీ లేవు.

(సి) ఏమంతబాగోలేదు-కుటుంబంలో ఎప్పుడూ ఎవరో ఒకరికి ఏదో ఒక జబ్బు ఉండేవి.

ఈ క్రింది రకంగా పాయింట్లు వేసుకోవచ్చు :

1.	(ఎ)-5	(బి)-1	(సి)-3
2.	(ఎ)-5	(బి)-3	(సి)-1
3.	(ఎ)-1	(బి)-3	(సి)-5
4.	(ఎ)-5	(బి)-1	(సి)-3
5.	(ఎ)-1	(బి)-5	(సి)-3
6.	(ఎ)-3	(బి)-1	(సి)-5
7.	(ఎ)-3	(బి)-1	(సి)-5
8.	(ఎ)-5	(బి)-1	(సి)-3
9.	(ఎ)-5	(బి)-3	(సి)-1
10.	(ఎ)-5	(బి)-3	(సి)-1

36 నుంచి 50 పాయింటు వస్తే : మీది అదృష్ట జీవితమేనని చెప్పాలి. మీ బాల్య జీవితం ఒడిదుడుకులేమీ లేకుండా సాఫీగా చక్కటి ప్రేమానురాగాల మధ్య గడిచింది. ఎన్ని గరిష్ట మార్కులు వస్తే అంతగా అదృష్టవంతులు మీరు. సమస్యల్ని అర్థం చేసుకోగల చక్కటి మనోస్థయిర్యం మీకుంది.

20 నుంచి 35 పాయింట్లమధ్య వస్తే : బాల్యంలో మీకు లభించిన చేదు అనుభవాలు భవిష్యత్తులో మీకు ఎదురవ్వబోయే నిరాశా నిస్పృహలను తట్టుకోవటానికి పనికి వస్తాయి. తరచుగా మీలోని ఆత్మవిశ్వాసం సడలుతున్నా, అంతలోనే మీరు దాన్ని మళ్ళీ పుంజుకుని జీవన సమరానికి సంసిద్ధమవుతుంటారు.

20 పాయింట్లలోపు వస్తే ! మీరు చాలా దురదృష్ట జాతకాలు సమస్యల్ని ఎదుర్కొనే మనోస్థైర్యం మీకు చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. ప్రారంభం నుంచీ నిరాశమీద నిరాశను ఎదుర్కొన్న మీరు ఏదన్నా విపత్తు సంభవించినప్పుడు దానిని ఎదుర్కొని లాభం లేదని కృంగిపోతుంటారు. అయితే దారుణమైన బాల్యానుభవాలు కూడా మనిషిని మరింత రాటుదేల్చే అవకాశం లేకపోలేదు.

సుబ్బారావుకు తలతిరిగింది...

— పి.ఎస్. రామచంద్రుడు

వెల్లకిలా పడుకొని సీలింగ్ కేసి చూస్తున్న సుబ్బారావుకి తల గిర్రున తిరిగింది. సీలింగ్ క్రిందికి వచ్చినట్టు, తను పడుకున్న మంచం పైకి వెళ్ళినట్టు అనిపించి భయంతో గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. గిరగిరా తిరుగుతున్నట్టు అనుభూతి.

"భవానీ...!" అని పెద్దగా అరిచాడు.

"ఏమయిందండీ?" గాబరాగా పరుగెత్తుకొచ్చింది సుబ్బారావు భార్య భవాని.

"పట్టుకో...నన్ను గట్టిగా పట్టుకో!"

"ఛీ పోండి ... పట్టపగలు... ఇంకా వంటన్నా పూర్తి కాలేదు ...!" సిగ్గు పడుతూ చెప్పింది భవాని.

"భవానీ..." కణతలు గట్టిగా నొక్కుకుంటూ బాధగా అన్నాడు. "తల తిరుగుతుంది. నాకేమయిందో తెలియటం లేదు. నా తలలో ఎవరో దూరారు చూడు" తల గట్టిగా పట్టుకొని జుట్టు పీక్కుంటూ పొర్లా తిరిగాడు.

భవానీకేమీ అర్థం కాలేదు. రిక్షా పిలిచి ఫ్యామిలీ డాక్టర్ గోవిందరావు దగ్గరికి తీసుకెళ్ళింది.

"డాక్టరుగారూ నా తలలో ఎవరో దూరారండీ!" ఆందోళనగా చెప్పాడు సుబ్బారావు.

"తలలో దూరటమేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు గోవిందరావు.

"యస్ ... పడుకుంటే గదంతా గిర్రున తిరుగుతుంది."

"హెలూసినేషన్ ...!" అన్నాడు డాక్టర్. "రాత్రి ఏదన్నా దెయ్యాలకథ చదివావా?"

"నో జోక్స్ డాక్టర్ ... ఐయామ్ సీరియస్!" అన్నాడు సుబ్బారావు.

'ఒన్ మినిట్...భవానీ ఇలారామ్మా!' లోపలికి పిలుచుకు వెళ్ళాడు డాక్టర్. "ఈ మధ్యలో ఏమయినా షాకింగ్ న్యూస్ విన్నాడా ... సుబ్బారావు చాలా సెన్సిటివ్, నాకు తెలుసు!"

"ఏమీలేదండీ!"

"బాగా గుర్తుతెచ్చుకోమ్మా ... వీకెనెస్సా అనుకుంటే సుబ్బారావు ఎప్పుడు చూసినా అప్పుడే భోంచేసినట్టు నిండుగా వుంటాడు. శారీరకంగా ఏలోపం లేదు. మానసికంగా ఏదయినా జరిగుండాలి."

"గుర్తొచ్చిందండీ! వారం క్రితం ఆయనకి శివాజీకి మధ్య డిస్కషన్ జరిగింది."

"శివాజీ ఎవరు?"


"మావారి కొలీగ్...!"

"ఐ.సీ...దేన్ని గురించి డిస్కషన్"

"కమలహాసన్ మంచి నటుడని మావారు, కాదు చిరంజీవి గొప్ప నటుడని శివాజీ సిల్లీగా వాదించుకున్నారు. అది తీవ్రమయి దాదాపు కొట్టుకోబోయారు కూడా. నేనే అడ్డుపడి విడదీశాను. ఆ తరవాత మా ఆయన్ని మందలించాను. శివాజీ నామీద చెయ్యెత్తేటంత మగాడా? అని రోజూ రెండు మూడుసార్లు కోపంగా నా దగ్గర అంటున్నారు యిప్పటికీ. అంతకి మించి ఏమీ జరగలేదు."

ఆలోచించాడు డాక్టర్ గోవిందరావు. అర్థమయిందన్నట్టు తలూపి బయటికొచ్చాడు.

"చూడు బాబూ సుబ్బారావు ... నీకు జబ్బేమీ లేదు. హాయిగా నిదరబోతే చాలు" అన్నాడు.



"డాక్టర్...నాకు తల తిరుగుతుంది అని చెబితే, జబ్బు లేదంటున్నారు ఏమి టండీ!" అడిగాడు సుబ్బారావు.

"అవునయ్యా! తల తిరగటం పెద్ద జబ్బేమీ కాదు. దానికి మందులిస్తాను" ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు. "భోజనం చేయ గానే 'జెల్యూసిల్' టాబ్లెట్లు రెండు చప్ప రించు. పడుకోబోయేముందు 'వాలియం 5' టాబ్లెట్ ఒకటి వేసుకో..."

"వెళ్ళొస్తాను సార్...ఈ మందులు వాడాక మళ్ళీ కలుస్తాను" సెలవు తీసు కొని బయటికొచ్చాడు సుబ్బారావు భవా నీతో కలిసి. వారం రోజులు మందులు వాడాడు. తల తిరగటం తగ్గలేదు.

గుంటూరు వచ్చి డాక్టర్ రామ్మూర్తిని కలిశారు. ఆయన సుబ్బారావుని పరీక్షించి మెడిసిన్స్ యిచ్చాడు. అవి తీసుకుని చీరాల వచ్చి వాడటం మొదలెట్టాడు. నెల గడిచింది. తల తిరగటం తగ్గలేదు. సడన్‌గా ఒక అనుమానం మొదలయింది సుబ్బారావుకి. అది క్రమేణా బలపడింది. నో డౌట్...శివాజీగాడిపనే యిది. వాడికి క్షుద్ర శక్తులమీద నమ్మకముంది. కాబట్టి నా తలకి చేతబడి చేయిందుంటాడు.

"భవానీ...!" పెద్దగా అరిచాడు. వచ్చింది.

"అర్జెంటుగా రిక్షా పిలువు..."

"ఎందుకండీ?" అనుమానంగా అడి గింది భవాని.

"పిలువ్..."

రిక్షా పిలిచింది భవాని. ఇద్దరూ ఎక్కారు. 'భూత, ప్రేత పిశాచాలని తోలబడును - భయంకర్, బోర్డు చూసి రిక్షా ఆపించి లోపలికి వచ్చాడు సుబ్బా రావు. భవానీకి అంతా అయోమయంగా ఉంది.

"భం భం బటక్... నీవు మానసి కంగా బాధపడుతున్నావు అవునా?" అడి గాడు భయంకర్.

బోర్లా ఆయన కాళ్ళమీద పడ్డాడు సుబ్బారావు. "సార్... నా భార్యని కాపాడండి సార్..." అన్నాడు.

"ఏమయిందమ్మా నీకు?" అడిగాడు భయంకర్.


భవానీకి ఏడుపు వచ్చింది.

"అయ్యా... మీరు మహామాంత్రికు లని విని వచ్చాను. నా తలకి శివాజీ అనే వాడు 'చేతబడి' చేయించాడని నా అను మానం. దానిని తిరగగొట్టి మా ఆవిడ్ని కాపాడండి. నా భార్యని విధవలేనిదాన్ని చేయకండి. నన్ను బ్రతికించండి!" దీనంగా వేడుకున్నాడు సుబ్బారావు.

"అర్థమయింది ఢింబకా..." పీట మీద కూర్చోబెట్టి ధూపం వేశాడు భయం కర్.

ఉక్కిరి బిక్కిరయ్యాడు సుబ్బారావు. తల మళ్ళీ తిరిగింది. "ఇదే... ఇదే నా జబ్బు!" అని అరిచాడు.

భవానికి భయమేసింది. మంగళ సూత్రం తీసి కళ్ళకద్దుకుంది. అరగంట సేపు అర్థంకాని మంత్రాలన్నీ భీకరంగా చదివాడు భయంకర్. మెడలో ఒకటి, రెండు చేతులకీ రెండు తాయెత్తులు కట్టి, సుబ్బారావు నెత్తిమీద రెండు నిమ్మకా యలు కోసి పిండాడు. "ఢింబకా, యింటి కెళ్ళి తలస్నానం చెయ్యి. రోజూ రెండు పూటలు "ఓం క్రీం భయంకర్" అనే మంత్రం పదిహేను నిముషాలు జపించు.



భం భం బటక్" అని సుబ్బారావు తల మీద చెయ్యి పెట్టి ఆశీర్వదించాడు.

రెండువందల పదహారు రూపాయలు ఫీజు చెల్లించి భక్తిగా ఆయనకి నమస్క రించి ఇంటికొచ్చారు.

ఇంకో నెల గడిచింది సుబ్బారా వుకి తల తిరుగుడు తగ్గలేదు. తాయెత్తులు చూసినప్పుడల్లా సిగ్గు పడుతున్నాడు. ఎడ్యుకేటెడ్ అయ్యుండీ తను కూడా మాంత్రికుడి దగ్గరకెళ్ళి తాయెత్తులు కట్టించుకున్నాడంటే అవమానంగా వుంది. అట్లాగని పీకేద్దామా అంటే భయ మేస్తుంది. తరవాతేమన్నా జరిగితే?

భవానీకి దిగులు ఎక్కువయిందే. ఎందుకు ఆయనకి అలా జరుగుతుంది. ఆయనకి త్వరగా నయమయితే విజయ వాడ 'కనక దుర్గమ్మ' గుడికి ఏడు శుక్ర వారాలు వస్తానని మొక్కుకుంది.

ఆదివారం ఆఫీసు స్టాఫ్ అంతా వచ్చారు సుబ్బారావు ఇంటికి. టైపిస్టు సరోజ సానుభూతిగా భవానీని పలుకరిం చింది.

"పాపం....మంచివాళ్ళకే ఇలాంటివి జరుగుతయి. దిగులు పడకండి. హైదరా బాద్‌లో స్పెషలిస్టు ఒకాయన ఉన్నారు. ఆయనకి చూపించండి" అని చెప్పి అడ్రస్ యిచ్చింది.

హైదరాబాద్ వచ్చి స్పెషలిస్టుని కలి శారు.

కుడి చెవిలో ఒక సన్నటి రబ్బరు గొట్టాన్ని దూర్చి అడిగాడు డాక్టరు "ఎలా వుంది?"

"కొంచెం నొప్పిగా వుంది సార్!" అన్నాడు సుబ్బారావు.

"భరించలేనంతగానా?"

"అబ్బే అంత యిదిగా కాదు!" చెప్పాడు సుబ్బారావు.

రబ్బరు గొట్టం బయటికితీసి ఎడమ చెవిలో దోపాడు డాక్టరు. మళ్ళీ తల తిరిగినట్లయింది సుబ్బారావుకి.

"ఇప్పుడెలా వుంది?" అడిగాడు డాక్టర్.

"తలలో సముద్రం పొంగుతున్నట్లు నేను పిచ్చివాడిని అయిపోతున్నట్లు వుంది డాక్టర్!" బాధగా చెప్పాడు సుబ్బారావు.

"ఊ..." తలపంకించాడు డాక్టర్ అబిడ్స్‌లో స్కానింగ్ సెంటర్ అడ్రసు యిచ్చి "స్కాన్" తీయించమన్నాడు.

స్కాన్ తీయించాడు సుబ్బారావు.

మొత్తం పరిశీలించాడు డాక్టర్. "ఒక పదిరోజులకి మెడిసిన్స్ రాస్తున్నాను. వాడిన తరువాత కనిపించండి!" ప్రిస్క్రిప్షన్ యిచ్చి చెప్పాడు.

చీరాల వచ్చి మందులు కొన్నాడు సుబ్బారావు రెండురకాల టాబ్లెట్లు. వాటిని చూడగానే యింతకు ముందు 'వాడానే' అనుకున్నాడు. ప్రిస్క్రిప్షన్‌ని మళ్ళీ చూశాడు జెల్యూసిల్, వాలియం-5. తన ఫ్యామిలీ డాక్టర్ గోవిందరావు మొట్టమొదట రాసిన టాబ్లెట్స్.

మోసం, దగా... అనుకున్నాడు సుబ్బారావు. చెవులో గొట్టాలుపెట్టి, తలకాయకి ఫొటోలు తీయించి వేలు వేలు ఖర్చు పెట్టించి పెద్ద డాక్టరు యిచ్చిన మాత్రలు, అయిదు రూపాయలు కన్సల్టింగ్ ఫీజు తీసుకొని గోవిందరావు ఇచ్చిన మాత్రలు ఒకటే. కాబట్టి గోవిందరావే మంచి డాక్టరు అనుకొని ఇంటికొచ్చాడు సుబ్బారావు. ఆ రాత్రి మళ్ళీ తల తిరిగింది సుబ్బారావుకి. పొద్దున్నే గోవిందరావు దగ్గరికి వచ్చాడు.

"తల తిరుగుడు తగ్గలేదుసార్...." చెప్పాడు.

"వ్వాట్...ఎప్పుడో మూడు నెలల క్రితం వచ్చావు. మెడిసిన్స్ యిచ్చాను. మళ్ళీ కనిపించక పోయేసరికి తగ్గిందేమో అనుకున్నాను" స్టెతస్కోపుతో పరీక్ష చేస్తూ అన్నాడు. "ఇదేంటి?" అడిగాడు మెడలో తాయెత్తు చూపిస్తూ.

సిగ్గుపడ్డాడు సుబ్బారావు.

"ఓహో.... మందులు మానేసి మాంత్రికుడి దగ్గిర కెళ్ళావన్నమాట?"

తలెత్తలేదు సుబ్బారావు.

"నిన్ను చూస్తుంటే జాలేస్తుందయ్యా!" భుజం తడుతూ చెప్పాడు. "ఒక డాక్టర్‌గా నేను నీకు సలహా యివ్వకూడదు. అయినా ఫ్రెండ్లీగా చెబుతున్నాను. ఎప్పుడన్నా తల తిరుగుతుంది అనిపిస్తే ఓ పెగ్ బ్రాందీతాగు."

ఆశ్చర్యంగా చూశాడు సుబ్బారావు. "బ్రాందీనా?"

"అవును మెంటల్ టెన్షన్ తగ్గిస్తుంది. అలాగని రోజూ త్రాగి అలవాటు చేసుకోకు. ఒన్స్ యిన్ ఏ బ్లూమూన్ ఒక పెగ్ అంతే!"


సుబ్బారావు ఒక క్వార్టర్ బ్రాందీ కొనుక్కొని యింటికి వచ్చాడు, బాటిల్ ఓపెన్‌చేసి గ్లాసులో కొంచెం పోసి నీళ్ళు కలిపి "భవానీ .... కాసిని వడియాలు వేయించి తీసుకురా!" అన్నాడు.

"వడియాలా! ఇప్పుడు వడియాలెందుకండీ?" అని వంటగదిలోంచి బయటికొచ్చి చూసిన భవానీకి తల గిర్రున తిరిగింది. "ఏమండీ జబ్బు నయం కాకపోతే అమెరికా వెళ్ళి చూపిద్దాము. మా పుట్టింటినుంచి డబ్బు తెప్పిస్తాను. అంతేకాని మీరు ఈ పని మటుకు చేయకండి!" భోరున ఏడ్చింది భవాని.

తల తిరిగింది సుబ్బారావుకి. గ్లాసు ఎత్తి గటగటా తాగేసి ఫక్కున నవ్వి "డాక్టర్ తాగమన్నాడు భవానీ" అన్నాడు.

"డాక్టరు బ్రాందీ తాగమన్నాడా?" ఆశ్చర్యంగా అడిగింది కళ్ళు తుడుచుకుంటూ భవాని.

"అవును ఎప్పుడన్నా ఒకసారి టానిక్‌లాగా తీసుకోమన్నాడు! అంతేగానీ నాకు



ఝదంటె ఎలర్జీ అని నీకు తెలియదా ?"

ఇంకోనెల గడిచింది. బ్రాందీ తాగ తున్నా తల తిరుగుడు తగ్గలేదు సుబ్బా రావుకి. పెగ్గునుంచి క్వార్టర్ తాగే స్థితికి చేరుకున్నాడు. తాగినప్పుడల్లా శివాజీ కనిపిస్తున్నాడు. కత్తి తీసుకుని పొడిచే ద్దామా శివాజీని అనిపిస్తుంది. తను జైలు కెళితే భవానీకి అన్యాయం చేసిన వాడి నవుతానేమో అనుకుంటాడు. అలా అను కోగానే సీలింగు కిందకి, మంచం పైకి వెసతుంది.

ఓరోజు చిన్ననాటి స్నేహితుడు రామా రావు చీరాల వచ్చి భవానీని, సుబ్బారావుని చూసి ఆశ్చర్య పోయాడు. రామారావు విజయవాడలో మెడికల్ రిప్రజెంటేటివ్.

"ఏమిట్రా దుక్కలా వుండేవాడివి. ఢూదలా అయిపోయావు !" అడిగాడు సుబ్బారావుని.

భోరుమని ఏడ్చాడు సుబ్బారావు. భవానీకూడా ఏడ్చింది.

రామారావుకి తల తిరిగింది. "ఏం జరిగింది చెప్పరా.... ఎందుకిలా అయిపో యావు !"

"తెలియదు. ఏం చెప్పాలి ? డాక్ట ర్లేమో జబ్బేమీ లేదంటారు. మాంత్రికు డేమో తాయెత్తులు కట్టాడు .... !" దిగు లుగా చెప్పాడు సుబ్బారావు.

అర్థం కాలేదు రామారావుకి. "అసలు సంగతి ఏంటి? డాక్టరు దగ్గరికి, మాంత్రి కుడి దగ్గరకి ఎందుకెళ్ళావు ?" అయో మయంగా అడిగాడు.

జరిగిందంతా చెప్పాడు సుబ్బారావు.

సుబ్బారావుని తీసుకొని మద్రాసు వచ్చాడు రామారావు. ప్రఖ్యాత న్యూరో సర్జన్ 'నటరాజన్' దగ్గరకి తీసుకెళ్ళి చూపించి విషయమంతా చెప్పాడు.

పాత రిపోర్టులన్నీ చూశాడు నటరా జన్. సుబ్బారావుని టెస్ట్ చేసి "నీకు జబ్బులేదు !" అన్నాడు.

సుబ్బారావు ఆనందంగా చూశాడు. "సార్ ఇఫ్ యూ డోంట్ మైండ్...ఒక చిన్న డౌట్ ?"

అడగమన్నాడు నటరాజన్. రామా రావుని ఇబ్బందిగా చూశాడు సుబ్బారావు. 'ఇట్స్ ఓకె' అని రామారావు బయటి కెళ్ళాడు.

చెప్పమన్నట్లు చూశాడు డాక్టర్ నట రాజన్.

"సార్..." సిగ్గుపడుతూ అడిగాడు సుబ్బారావు. "నేను సంసారం చేయ వచ్చా ?"

"వ్వాట్...." తల తిరిగింది నటరా జన్‌కి. "సంసారం చేయవచ్చా... ! వాట్ డూయూమీన్..."

"...తిరుగు తున్నప్పట్నుంచి ... ...ర...!" దీన్నగా చెప్పాడు సుబ్బా ...వు.

"...యనా సుబ్బారావు...అర్జెంటుగా !... ...ళ్ళి మీ ఆవిడకి న్యాయం ...ర్చు. నీకు జబ్బేమీ లేదు...!"

"...గా సుబ్బా ! నీ డౌట్స్ అన్నీ ...ర్ అయ్యాయా ?" బయటి కొచ్చిన ...్బారావు నడిగాడు రామారావు.

"...హా..." అన్నాడు సుబ్బారావు. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో చీరాల ...ట్టారు. ఆరోజు మొదటిరాత్రి గుర్తు ...చ్చింది సుబ్బారావుకి, భవానీకి.


...ద్దున్నే నిద్రలేచిన సుబ్బారావుకి ...ళ్ళీ తల గిర్రున తిరిగింది. రామారావు ...గానే చెప్పాడు. తిరగబోతున్న తన ...ని గట్టిగా పట్టుకున్నాడు రామారావు.


...రోజే వెంటనే వెళ్ళి శివాజీని కలిసి ...స్థాడి సుబ్బారావు దగ్గరికి తీసుకొ ...్చారు.

"సుబ్బారావు....కమలహాసన్ మంచి ...టుడు ఒప్పుకుంటాను. అనవసరంగా ...న్న పిల్లల్లా కొట్టుకోబోయాం ...!" ...న్నాడు శివాజీ.

"చిరంజీవికూడా మంచి నటుడే !" ...ప్పాడు సుబ్బారావు. వెంటనే తలలోంచి ...గ బరువు గాలిలోకి వెళ్ళిపోయినట్లు అనిపించింది. ఆ తరవాత సుబ్బారావుకి తల తిరగలేదు.

'అమ్మయ్య ! సుబ్బారావుకి నయమ యింది' విజయవాడ వచ్చాక పడుకొని ...లోచిస్తూ అనుకుంటున్న రామారావుకి సడన్‌గా సీలింగ్ కిందకి, మంచం పైకి వెసురుతున్నట్లు అనిపించింది. ◆





సమతా-మమతా

జరిగినకథ:-

వసంతానికి పెళ్ళి చూపులు జరుగుతాయి. పెళ్ళి కొడుకు నల్లగా ఉంటాడు. ఆమె స్నేహితురాళ్ళు ఆ పెళ్ళి అంటే ఇష్టపడరు. సుధకు వనపర్తిలో విలేజ్ వర్కర్‌గా పోస్టింగ్ వస్తుంది. ఆమెను ఒంటరిగా పంపడానికి ఇంట్లో ఒప్పుకోరు.

—ఇక చదవండి

శాలిని వెళ్ళి ఉద్యోగంలో చేరడానికి ఇంట్లో అంగీకారం కుదిరిందికాని, 'వెంట ఎవరు వెళ్ళాలి? అక్కడ శాలిని ఒక్కతే ఉండాలా?' అన్న విషయం మీద ఏకాభిప్రాయానికి రాలేక పోతున్నారు.

అంతా క్రొత్త క్రొత్త కాబట్టి అమ్మాయివెంట వెళ్ళి ఆమె ఛార్జి తీసుకొనేవరకు ఉండి, ఉండడానికి ఇల్లు అదీ చూసిపెట్టి వస్తానన్నాడు తండ్రి.

ఉద్యోగం, ఊరు కాస్త అలవాటు అయ్యేవరకు అమ్మాయితోఉండి తరువాత వచ్చేస్తానంది తల్లి.

సుధ వీళ్ళ సమస్య విని, "శాలిని ఆ పల్లెటూళ్ళో ఏం ఉంటుంది ఆంటీ? అసలు, ఆ పల్లెటూళ్ళో వసతులుండే ఇల్లు దొరకటం కష్టం. వనపర్తి ఆ ఊరికి ఇరవై కిలోమీటర్ల లోపే. ఆ రూటున వనపర్తికి నెంబరాఫ్ బసెస్ తిరుగుతుంటాయి. వనపర్తిలో ఇల్లు తీసుకోండి! రోజూ వనపర్తినుండి తిరుగుతుంది" అని సలహా ఇచ్చింది.

ఆ సలహా నచ్చింది శాలిని తలిదండ్రులకు.

శాలిని మరునాటి ప్రయాణానికి అన్నీ సర్దుకొంటూంటే సుధ కబుర్లు చెబుతూ కూర్చుంది.


"మగపిల్లాడే ఉద్యోగానికి వెడుతూంటే ఇంత కంగారు పడేవాళ్ళా? ఇన్ని జాగ్రత్తలు తీసుకొనేవాళ్ళా? ఆడదానికి ఎవరో ఒకరు రక్షణగా నిలువకపోతే సురక్షితంగా జీవించలేదని ఎందుకనుకుంటారో నాకు అర్థం కాదు. ఎప్పుడూ తల్లి రెక్కల సందున పిల్లను దాచేసుకొన్నట్టుగా చేస్తే, దానికి స్వయంగా ఎగిరేశక్తి ఎలా వస్తుంది? తనను రక్షించుకొనే ఉపాయాన్ని ఎలా తెలుసుకొంటుంది?" వాపోయింది శాలిని.

"శారీరకంగా పురుషుడికంటే స్త్రీ బలహీనురాలు కావచ్చు. మానసికంగా ఆతని బలానికి తీసిపోదు. శక్తి సామర్థ్యాలకు తీసిపోదు. మరెందుకు మగవాడికి అవసరంలేని ఆశ్రయం, ఆలంబన ఆడదానికే కావాలి?"

"నీ మాటల్లోనే జవాబుంది, సుధా! స్త్రీ శారీరక బలహీనతే ఒకరి ఆశ్రయంలో బ్రతికేట్టు చేసింది!"

"అవునా? మా ప్రక్కింట్లో రుక్మిణి ఆంటీని చూస్తే అలా అనిపించదు మరి! ఆవిడని చూస్తే ఎలిఫెంట్‌గా పుట్టబోయి పొరపాటున మనిషిగా పుట్టిందేమో అనిపిస్తుంది. అంత పర్సనాలిటీ ఆవిడది! లక్షమంది ఆడవాళ్ళను ఆవిడ లీడరు కాగలదు. అలాంటి ఆంటీగారి భర్త - ఆవిడ ప్రక్కన చూస్తే పిట్టంతగా కనిపిస్తాడు. బలమే మనిషికి రాణించే శక్తినిస్తుందనుకొంటే ఆమెకు కోపం వస్తే అతడిని ఫుట్

పోల్కంపల్లి శాంతాదేవి



ఛాలేలా తన్నేయాలికదా? కాని, అలా ఎప్పుడూ జరుగదు. ఆ పిట్టంత మనిషిముందు ఏనుగంత అంటీ గజ గజా వణికిపోతుందంటే నమ్ము. అతడికి కోపం వస్తే ఎగిరి ఎగిరి తంతాడు. ఆవిడ కిక్కురు మనదు. ఆవిద తిరగ బడితే అతడు నామరూపాలు మిగలడు. కాని, ఆమె తిరగ బడదు. ఏ కనబడని సంకెళ్ళు ఆమెను కట్టివుంచా యంటావు?"

"కట్టి వుంచడం కాదు. సుధా! ఆ ఏనుగంత మనిషి ఆ పిట్టంత మనిషి సంపాదనమీద ఆధారపడి ఉంటుంది. తిరగబడితే తిండిలేక చావాల్సి వస్తుందని తెలిసి ఉంటుంది!"

"అది కొంత కరక్టే! అందుకే ప్రతి ఆడదీ ఆర్థికంగా నిలద్రొక్కుకొనేది కావాలి! అప్పుడే స్త్రీ జాతికి దాస్య విముక్తి. కాని, చాలామంది స్త్రీలు అలా ఆలోచించరు. ఆః ఎందుకొచ్చిన కష్టాలు? తెచ్చిపెట్టేవాడు ఉండగా! ఇల్లు కదలకుండా అ తెచ్చింది ఉడకేసి పెడితే పోలే? అనుకొంటారు. కాని, తమ ఆత్మగౌరవాన్ని ఎలా తాకట్టు పెడుతున్నది వీళ్ళు గుర్తించడంలేదు. పావలాకి, అర్ధకి భర్తముందు చేయి చాచడంకంటే చావడం మేలంటాను!"


*   *   *   *

శాలిని ఉద్యోగంలో చేరిన నెలరోజుల తరువాత సుధనుండి ఉత్తరం వచ్చింది.

"మైడియర్ శాలినీ!

ముందుగా నీకో గుడ్‌న్యూస్. నాకు విలేజి డెవలప్‌మెంట్ ఆఫీసరుగా సెలెక్షన్ వచ్చింది. సంవత్సరం ట్రెయినింగ్. మన అభిరుచులకు తగిన మాచ్ దొరకడం ఎంత కష్టమో, మన అభిరుచికి తగిన ఉద్యోగం దొరకడం అంత కష్టంగా ఉన్న ఈ రోజుల్లో, నా అభిరుచులకు, ఆదర్శాలకు, సరిపోయిన ఉద్యోగం దొరకడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను.

గ్రామసీమలు అనగానే అందరికీ కళ్ళముందు చటుక్కున కనిపించేది పచ్చని పైరులు, పంట కాలువలు, స్వచ్ఛమైన గాలి, కల్లాకపటం తెలియనట్టుగా ఉండే



పల్లీయులు.

నాకు కనిపించేవిమాత్రం అవికావు.

మురికి కూపాలూ, చీమిడి ముక్కులతో మసిపాతరలాంటి బట్టలు చీలికలతో ప్రేలాడే పిల్లలు, ఒంటినీ, ఇంటినీ శుభ్రంగా ఉంచుకోవడం తెలియని ఆడవాళ్ళు, ఇళ్ళముట్టూ పెంటపోగులూ, మురికి కాలువలూ, శ్రమకు తగిన ఫలితం దొరక్క ఎండుకు పోయిన డొక్కలు.

నాగరిక ప్రపంచంతో సంబంధాలులేక తరతరాలుగా అవిద్యలో, అంధకారంలో క్రుంగిపోతున్నారు. పరిసరాలను అపరిశుభ్రంగా మార్చుకొని అనారోగ్యంతో అకాల మృత్యువు వాత పడుతున్నారు. 'అలా ఉండకూడదు! అదికాదు బ్రతుకు! ఇలా ఉండాలి! ఇదీ బ్రతుకు!' అని చెప్పేవాళ్ళులేక అదే మురికి కూపంలో వాళ్ళ జీవితాలు చాలిస్తున్నారు.

గ్రామ చైతన్యానికి పాటు పడేందుకు నాకు ఈ ఉద్యోగం ఎంతగానో తోడ్పడు తుంది. ముఖ్యంగా గ్రామీణ స్త్రీలను సంస్కరించడంలో నా డ్యూటిని ఒక పవిత్ర మైన సేవాకార్యంగా భావించి, నా సర్వ శక్తుల్నీ ధారపోసి నాకు దొరికిన ఉద్యోగా నికి న్యాయం చేయాలనుకొంటున్నాను..."

ఆ ధోరణిలోనే రెండు పేజీలు సాగిన సుధ పుత్తరం చదివి శాలిని నవ్వుకొంది.

చెప్పేవాళ్ళు లేకే చెడిపోయారా గ్రామసీమల్లోని ప్రజలు? గ్రామాల్లో ఒక రిద్దరు మోతుబరి రైతులు, షావుకార్లను విడిచి పెడితే చాలావరకు అట్టడుగు బ్రతుకులే. వాళ్ళ ఆర్థిక దుస్థితీ, పై వర్గంలో ఉన్నవాళ్ళు వీళ్ళను పైకి రాకుండా చూసే పద్ధతీ వాళ్ళను తరతరాలుగా అవిద్యలో, అంధకారంలో ఉండేట్టు చేశాయి. వాళ్ళను బాగుపరచాలని ఎవరైనా సుధలాంటివాళ్ళు ఆదర్శాల ఊపుతో వెడితే ముందు మా ఆర్థిక దుస్థితి తొలగించి తరువాత మాట్లాడ మంటారు. తనే పొట్టకూటికోసం ఉద్యోగానికి వెడుతూ ఆర్థికంగా వాళ్ళకి తనేం సాయం చేయగలదు?

అట్టడుగు బ్రతుకులకోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలవల్ల జరిగే మేలు వాళ్ళకు ఏమూలకూ చాలడంలేదు. ప్రభుత్వ ఆసరాతో పేదవాళ్ళకు ఏదైనా చేయాలని వెడితే నిధుల కొరతవల్ల సుధలాంటి వాళ్ళకు చివరికి నిరాశే మిగులుతుంది.

సంవత్సరం తరువాత, వనపర్తికే పోస్టింగ్ అయ్యి, ఆర్డర్స్ చేతబుచ్చుకొని వచ్చిన సుధతో ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చింది శాలిని. ఏదో "ఏదో చేయాలని చేయాలని మరీ అంతంత కలలు కనకు! ఏదీ చేయలేక పోయినప్పుడు మానసికంగా గాయపడతావు."

"మనసుంటే మార్గముండదా? డబ్బుకొరతవల్లే నేననుకొన్నది సాధించలేనంటే వాళ్ళకోసం జోలెకట్టి తిరుపమెత్తుతాను; వాళ్ళచీకటి బ్రతుకుల్లో ఏకొంచెం వెలుతురు తీసుకు రాగలిగినా నాజన్మ ధన్యమైనట్టుగా భావిస్తాను!"

సుధ స్థిరంగా, గంభీరంగా అంటూంటే శాలిని చలించిపోయినట్టుగా అయింది. "సుధా, నీలాంటి స్నేహితురాలు ఉండటం నా అదృష్టంగా గర్వపడుతున్నానే!" అంది ఉద్విగ్నంగా సుధ చేతులు తన చేతుల్లోకి తీసుకొని.

* * * *

ఉద్యోగంలో చేరిన మొదటిరోజు కరుణ అనే సీనియర్ వర్కర్ చెప్పింది.

"గ్రామ సేవికలు, ముఖ్య సేవికలు అంటే పిలువని పేరంటంలా వెళ్ళి ఇంటింటి తలుపూ తట్టడం అన్నమాట. వీధి వీధికి, ఇంటింటికీ వెళ్ళి మాట్లాడవలసి వస్తుంది. ముఖ్యంగా మనది గ్రామాల్లో పని! చాలా జాగ్రత్తగా ఉండాలి!"

"జాగ్రత్త అంటే ఎలాంటి జాగ్రత్త?" అడిగింది సుధ.


"ఇళ్ళలో ఆడవాళ్ళేకాదు! మగవాళ్ళుకూడా వుంటారు కదా? వాళ్ళకన్ను మనమీద పడకుండా చూసుకోవాలి. పాతికేళ్ళ సర్వీసునాది! గ్రామ సేవికగా ప్రారంభమైంది ఉద్యోగినిగా నా జీవితం; చేదుజ్ఞాపకాలు, తీపి జ్ఞాపకాలు ఎన్నెన్నో! నేను వెళ్ళగానే 'పొయిలేసే అమ్మ' వచ్చింది అనేవాళ్ళు. అప్పుడు పొగలేని పొయిలు వేయించడం మా మొదటి పని అన్నమాట. పొగవల్ల కళ్ళు, ఇళ్ళు ఎలా పాడవుతాయో చెప్పి, పొగలేని పొయిలు వేయించేదాన్ని! అందుకని ఆ పేరు నాకు. ఇహ సర్పంచులతో మాట్లాడవలసి వస్తుంది అఫిషియల్‌గా. ఆడవాళ్ళకి ఎంత అనుమానమో; 'మా మొగోళ్ళని వల్లో ఏసుకుందుకు వచ్చినావా? చాలుచాల్లే ఇంక మా ఊళ్ళో కాలుపెడితే కాళ్ళు విరగ్గొడతాం! అనేవాళ్ళు. నవ్వూ, కోపం రెండూ వచ్చేవి! అప్పటిలా అజ్ఞానం లేదులే గ్రామస్త్రీలలో; గ్రామ సేవికలవల్లా, హెల్త్ విజిటర్లవల్లా కొద్దికొద్దిగా మారారు వాళ్ళు. మనం చెప్పేది శ్రద్ధగా వినగలుగుతున్నారు!..."

చిరునవ్వుతో విన్నది సుధ ఆమె అనుభవాలను.

రెండు రోజుల తరువాత సుధ టూర్ బయల్దేరింది.

"ఎలా ఉన్నాను?" అంది బయల్దేరడానికి ముందు.

శాలిని ఒక నిమిషం పరిశీలనగా చూసింది. తెల్లచీరమీద నల్లటి చుక్కలున్న



ఆర్గండీ చీర అదే బ్లౌజ్ కుడిచేతికి వాచీ, చెవులు, మెడ, చేతులు అన్నీ బోసిగా ఉన్నాయి. ఏ ఆభరణం లేక పోయిన ఆత్మ విశ్వాసం అన్నది ఆమె ముఖంలో, కళ్ళలో ప్రతి ఫలిస్తూ అదే ఒక దివ్యాభరణమై సుధను సౌందర్య వంతం, దీప్తి వంతం చేస్తూంది!

"స్వచ్ఛత మూర్తీ భవించిన ఒక దేవకన్యలా ఉన్నావు!" అంది శాలిని చిరు నవ్వుతో.

"అప్పుడే నన్ను దేవతల్లో, దేవుళ్ళలో కలిపేయకు; మనిషిగా నాకు కొంత కాలం జీవించాలని ఉంది!"

భుజానికి ఒక ఖద్దరు సంచీ తగిలించుకొని బయల్దేరింది సుధ.

* * * *

బస్సు సౌకర్యం లేని కుగ్రామం అది. బస్సుదిగి రెండు మైళ్ళు కాలి కడకన నడవాలి. ఆస్టేజీ దగ్గర సుధ ఒక్కతే దిగింది.

గొర్రెల మంద తోలుతూ, గొల్లతడు వచ్చాడు. "కుర్, కిర్" మంటూ విచిత్రమైన శబ్దాలు చేస్తూ.

తను వెళ్ళాల్సిన ఊరికి దారి అడిగింది సుధ.

అతడు చెయ్యెత్తి చేలమధ్య కనబడుతున్న సన్నని కాలి బాట చూపెట్టాడు.

సుధ కాలి బాట మీద చకచకా నడవ సాగింది.

ఇంకా నడుం ఎత్తు పెరగని జొన్నచేలు గాలికి నృత్యం చేస్తున్నట్టుగా ఊగుతున్నాయి. ఆకులు కరుగ్గా సుధ చేతుల్ని మొరటుగా పలకరిస్తున్నాయి. అక్కడికి దగ్గరలో ఉన్న మామిడి తోపుపండి పిచ్చుకల కువకువలు హృద్యంగా వినిపిస్తున్నాయి!

కాని, సుధ వాటిని పెద్దగా పట్టించు కోవడం లేదు. పిలువని చుట్టంలా వస్తున్న తనని ఈ పల్లె ప్రజలు ఎలా రిసీవ్ చేసుకొంటారు?

తన ఉదోగ పర్వంలో పొందబోతున్న తొలి అనుభవాల్ని తలుచుకుని సుధ హృదయం ఉద్విగ్నతతో నిండి పోయింది.

కాలి బాట సరిగ్గా తెలుగు వాడలోకి వెళ్ళింది.

అన్నీ గుడిసెలు! గుడిసెల ముందు ఆరబోసిన చేపలు. ముక్కు అదర గొట్టేస్తున్న చేపల వాసన సుధకు స్వాగతం పలికింది. సుధ శాఖాహారి కావడం వల్ల ఈ వాసనకు పారి పోకుండా ఉండేందుకు చాలా కష్టపడాల్సి వచ్చింది.

చాలా గుడిసెలు తలుపులు మూసిఉన్నాయి! తెరచి ఉన్న రెండు మూడు గుడిసెల ముందు కర్ర బొగ్గుతో పళ్ళు తోముతూ ఒకావిడా, బేక్ బేర్ మంటూ దోంద్ర కప్పలు అధిక సంఖ్యలో ఒక్కసారిగా అరుస్తున్నట్టుగా నాలికతోమి కఫం తీసేస్తూ ఒకావిడా కనిపించారు.

"ఇప్పుడు ముఖం కడుగుతున్నా వేమిటవ్వా?" బొగ్గుతో నోరు నల్లగా చేసుకొన్నావిడ దగ్గర ఆగి అడిగింది సుధ.

"దినం కడిగే ఏళ ఇదే! ఎవరు, దొరసానీ? సిస్టరమ్మవా?"

"కాదు, విల్లేజ్ డెవలప్‌మెంట్ ఆఫీసరు, అంటారు నన్ను. ఇంట్లో ఎవరున్నారు?"

"ఎవరు లేరమ్మా!"

"ఎక్కడి కెళ్ళారు?"

"కోడలు సింత సెట్ల కాడకెల్లింది. కొడుకు సేపలకు ఎల్లిండు. పిలగాడు పెద్ద రెడ్డిగారి పసులెంట ఎల్లిండు."

"ఎప్పుడొస్తారు?"

"సనీయ పొద్దుకు!"

"అంటే?" తికమక పడింది సుధ.


"నాకు మీ గడియరాలు తెల్వవు! సనీయ పొద్దంటే సూరిడు అడకొస్తడు!" చెయ్యెత్తి పైన ఆకాశంలోకి చూపింది.

పన్నెండూ, ఒకటీ మధ్య టైం కావచ్చునని ఊహించింది సుధ.

ఒక్క క్షణం ఆ ఇంటి చుట్టు పరిశీలనగా చూసింది సుధ; కొద్దిగా ఉన్న ఆ వాకిటి లోనే కంది కట్టెతో చిన్నదడిలా కట్టి బాత్‌రూంగా వాడుకొంటున్నట్టున్నారు. ఆ వాడే నీళ్ళు అందరూ నడిచే దారిలోకి వెళ్ళి ఒక చిన్న మురుగు కాలువగా మారింది. ఇంచుమించు అందరిళ్ళ ముందు ఇదే కాలువలు! నదుల్లో కలిసే ఉపనదుల్లా ఉన్నాయి. ఒకచోట పెద్ద గుంటగా తయారయ్యి పందులు రెండు దొర్లుతూ మహానందం అనుభవిస్తున్నాయి.

ఆ మురికి కాలువల మీద ఈగలూ, దోమలూ అసంఖ్యాకంగా అభివృద్ధి చెంది, తరువాత ఇంట్లోకి ప్రవేశించి సరిగ్గా మూతలుంచని ఆహారపదార్థాలమీద, శరీరాల మీద వాలి, మనిషి శరీరంలో పుట్టెడు రోగాలు వ్యాపింప జేస్తాయి!

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్న చిన్న ఆరోగ్య సూత్రాన్ని వీళ్ళు గుర్తించడం లేదంటే, వీళ్ళు ఎంత అజ్ఞానంలో ఉన్నారనుకోవాలి?



పత్రికల్లోనే కాదు. పట్నవాసాల్లోనూ ఈ మురికి వాడలున్నాయి! అవి అభివృద్ధి చెందుతూనే ఉన్నాయి! కోట్లుకోట్లు గుమ్మరించి రోదసిలోకి రాకెట్లు పంపుతూ గర్వంతో రొమ్ములు గుద్దుకొనే ప్రభుత్వం ఈ మురికి వాడల నిర్మూలనను చేపట్టడం లేదు? తన దరిద్రానికీ, భీదతనానికీ ఈ మురికి వాడలు దర్పణాలు కావా?

ముఖం కడగడం పూర్తిచేసి గుడిసెలోకి వెళ్ళిన ముసలామెతోపాటు తనూ లోపలికి వెళ్ళింది సుధ. గుడిసెలో ఓ ప్రక్క వంటకి ఓ తడిక అడ్డుంది. అక్కడే కట్టెలతో వంట చేసుకోడానికి ఓ పొయి ఉంది. బాగా మసిబారిన సత్తుగిన్నెలు, చిన్న చిన్న చట్టీలు ఉన్నాయి. ఓ పక్క బుట్టలో జొన్న రొట్టెలు పడేసి ఉన్నాయి. ఓ సత్తుగిన్నెలో వాళ్ళు రొట్టెల్లో, అంబలిలో తినే కారం (పచ్చడి లాంటిది) ఉంది. మంచినీళ్ళ కుండతోసహా దేనిమీదా సరిగా మూతలు లేవు.

"వాటిమీద మూతలు పెట్టాలవ్వా! ఈగలు వాలుతాయి! బల్లులు పడతాయి. ఈగలు, దోమలు వాలిన పదార్థం తింటే ఎన్ని జబ్బులైనా వస్తాయి!" చెప్పింది సుధ.

"ఏదో ఇంత డొక్క కేసుకోవడమే తెల్సమ్మా మాకు! అసొంటియన్నీ మీలాంటోళ్ళకి. పొద్దున్నలేసి ఇంత గంజి కాసుకుతాగి అడవిని బడితేతప్ప మాకు గంజినీళ్ళకైనా పైసలు దొరకవు!"

"చేసుకో! తాగు! అడవిబడు. కానీ, తినేపదార్థాలమీద, తాగే నీళ్ళమీద మూతలు పెట్టుకోవడానికేమి? దానికి పెద్దగా సమయం, డబ్బు ఖర్చు పెట్టాల్సి ఉండదుకదా?"

"అయన్నీ మాకు తెలవ్వు తల్లీ!"

"నాబోటివాళ్ళు చెబుతున్నప్పుడైనా తెలుసుకోవాలికదా? మీకు తెలియని విషయాలు చెప్పడం కోసమే గవర్నమెంట్ మాకు జీతాలిచ్చి మీ దగ్గరికి పంపిస్తూంది మమ్మల్ని!"

"ఏ గవర్నమెంటొచ్చి మాకేంచేసిందిలే! రెక్కాడితేకాని, డొక్కాడని మా

బతుకులిట్లనే గడిచిపోతున్నాయి!"

"మీ బ్రతుకులిట్లానే గడిచిపోతున్నాయి! మీ పిల్లల బ్రతుకులుకూడా ఇలాగే గడిచి పోవాలని కోరుకొంటున్నారా మీరు?"

"మా పోరల బతుకులుమాత్రం ఇట్లనే గడినిపోక ఇంకెట్ల గడిచిపోతయి, తల్లీ?"

"వాళ్ళకోసం బళ్ళున్నాయి! పగలు కూలీపనికి వెళ్ళినా రాత్రి వచ్చి చదువు కోడానికి 'అనియత' విద్యాకేంద్రాలున్నాయి!"

"కాస్త అక్షరం ముక్కొస్తే వస్తుద్ది! డాకటేర్ అవుతాడా? వకీలు అవుతాడా?"

"అవన్నీ కాకపోయినా అక్షరం ముక్క వస్తే చాలదా! అవి వస్తే పత్రికలు పుస్తకాలు చదివి చాలా తెలుసుకోవచ్చు!"


"కూలిపని, గంజినీళ్ళ తప్పనికాడికి ఇంక ఏంసదువు తల్లీ!"


ఆ ముసలామెకు ఎలా నచ్చజెప్పాలో తెలియలేదు సుధకు. మరో గుడిసెకు వెళ్ళింది.

"...మీ ఇంటి మురికి కాలువ, మీ వాకిట్లో నిలవకుండా అవతలికి వెళ్ళిపోతే చాలుననుకొంటే ప్రక్కింటివాళ్ళు అలానే అనుకొని వదిలేసిన మురికి కాలువ మీ వాకిట్లో సుడితిరిగితే మీరు ఆశ్చర్య పోనక్కర లేదుకదా? ప్రక్కింటివాళ్ళ మురికి కాలువ మీ వాకిట్లోకి వస్తే మీకెంత అసహ్యంగా ఉంటుందో, మీ మురికి కాలువ ప్రక్కింటివాళ్ళ వాకిట్లోకి వస్తే వాళ్ళకి అంతే అసహ్యంగా ఉంటుందని గ్రహించండి. మురికి కాలువలను అంత విచ్చల విడిగా వదలొద్దు. ప్రాణాలను హరించే క్రిములను అవి సృష్టిస్తాయి. గవర్నమెంట్ సైతం కాలువలు కట్టివ్వాలంటే గవర్నమెంట్ డబ్బంతా ఈ మురికి కాలువల్లో పోసినా అవి శుభ్రంకావు. అందుకే మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోడానికి ప్రయత్నించాలి. ఆ మురికి కాలువలు అలా సాగిపోకుండా మూడుపీట్ల గొయ్యితీసి, బొగ్గులు, ఇసక నింపండి. బొగ్గులు నీళ్ళని పీల్చి, నీళ్ళు ముందుకు వెళ్ళనీయవు! పెంటకుప్పల్ని మరీ అలా ఇళ్ళ ప్రక్కనే వేసుకోకండి! ఇళ్ళకి దూరంగా వేయండి!..."

మురికి వాడల్లో సుధ ప్రచారం ఇలా సాగుతూంటుంది!

కూలినా జనం ఇళ్ళల్లో పిల్లలు పౌష్టికాహారలోపంతో అర్భకంగా తయారవుతుంటారు. అసలు, పిల్లలు గురించి పెద్దవాళ్ళు పట్టించుకోరు. కాళ్ళు చేతులు పీచు పుల్లల్లా, బాన కడుపుతో, దవడలకి కరుచుకు పోయిన చెంపలతో, కళ్ళు మాత్రం బయటికి తెళ్ళుకొచ్చి - చొక్కాకూడా లేకపోతే వరుసగా ఎంచుకోనేట్టుండే ఆ పక్క టెముకల్ని అస్సలు చూడలేం. పిల్లలకి చీమిడి కారుతూంటే తుడిచే ఓపిక కూడా తల్లికుండదు! కారికారి ముక్కుక్రిందా చెడి పుండులా అయ్యి ఈగలకి చక్కని ఆహారంగా మారినా వాళ్ళు పట్టించుకోరు! గబగబా ఇంత ఉడికేసుకు తిని అడవికి పరిగెత్తడమే తెలుసు. వచ్చాక అలసటతో తినో, తినకో - పక్కల మీద ఒరిగి





పగటి ఉష్ణోగ్రతలో పెద్ద మార్పేమీ ఉండబోదు

పోతారు !

"మీకు పాలు కొనడానికి డబ్బులు లేకపోవచ్చు! పళ్ళు కొనడానికి డబ్బులు లేకపోవచ్చు. ఉన్నదే బలవర్ధకంగా తినడానికి ఎందుకు ప్రయత్నించకూడదూ ?" ఒకరోజు అడిగింది సుధ.

"మాకు ఉండేదేంది ? తినేదేంది ? నాలుగు వరి మెతుకులు ! పుడిసెడు గంజి నీళ్ళు ! పప్పొండు కొన్నరోజు మాకు పండగ !"

"నాలుగైనా వరి మెతుకులు తింటారు కదా ? మల్లెపువ్వుల్లా తెల్లగా ఉంటే తప్ప నోటికి పోదుకదా ? అసలు, వడ్లు మిల్లుకు వేయడంలోనే బియ్యంలో విటమిన్స్ హరించుకు పోతాయి. అసలు వరిలో ఉండే విటమిన్స్ అన్నీ తవుడులోనే ఉంటాయని చాలా మందికి తెలియదు ! డబుల్ పాలిష్ వేయించిన ఆ బియ్యాన్ని రెండు సార్లు పిసికి కడుగుతారు. అన్నం పువ్వులా ఉండాలని గంజి వారుస్తారు. ఇంకేముంటుంది ఆ అన్నంలో ? వట్టి పిసరు. అన్నన్ని డబ్బులు పోసి కొని తెచ్చుకొచే మీరు తినేదేమిటి ? సారం లేని పిప్పి !"

"గంజి వార్చకపోతే అన్నం సంకటి ముద్దయిపోతుందమ్మా ! మెతుక్కు మెతుక్కు అంటకుండ ఉంటేనే మా మామ తింటడు !"

"గంజి వారిస్తే అందులో సారమంతా పోతుందని నచ్చజెప్పాలి మీ మామకు!" చాలా చిన్న చిన్న విషయాలను సైతం ఎంతో శ్రద్ధతో చెబుతూ ఉంటుంది సుధ. "మీ పిల్లలకు బ్రెడ్డు, గుడ్లూ, పాలు - ఇవన్నీ ఇవ్వలేక పోవచ్చు మీరు ! ఇటువైపు పొలాల్లో రాగులు బోలెడన్ని పండుతాయికదా ? మీకు కూలిక్రింద రాగుల్ని వేస్తుంటారుకదా ? అవి రొట్టెలుచేసి పెట్టండి. అంబలి కాచి త్రాగించండి. గోధుమపిండి జల్లించి, పొట్టు పారబోస్తుంటారు ! అలా పొట్టు పారబోయకండి. పొట్టులో చాలా విటమిన్స్ ఉంటాయి ! ఆ పొట్టులో కొద్దిగా పిండి, చక్కెరా కలిపి అప్పలుచేసి ఇవ్వండి. పిల్లలకి చిరు తిండి పెట్టినట్టూ ఉంటుంది. బలవర్ధకమైన ఆహారం ఇచ్చినట్టూ అవుతుంది !"

"అయన్నీ మాకేం ఎరిక ? మీ సదూకున్నోళ్ళకి ఎరిక !"

"మాకు ఎరికున్నవి మీకు చెబితే వినరెందుకు ?"

"అయన్నీ చేసుకుంట కూకుంటే పనికిపోను మాకు పొద్దేడ ఉంటది ?"

"అపనికి పోయేది జానెడు కడుపు నింపుకుందుకే కదా ? ఆ నింపుకునేది మీ ఆరోగ్యాన్ని పరిరక్షించేదిగా ఉండాలని మీరెందుకు అనుకోరు ! మీ ఇళ్ళముందో, ఇళ్ళ వెనుకో కాళీ జాగా ఉంటుంది, దాన్ని ఊరికే పోనివ్వకుండా, కంచె ఏర్పాటు చేసి, నాలుగు కూరపాదులు పెట్టారంటే, మీరు ఆ కారంమెతుకులకు బదులు రోజొక కూరగాయతో భోజనం చేయొచ్చు. కావలసిన కూరగాయల విత్తనాలు మా సమితీ నుండి సప్లై చేస్తాం !"

కొందరు అసలు వినరు ! కొందరు వింటారుగాని ఆచరణలో పెట్టరు !

సుధ శక్తివంచన లేకుండా వాళ్ళలో మార్పుకోసం ప్రయత్నిస్తూనే ఉంది !

* * * *

శాలిని బుర్ర వేడెక్కిపోతూంది !

పావుగంటనుండి ఒక లెఖ్ఖ కరెక్ట్ ఆన్సర్ రాక ఆమెను ముప్పతిప్పలు పెడుతూంది. ఎన్నిరకాలుగా చేసినా ఆన్సర్ రావడంలేదు ! విక్రమ్ అనే స్టూడెంట్ నోట్స్ సగం అదే లెఖ్ఖతో నిండిపోయింది !


"అసలు లెఖ్ఖే తప్పిచ్చినట్టున్నారు ! లేదా ఆన్సరు తప్పుండాలి !" ఇహ బుర్ర పని చేయడం ఆగిపోయాక తేల్చింది శాలిని.

"శర్మ మేష్టారి దగ్గరికెళ్ళి చేయించుకురానా, టీచర్ ?" విక్రమ్ అడిగాడు.

"లెఖ్ఖ తప్పంటే ఆయనమాత్రం కరెక్ట్ ఆన్సర్ ఎలా తెస్తారు ?"

"ఒకసారి చూపించి తెస్తాను టీచర్ ! ఆయన చిటికెలో ఎలాంటి లెఖ్ఖఅయినా చేస్తారు ;"

"తన తోటి టీచరుతో తను లెఖ్ఖ చెప్పించుకోవటమా ?" శాలిని ఆత్మ గౌరవం



వాతావరణంలో మార్పు కనిపిస్తుంది

అందుకు ఒప్పుకోకపోగా "ఉండరా! నేనే చేస్తాను ఇంకోవిధంగా!" అంది.

లెఖ్ఖ చేస్తున్నకొద్దీ గజిబిజిగా తయారై ఆన్సర్ దగ్గరికి అసలు వెళ్ళడం మానేసింది!

శాలిని ముఖం చిరాకుతో నిండిపోయింది.

ఇహ విక్రమ్ టీచరుగారి అనుమతి కోసం చూడలేదు! లెఖ్ఖల పుస్తకం పుచ్చుకొని రివ్వున పరిగెత్తాడు.

"భగవాన్! ఆయనకా లెఖ్ఖ రాకపోతే నా పరువు నిలబడుతుంది!" అనుకొంది శాలిని.

శర్మ పూర్తిపేరు రాధాకృష్ణశర్మ. అతడు మూడు సంవత్సరాలనుండి ఇదే బడిలో పనిచేస్తూ సంవత్సరం క్రితం బి.ఇడి. ట్రైనింగ్‌కి వెళ్ళి పదిహేను రోజుల క్రితం వచ్చాడు. లెఖ్ఖ నోట్స్‌లో వేసి పంపడంకాక శర్మే విక్రమ్‌వెంట వచ్చాడు. శాలిని లేచి నిలబడింది.

"లెఖ్ఖ మీకు అర్థమయ్యేందుకు మీ ముందే చేద్దామని వచ్చాను"

"లెఖ్ఖ అస్సలు తప్పిచ్చారేమోనని నా అనుమానం."

"చూద్దాం!"

"ఛెయిర్‌లో కూర్చోండి!"

"ఫర్వాలేదు! రెండు నిమిషాల్లో చేసి పోతాను. క్లాస్ సగంలో వదిలేసి వచ్చాను."

అతడు నిలబడి వుండగా తను కూర్చోవడం బాగుండదని శాలినికూడా నిలబడింది అతడికెదురుగా. చకచకా లెఖ్ఖచేస్తూన్న అతడి చేతివేళ్ళని చూస్తూ, తెల్లగా పొడుగ్గా, దృఢంగా ఉన్న ఆ వేళ్ళ కదలికల్లోనే అతడెంత చురుకైనవాడో తెలిసిపోతూంది. లెఖ్ఖ చూసే నెపంతో ముందుకి వంగిన శాలిని కళ్ళు అతడి చేతి వేళ్ళను చూడడంతో ఆగిపోలేదు. నొక్కునొక్కులుగా ఉన్న అతడి నల్లని క్రాఫ్‌నూ, అతడి మేధాసంపదను చాటుతున్నట్టుగా ఉన్న విశాలమైన ఫాలభాగాన్నీ, కొనతేలిన ముక్కునీ సన్నగా ఉన్న మీసకట్టునూ - అన్నిటినీ పరిశీలనగా చూస్తూంది. అతడు తలకు పెట్టుకొన్న హెయిరాయిల్ ఏదో చాలా మంచి వాసనని ముక్కుకి అందిస్తూంది.

లెఖ్ఖ ఎప్పుడయిపోయిందో శాలినికి స్పృహే లేదు.

"అర్థమయిందా?"

అన్న ప్రశ్నతో తత్తరపాటుతో తలెత్తింది.

"ఆఁ ఆఁ... అయ్యింది" అంది తడబాటుతో. "అయితే లెఖ్ఖలో తప్పేం లేదన్నమాట."

"ఆడలేక మద్దెల ఓటి అన్నారట వెనుకటికి మీలాంటి వాళ్ళెవరో!" శర్మ నవ్వాడు.

(సశేషం)

సమీక్ష

అమెరికా టు ఆంధ్రా.



భమిడిపాటి జగన్నాథరావు

ఒక రచయిత కథలు పత్రికల్లో పడటం, వాటిని సంకలన రూపం ధరించినప్పుడు ప్రముఖులచేత అభిప్రాయం రాయించడం అమలులో ఉన్న ఆనవాయితీ! ఇటీవల 'జ్యోతి' ప్రత్యేకంగా వెలిగించిన ఏడు జ్యోతులు - సీయస్సీ మురళి కథలమీద ఒక విశ్లేషణాత్మక విమర్శను 'జ్యోతి' లోనే ప్రచురిస్తే, సరికొత్త ప్రయోగం అవుతుందికదా అనిపించింది. ఫలితం - దాదాపు చాలాకాలంగా కలం పట్టని సుప్రసిద్ధ రచయిత శ్రీ భమిడిపాటి జగన్నాధరావుగారిని స్పందింపజేసి ఈ కథలు కలం పట్టించి అక్షరాలను ఒలికింప జేసాయి.

నాకు ఈ సీయస్సీ మురళితో పరిచయంగానీ, ముఖపరిచయంగానీ లేదు. ఈ రోజున ఆంధ్రదేశంలో వస్తున్న పత్రికల సముదాయం నుంచి మంచి కథల్ని ఏరుకోవడం అన్నది మహా సముద్రంలోంచి ముత్యాలు ఏరడానికి చేసే ప్రయత్నం లాంటిది. అలాటి మహాసముద్రంలోంచి ఏరికూర్చిన 'కోవ' రూపంలో శ్రీ 'శాయి', సీయస్సీ మురళి "వర్షంలో మనిషి" అందించేరు. కథల కంటే ముందు అందులో వున్న మురళి 'మనోవిశ్లేషణ' చదివేను. శ్రీ మురళి ఆలోచింపచేసే వ్యక్తిగా కనిపించేరు. ఆలోచించ వలసిన వ్యక్తిగాకూడా కనిపించేరు.

ప్రతి రచయిత గురించీ కాదుగానీ, చాలామందికిమాత్రం వ్రాయడం మొదలు పెట్టేక చాలాకాలందాకాకూడా 'ఎందుకు వ్రాస్తున్నాము -?', 'ఎందుకు ఇలా వ్రాయడం -?' అన్న ప్రశ్నలను గూర్చిన ఆలోచనగానీ, నిక్కచ్చి అయిన అభిప్రాయంగాని ఉండవు. అలాంటిది శ్రీ

మురళి - తన ఆలోచనలు, తన మథనాల లోంచి స్ఫురించిన ప్రయోగాత్మకమయిన నిర్మాణ కార్యక్రమాలకోసం - ఈ కథ లను ఒక సాధనంగా వాడుతున్నానని చెప్పేరు. ఈరోజు మిగతా అన్ని వర్గాల మాట అటుంచి — రచయితలగా వ్యవహరింప బడుతూన్న వ్యాపార వేత్తల పట్ల ఇది ఒక అహింసాత్మక విప్లవానికి ఆరంభం.

నాకు చలంగారు ఎప్పుడూ గుర్తొస్తుంటారు, ఇలాంటి సందర్భాలలోనే -

"నా శైలి పొడుగానూ-నా అమీనా"

మురళి ఈ కారణంగా నాకు చలం గారిని తలపింప చేసేరు.

"ఇలాటి ఆలోచనలున్నవాళ్ళు నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం ఎలా? ఉద్యోగం చెయ్యడం ఎలా?" ఈ మాటలు వ్రాసిన మురళిలోంచి వచ్చిన కొన్ని కథలు - "జ్యోతి" మాసపత్రికలో పడినవి-శాయి గారు నాకు చాలా నీట్‌గా పాక్ చేసి అందించి - "మా ఫ్రెండు మురళి-ఆ కథల మీద ఏదైన వ్రాయండి" అని చాలా మొహమాట పడుతూ నన్ను అడిగేసి నన్నూ మొహమాటంలో పడేశారు.

నిజం చెప్పేస్తాను-నేను అంత చప్పున 'అలాగే' అనలేదు. కాని దూరదేశంలో వున్న మిత్రుడిమీద శాయిగారి అభిమానం ఆర్ద్రత నన్ను కదిలించాయి. అయినా నేను 'సరే' అనలేదు. "చూద్దాంలెండి" అనేశాను. మొహమాటంగా రెండుమాటలు మాట్లాడి-చాలా ఎక్కువ మాట్లాడేసినట్లు మానేసి - తనదైన చిన్న చిరునవ్వుతో దీక్షగా సిగరెట్లు కాల్చుకునే శాయిగారి లోని గొప్ప కార్యదీక్ష, పట్టుదల - అదీ తనకోసం కాకుండా ... మిత్రుడికోసం- నన్ను మొత్తానికి బరిలోకి దించేయి.

ఆ విధంగా శాయిగారు చిందించే 'అమృతత్వం' నన్ను చాలా కాలానికి ఈ విధంగా అక్షరాల్లోకి దింపింది.

అదర్గండి కథ!

ఇహ 'నా గొడవ' ఆపేసి మురళి కథ ల్లోకి వస్తాను. మీరూరండి.

కేవలం పరిశీలనా జ్ఞానంతో, గొప్ప శిల్ప చాతుర్యం ఉపయోగించి గొప్పగా కష్టాలు వ్రాసేసి చేతులు దులుపుకునే రచయిత వ్రాసిన కథలు కావు-'జ్యోతి' లో పడిన ఈ కథలు. మనుషులలోకి వెళ్ళి వాళ్ళపట్ల 'సహానుభూతితో' ఉండి, వాళ్ళబాధలు తనే పడి, ఆ రుజాగ్రస్థుల కిచ్చే ఔషధాలలోని భాగంగా మలచినవి ఈ కథలు.

అందుకే శిల్పం గురించి, శైలిగురించి, టెక్నిక్ గురించి ప్రత్యేకించి వెదకడం, లేదా విడదీసి చూసి భుజం తట్టి మెచ్చుకోవడం వంటి పనులు ఈ కథల గురించి చెయ్యకూడదు. 'అది తప్పు!'

అపరాధికి శారీరకమయిన శిక్ష విధించడంకన్న మానసికమయిన శిక్ష విధించి తేనే అతను ఎన్నటికీ అపరాధ 'భావా' నికి కూడా లోను కాడని, ఉపనిషత్తులు చెబుతాయి. అటువంటి మార్గంలో విప్లవం కోసం వ్రాయబడిన కథలు ఇవి.

అందుకే వీటిని విడదీసి శల్యపరీక్ష చెయ్యాలన్న ఆలోచనకు పోవద్దని స్పర్థాపరులైన వారికి మనవి.

"శిశుమేథం", "దేశం సీరియస్ - స్టార్ట్ ఇమీడియట్లీ" - అన్న కథలు సాహసంతో వ్రాసిన కథలు. "సమకాలీన వాతావరణ కాలుష్యాన్ని" ఇంత స్పష్టంగా వ్రాయడానికి రచయిత ఏమాత్రమూ జంకలేదు.

"ఆశావాది" కథ గొప్ప వ్యంగ్యాత్మకమయిన కథ.

వ్యంగ్యం స్పర్శామాత్రంగానే ఉన్నా ఆ "వ్యంగ్య స్పర్శ" చాలా కఠినంగానూ, చాలా తీవ్రంగానూ ఉంది. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతూన్న అనేక దౌర్జన్యాలు, హింసలు, దుర్మార్గాలు తెలుసుకుంటూకూడా మనిషి మనిషిగా బతుకుతూ ఉండడం అతని పాషాణత్వాన్ని, కాఠిన్యాన్ని, అది క్షణక్షణాభివృద్ధి చెందుతూ ఉండడాన్ని మాత్రమే చెప్తుంది.

"ఓ గుండు వెళ్ళి మూడేళ్ళ సాల్వడార్‌కి తగిల్తే, రక్తం ముద్దలాంటి వాడి మొండెం వచ్చి, ఫోంచేస్తూ నే చూస్తున్న టి.వి. మీద పడింది. ఓ చుక్క నెత్తురు చెదిరివచ్చి నా కంచంలో చిమ్మింది. ఫిలడల్ఫియాలో తయారైన పేపర్‌నేప్‌కిన్‌తో తుడిచి పడేశాను.

నాకన్నీ తెలుసు.

అయినా నేను నిరాశ పడను..."

ఇలా 'ఆ కథలో' ఆ శిలా కాఠిన్యం ఆకథ అంతే ఆశావాదిననే భ్రాంతితో కనిపిస్తూ ఉంటుంది.

"సర్వేజనా సుఖినోభవంతు" అన్న కథ కల్పనతో కూడిన సెటైర్-ఇందులో ఉన్న హాస్యం సూదులతో గుచ్చుతున్నట్టు ఉంటుంది.

దేవుడు అడిగే ప్రశ్నలన్నింటికీ నాయకులు సమాధానం చెప్తున్నప్పుడు :

'వాళ్ళు కడుపులు పట్టుకు చూస్తున్నారే, ఏదో ఒకటి పెట్టకపోయారా?'

అని అడిగితే

"అడిగితే పెడ్తాం స్వామీ!"

అని

"వాళ్ళ నోటికి తాళాలు వేశారు. తియ్యక పోయారా?"

అన్నప్పుడు

"అడిగినప్పుడు తీస్తాం స్వామీ!"

—ఎంత ఘోరాన్ని చూపుతుందో.

"సరే, అలాగే కానియ్యండి"

అని 'దేముడు' వెళ్ళిపోవడమూ అంత అన్యాయాన్నీ చెప్తోంది.

ఇలా కథని 'ఎండ్' చెయ్యడం మురళి టెక్నిక్ కోసం చేసినట్టనిపించదు. దేవుడి అమాయకత్వమో, నిస్సహాయతో 'కథని' నడిపించలేనట్టు, వాళ్ళ బతుకులు అలాగే 'తెల్లారిపోతున్నట్టు' అనిపిస్తుంది.

'రేఖ' కథలో దారిద్ర్యరేఖ ఎంత కఠినమయినదయినా ఎంత స్వచ్ఛమయినదో చెపుతూ, ఆ స్వచ్ఛతను గుర్తించినవారు స్త్రీలు అని చెప్పడం బావుంది.

"విడాకులు" కథ చాలా మంచికథ.


మంచి కోసమే వ్రాసిన కథ. సమాజానికి పట్టిన 'బ్లూఫిలిం' అనే భూతాన్ని గుర్తించిన కథ. ఇది చాలా సున్నితమయిన ఆలోచనాశక్తిగల స్త్రీ వ్రాయవలసిన కథ. చాలా అవసరమైన, చాలా విస్పష్టమైన కథ.

ఇలా ఒక్కొక్క కథమీద ఏదో ఒకటి చెప్పడంకాక, వాటి అన్నిటిమొత్తం నిజాయితీ గురించి మాత్రమే ఎక్కువ చెప్పవలసి వుంది. నిజాయితీ అన్నది లాగి విడిచిన బాణమంత సూటిగా, వాడిగా హృదయానికి తగిలే లక్షణం. దానిని గురించి ఇంకా రాతలెందుకు?

ఫ్యూడలిజం - మన మోడలిజం!




ఎంత బాగుండేవనీ
ఆ వెనకటి రోజులు
కొంతకాలం ఓపండి
అంతా వెనక్కి వెళ్ళిపోదాం




అనగనగా ఆ రోజుల్లో
ఎంచక్కా ఓ రాజుండేవాడు
రాజుకు రాణీలుండేవారు
మంత్రులు తంత్రం చేసేవారు



గుర్రాల్ చక చక పరుగెత్తేవి
రథాలు టక టక పోతుండేవి
నెత్తిన మెరిసే కిరీటాలకూ
కత్తికి రత్నాల్ పొదిగేవారు




పొరుగువాడపై పోరుకువెళ్తే
ఆరగించమని ఆడపిల్లనూ
అనుభవించమని అర్ధరాజ్యమూ
యిచ్చి యింటికి పంపేవారు



వేటకువెళ్తే పులులు పిల్లులై
చంపుకు తినమని ప్రార్థించేవి
అటలలోన ఆలిని ఒడ్డే
చక్కటి పద్ధతి ఒకటుండేది



మాటల అర్థాల్ మార్చ్చమంటే
గోపు ముఖాలూ తొడిగామంటే
ఎన్నికలన్నీ దున్నీ వచ్చు
ప్రజాస్వామ్యమే మజా అనచ్చు




ప్రచారమూ ప్రథమాశ్యంకాగా
అబద్ధమే అణ్వస్త్రం కాగా
అజ్ఞానం మన కవచం కాగా
ప్రజాస్వామ్యమా మనకడ్డం ?



మతం మత్తుగా తాగించేద్దాం
భాషావేశం పట్టించేద్దాం
జాతికి ముప్పని ఘొల్లుమనేద్దాం
ప్రజాస్వామ్యమా మనకడ్డం ?




టెర్రరిస్ట్‌లనూ తయారుచేద్దాం
చిల్లర అల్లరి చేయించేద్దాం
స్వతంత్రాలను కుతంత్రమందాం
ఒక్కొక్కటిగా అణచి పడేద్దాం



ప్రణాళికలనూ ప్రకటిద్దాం
అమలుకువస్తే అడ్డంకొడ్దాం
అధికారులదే తప్పందాం
వందలకొద్దీ బలియిద్దాం

* చతురంగ బలమ్ము మనదై రాగ
యుక్తి కుయుక్తులు తోడు కూడగ
ప్రజాస్వామ్యమే నిలువు నీడగ
ఫ్యూడలిజం మన మోడలిజం !

* పోలీసులు, ఆస్తిహక్కు, మతం, రేడియో అండ్ టి.వి



పి. యస్సీ. మురళి




ప్రజలు పల్లకీ మోసేవారు
పంటలు తెచ్చి ఒంపేవారు
యుద్ధక్రీడలో చద్దామన్నా
తహతహలాడిన తిరిగేవారు



రాజవేశ్యలు, రాజ వైద్యులు
రాచక్రీడలు రాచవాడలు
రాచకార్యము రాజసూయము
రాజుల రోజుల ప్రభలే ప్రభలు




అనగనగా ఆ రాజుల వెనక
ఫ్యూడల్ ప్రభువులు పుట్టారు
ఊళ్ళకు ఊళ్ళు ఏలేవాళ్ళు
ఛెళ్ళున కొరడా విసిరేవాళ్ళు



ఎంచక్కా ఆ రోజుల్లోన
ప్రజలు కాళ్ళకు మొక్కేవాళ్ళు
బానిస బ్రతుకులు కోరేవాళ్ళు
ప్రభువును మూపున మోసేవాళ్ళు



ఆకలి దప్పిక ఎరుగరువాళ్ళు
వంటిన బట్ట వద్దనువాళ్ళు
యింటిలిపాది ఆడవాళ్ళను
ప్రభువు కోరితే పంపేవాళ్ళు




అయ్య మాటలే ఆరోవేదం
అయ్య చూపులే అశనిపాతం
అయ్య తాకిడే విద్యుద్ఘాతం
ఫ్యూడల్ ప్రభువుల ప్రభలే ప్రభలు



గత వైభవమూ తిరిగిమనం
రథాలపైన లాక్కుని వద్దాం
చైతన్యంతో చిందులు వేద్దాం
ఫ్యూడల్ వరస మోడల్ దేద్దాం

పద వ్యూహం 5



చిరునామా :

ఆధారాలు

అడ్డం :


1. పట్టు గట్టిదే కాని ఉడుము కాదు. 3. పడి ఏదమైనా లెక్కచెయ్యని వీరుడు. 6. చుక్కేసుకున్నాక్కాని పడపకు దారి తెన్నూ లేదు. 8. రూపాంతర దేవాలయం. 9. నాదు ఆస్తి ఎంత ఉంటేనేం? అకు తీస్తే ఏమీలేదు. 10. ఇంద్రుడు 12. ఆంధ్రలో గుబులు, మరి తెలంగాణలో? 13. వృత్తికి ఆట వెలదేకాని ఈ నియమం తప్పదు. 17. మగణ్ణి కట్టుకోడానికి ఆడవాళ్ళకు ఉపయోగించేది 18. తురాయి బరువు? 19. నాలుగు లఘువులు లేదా రెండు గురువులు, 21. ఫాలభాగము. 23. మనకు ముదము కలిగించే పువ్వు. 24. అరవ వాడు 'కథను' చదివితే యుద్ధమే.

నిలువు :

1. ఈ క్షేమమైన పర్వతములో సీతారాముల్ని ఉంచేరు. 2. దీనిమోత కన కానికెక్కడిది? 4. బాధ. 5. పౌన్నారి స్నేహితురాలు 7. నాదంచే నాదని ఒకటే చప్పుడు. 10. యజ్ఞంలో నెయ్యి. 11. వ్యవసాయం. 12. చిప్పల పిడుగు. 14. వియ్యం పొందడంలో మగపెళ్ళివారిని పట్టుకొనేది. 15. పంచమ స్వరంలో పాడేది. 16. ఆరవై సంవత్సరాలకోసారి వచ్చే ఫింత సూర్యుడు. 17. —దారెడేసి కళ్ళు. 20. చేసే దమ్మున్నంత వరకు అది లేనట్లే. 22. వెలిగారము.

పదవ్యూహం 4 విజేతలు :

1) అలపర్తి హైమవతి, నందివెలుగు, 2) వి. వి. సుబ్బారావు, గుంటూరు, 3) శ్రీమతి ఎ. ఆర్. లక్ష్మి, హైదరాబాదు, 4) శ్రీమతి కె. లలిత, సికింద్రాబాద్, 5) పుల్లాపంతుల వెంకట సుబ్బారావు, పొగూరు, 6) నడిమింటి వెంకట సుబ్బారాయుడు, పటాన్‌చెరు 7) ఇ. భాస్కర నాయుడు, హైదరాబాద్.



నిబంధనలు:
1. ప్రతినెలా పూరించిన పదవ్యూహం మా కార్యాలయానికి 20వ తేదీలోగా చేరాలి.
2. పంచికలో గడినే వాడాలి. వేరే కాగితముపై గళ్ళుగీసి పంపరాదు.
3. గళ్ళమడిపై చిరునామా తప్పక వ్రాయాలి.
4. మడిచ్చి పంపే కవరుపై 'పదవ్యూహం పంక్తి' అని తప్పక వ్రాయాలి.
5. బహుమతి మొత్తం రూ. 100/- విజేతలు ఒకరికంటే ఎక్కువైతే బహుమతి మొత్తాన్ని పంచి పంపుతాము.

[illegible]

సీరియల్

ఈసారి తనకు కాంగ్రెస్‌పార్టీ టికెట్ దొరకటం లేదని తెలియటంతో తెలుగుదేశం నాయకులను కలుసుకున్నాడు రామవర్మ.

తనకు తెలుగు దేశం పార్టీ టికెట్ ఇచ్చి పార్టీ అధికారంలో కొస్తే మంత్రిపదవి కూడా ఇవ్వాలని కోరాడతను. అలా చేస్తే తన న్యూస్ పేపర్ పూర్తిగా తెలుగు దేశం ప్రచారానికే ఉపయోగ పడుతుందని హామీ ఇచ్చాడు.

అయితే అందుకు దేశం నాయకులు అంగీకరించ లేదు. అతనికి పార్టీ టికెట్, మంత్రి పదవి మినహా ఏమయినా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియ జేశారు.

ఆ ఆఫర్ అంగీకరించక తప్ప లేదతనికి. ఎందుకంటే తనను మరే పార్టీ ఆశ్రయించటం లేదు.

రాబందుల రెక్కలచప్పుడు

జరిగిన కథ:

సిద్ధార్థ నీతిని నమ్ముకున్న రాజకీయ నాయకుని కొడుకు. తండ్రిలా కాక అవినీతి ద్వారానయినా సరే ముఖ్యమంత్రి అవాలన్న ఆశయంతో జీవితం ప్రారంభించాడు.

రాజకీయ వర్గాల్లో విపరీతమయిన పలుకుబడిగల భారతీదేవి తన కంటె చిన్న వయసులో ఉన్న సిద్ధార్థ వేపు ఆకర్షితురాలయి సర్వం సమర్పించుకుంది. అతని ధ్యేయానికి తోడ్పడాలని నిశ్చయించుకుంది.

జమిందారు వంశంలో పుట్టిన గజపతిరాజా, తండ్రిని ఎన్నికల రంగంనుంచి విరమింప జేసి తను కాంగ్రెస్ పార్టీలో చేరి పోయాడు.

అతను మోసం చేద్దామనుకున్న పూర్ణ అతని మెడకు గుదిబండయింది. ముఖ్యమంత్రి అవాలన్న అతని కోరికకు పరిపూర్ణ సహకారం అందిస్తూన్న పూర్ణకు మరో వ్యక్తితో సంబంధం ఉందని తెలిసి ఆమెను పుట్టింటికి గెంటి వేశాడు.

1977 ఎన్నికలు అతనికి నిరుత్సాహాన్ని కలిగించినయ్.

మరోవేపు 'ఆంధ్రదేశం' దినపత్రిక రామవర్మ తన పత్రికను నిజాయితీగా నడిపితే నిలబడడం కష్టమని బ్లాక్ మెయిలింగ్ మొదలు పెట్టాడు. అదిచాలా లాభదాయకంగా పరిణమించి చివరకు పార్లమెంట్ మెంబర్‌గా అయ్యాడు. తన స్నేహితుడితో కలిసి అనుభవిస్తున్న అమ్మాయినే భార్యగా చేసుకోవాల్సి వచ్చిందతనికి.

జయలక్ష్మి తెలంగాణా పోరాటంలో తండ్రినీ, తల్లినీ పోగొట్టుకుని కమ్యూనిస్ట్ పార్టీతరపున రాజకీయాల్లోకి దిగింది. డాక్టర్ విష్ణు ఆమెను పెళ్ళి చేసుకున్నాడుగానీ ఓ ఫింత కోరిక కోరాడు.

గజపతిరాజాకు నాబలే డాన్సర్ "ప్రమోద"తో పరిచయమయ్యింది. ఆమెను కోరగా తిరస్కరించి బెదిరించింది. సిద్ధార్థ మంత్రి అయ్యాడు. ఎన్నికలలో గజపతిరాజా తనకు పోటీ అభ్యర్థిని హత్య చేయించి ఎన్నిక వాయిదా వేయిస్తాడు.

ఎన్నికలలో తెలుగు దేశం ఘనవిజయం సాధించింది. సిద్ధార్థ తన కొడుకును రాజకీయాలలో చేర్చాలని నిర్ణయించుకొంటాడు. భారతీదేవి చెప్పినట్లు ఎన్టీఆర్ గద్దెదిగి, నాదెండ్ల ముఖ్యమంత్రి అయ్యాడు. మధ్యంతర ఎన్నికలు జరిగాయి ఈ సారి సిద్ధార్థ గెలిచాడు.

ఇక చదవండి

ఆ రోజునుంచే తెలుగు దేశం పార్టీకి పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించింది ఆంధ్ర దేశం. ఎన్టీ ఆర్ మన్న సినిమా గ్లామర్‌ని పూర్తిగా ఎక్స్‌ప్లాయిట్ చేశాడు రామవర్మ. ఎన్టీ ఆర్ సభలకు హాజరవుతున్న జన సమూహాల ఫోటోలు, దారి పొడుగూతా ఎన్టీఆర్ చైతన్యరథం మీద ఉపన్యసిస్తూన్న ఫోటోలు చైతన్యరథంలో ఎన్టీ ఆర్ రోజువారీ కార్యక్రమాలు, ఇలాంటి ఫోటోలన్నీ ప్రస్తుతా సినిమా ప్రియులయిన

తెలుగు ప్రజల్ని విపరీతంగా ఆకర్షించినయ్.

ఫలితాలు ఊహించినట్లే వచ్చాయ్.

తెలుగుదేశం విజయంతోపాటు 'ఆంధ్రదేశం' పత్రికకూడా సర్క్యులేషన్‌లో అద్భుతమయిన విజయం సాధించింది.

దానికితోడు తెలుగుదేశంతో రామవర్మకేర్పడ్డ పలుకుబడి. నెమ్మదిగా తన అవినీతి కార్యక్రమాలు మళ్ళీ ప్రారంభించాడతను.

ఆ విషయాలన్నీ తెలుగుదేశం నాయకులకు తెలిసేసరికే ఆలస్యమయిపోయింది. అప్పటికే కొన్ని కోట్ల రూపాయల ఆస్తి సమకూర్చుకున్నాడు రామవర్మ.

అయితే మనిషికి డబ్బు పూర్తి ఆనందాన్ని ఇవ్వలేదన్న విషయం ఆ తరువాత కొద్ది రోజుల్లోనే తెలిసిందతనికి.

ఆ రోజు క్లబ్‌కెళ్ళకుండానే ఇంటికి చేరుకునేసరికి మాలిని రహస్యం బయట పడింది. తన గదిలో కూర్చుని సిగరెట్ తాగుతోందామె.

ముందు అది మామూలు సిగరెట్ అనుకున్నాడు. కానీ ఆమె పడుకున్న తీరూ, మాటలతీరూ గమనించాక అర్థమయింది. ఆమె మత్తుమందులకు బానిసయిపోయిందని.

ఆ రాత్రంతా అతనికి నిద్రపట్టలేదు. మర్నాడు మాలినితో మాట్లాడాలని నిర్ణయించుకున్నాడతను.

ఆ డ్రగ్స్ ప్రభావం ఆమె గర్భంలో పెరుగుతోన్న శిశువుమీదకూడా ఉంటుందని అతనికి తెలుసు.

ఉదయం డైనింగ్ టేబుల్ దగ్గర ఆ విషయం కదిపాడతను.

"ఎంత కాలంనుంచీ నీకీ డ్రగ్స్ అలవాటు?"

"కాలేజీడేస్‌నుంచీ!" తొణకకుండా జవాబిచ్చిందామె.

"మరి నాకెప్పుడూ ఎందుకు చెప్పలేదు?"

"మీరు అడగలేదు-"

"డ్రగ్స్‌వల్ల ఎన్ని నష్టాలున్నాయో తెలుసా?"

"తెలుసు!"

"మరెందుకు దాన్ని వదిలేయవు?"


"బ్రతకటంవల్ల మనిషికెన్నో సమస్యలెదురవుతాయ్-మరి అందర్లూ ఎందుకు ఆత్మహత్య చేసుకోరు? అలాగే ఇదీనూ!"

"నీ వాదనలో అర్థంలేదు-"

"లైఫ్‌కే అర్థంలేదు-"

"అసలెక్కడ నేర్చుకున్నావిది?"

"మా నాన్న పోలీసాఫీసరుకదా! చాలా డ్రగ్స్ దొరుకుతూండేవి రైడ్స్‌లో-వాటిని మా నాన్నే వాడటం చూశాను-నాకూ టేస్ట్ చేయాలనిపించింది. ఒకసారి టేస్ట్ చేశాక ఇంక వదల్లేక పోయాను. మా క్లాస్‌మేట్స్ ఇంకొంతమంది గాళ్సు,



బాయ్సు కూడా నాకు కంపెనీ ఇచ్చేవారు-"

"రేపట్నుంచీ నువ్ డ్రగ్స్ ముట్టుకోటానికి వీల్లేదు-" శాంతంగా జవాబు చెప్పాడతను.

ఆమె నవ్వింది. "ఇటీజ్ ఇంపాజిబుల్-"

రామవర్మకేం చేయాలో అర్థం కాలేదు.

"ఆల్‌రైట్! మానవద్దు! కానీ కనీసం కొద్దిరోజులయినా ఆపేసెయ్. ఎందుకంటే నీ గర్భంలో పెరుగుతున్న పాపకుకూడా ఆ డ్రగ్స్‌వల్ల చెడు జరిగే అవకాశం ఉంది-"

ఆమె కొద్ది క్షణాలు ఆలోచించింది.

"అయ్‌విల్ ట్రై!" అంది నింపాదిగా.

ఆ తరువాత కొద్దిరోజులపాటు ఆమెని కనిపెట్టే ఉన్నాడు రామవర్మ. ఎంత కనిపెట్టే ఉన్నా ఆమె డ్రగ్స్ తీసుకుంటూనే ఉంది. అయితే ఆమెకు డ్రగ్స్ ఎక్కడినుంచి అందుతున్నాయో, ఎవరు సరఫరా చేస్తున్నారో తెలీలేదతనికి. పాప పుట్టిన కొద్దిరోజుల వరకూ అతనికి తేడా తెలీలేదు. పెరుగుతున్నకొద్దీ పాప ప్రవర్తనలో కనబడుతోన్న తేడా అతనికి భయం కలిగించింది. డాక్టర్లు అతని భయాన్ని ఖరారు చేశారు.

అంత చిన్న వయసునుంచే ఆ పాపకు ట్రీట్‌మెంట్ ప్రారంభించాల్సి వచ్చింది. పాప పుట్టాక మాలిని పరిస్థితి మరింత ఘోరమయిపోయింది.

ఇరవైనాలుగ్గంటలూ డ్రగ్స్‌మీదే ఆధార పడుతోంది. ఇంట్లో ఏం జరుగుతోంది, అది పగలు సమయమా, రాత్రి సమయమా, తను భోజనం చేసిందా లేదా-ఇవేమీ తెలీటం లేదామెకి. రామవర్మకు ఏం చేయాలో పాలు పోవటంలేదు.

ఆరోజు రాత్రి క్లబ్‌లో ఉండగా ఫోన్ వచ్చిందతనికి-పోలీస్ స్టేషన్‌నుంచి-మాలిని ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల హాస్టల్లో అపస్మారక స్థితిలో పడి ఉందని!

వెంటనే కార్లో అక్కడికి చేరుకున్నాడు రామవర్మ.

పోలీస్ ఇన్‌స్పెక్టర్ అక్కడే ఉన్నాడు.

"ఎప్పట్నుంచో ఆమె ఈ హాస్టల్లోకొచ్చి డ్రగ్స్ తీసుకుంటోంది. నిన్న డ్రగ్స్ దొరక్క పోవటంతో అందరికీ మెంటల్ షాక్ తగిలినట్లయింది. స్టూడెంట్స్ కొంత మంది ఈమెని రేప్ చేశారు. రేప్ అనడంకూడా దాష్టం కాదనుకుంటాను. ఎందు కంటే ఏం జరుగుతోందో ఆమెకు తెలుసు! కానీ ప్రొటెస్ట్ చేసే స్థితిలో లేదు. మా స్టేషన్‌కి ఇంకెవరో స్టూడెంట్స్ ఫోన్ చేశారీవిషయం. అందర్నీ అరెస్ట్ చేశాము. మీ మిసెస్‌ని మెడికల్ ఎగ్జామినేషన్‌కి పంపాల్సి వుంది! కానీ ముందు మీకు తెలియ జేస్తే మంచిదని ...."

మాలినిని ఇంటికి తీసుకు రావటానికి పదివేల రూపాయలు ఖర్చయిందతనికి.

ఈ పరిస్థితుల్లో మండల్ ఎలక్షన్స్, మున్సిపల్ ఎలక్షన్స్ వచ్చాయి రాష్ట్రంలో. అసలే అస్తవ్యస్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంతమంది రామవర్మను ఆశ్రయించారు. 'ఆంధ్రదేశం' న్యూస్‌పేపర్ అవసరం తమకెంతో ఉందని తెలియ జేశారు. తెలుగుదేశం ప్రభుత్వంతో తనకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా కేంద్ర ప్రభుత్వంతో సయోధ్య చేసుకుంటేగానీ లాభం లేదనిపించిందతనికి.

ఎలాంటి షరతులూ, అగ్రిమెంట్లూ లేకుండానే 'ఆంధ్రదేశం' మళ్ళీ కాంగ్రెస్ పార్టీవేపు మొగ్గింది.

మండల్ పదవులు తెలుగుదేశం, మునిసిపల్ పదవులు కాంగ్రెస్ చేజిక్కించు కోవటంతో రామవర్మకు కాంగ్రెస్‌లో పలుకుబడి పెరిగింది.

మాలినిని హత్య చేయడానికి ఇది మంచి సమయం అన్న నమ్మకం కలిగింది రామవర్మకి.

• • • •

అర్ధరాత్రి తలుపు బాదిన చప్పుడవుతూంటే మెలకువ వచ్చింది. జయలక్ష్మికి మంచం మీదనుంచి లేచి కూర్చుంది. అంతా అంధకారం! చుట్టూ ఏమీ కనిపించటం లేదు కరెంట్ పోయిందని అర్థమయిందామెకి.

గడియారంలో రేడియమ్ ముళ్ళు రెండు గంటల టైమయినట్లు చెప్తున్నాయ్.

పక్కనే నిద్రపోతున్న విష్ణుని తట్టి లేపిందామె


"ఎవరో వచ్చినట్లున్నారు చూడండి -"

విష్ణు బద్ధకంగా లేచి టేబుల్ మీదచేత్తో తడిమి టార్చ్ లైట్ అందుకున్నాడు. అతను బయటకు నడుస్తూంటే ఎందుకో తెలీని భయం ప్రవేశించింది జయలక్ష్మిలో ఎవరో ఇంత అర్ధరాత్రి ఎందుకొచ్చినట్లు? త్వరగా లోపలికెళ్ళి పడుకున్న నౌకర్ని నిద్ర లేపిందామె.

"ఒరేయ్ త్వరగా - రా! ఎవరో తలుపు కొడుతున్నారు" అంది గాభరాగా.

ఇద్దరూ హాలు వేపు నడుస్తూండగానే వినిపించింది విష్ణుకేక -

"ఎవరు మీరు - ఏం కావాలి?"



ఆ తరువాత పెనుగులాడుతున్న చప్పుడు.

ఆమె బయటి కొచ్చే సరికే అతనిని లాక్కెళ్ళి బయట ఉన్న వాన్‌లో తోస్తు న్నారు వాళ్ళు. వేన్ స్టార్టయే సరికి వెనుక ఉన్న అక్షరాలు డేంజర్ లైట్ కాంతిలో కనిపించాయామెకి

"పోలీస్" అని ఉంది.

ఆమెకు కొంత ధైర్యం వచ్చింది. మార్కిస్టుల్లోనే ఎన్నో గ్రూపులున్నాయ్. ఒక గ్రూపుకీ మరో గ్రూప్‌కీ ఏ మాత్రం పడదు. ఒకవేళ ఒక గ్రూప్ వాళ్ళు విష్ణుని ఎటాక్ చేశారేమో అని భయపడింది.

వెంటనే ఇంట్లోకొచ్చి పోలీస్ కంట్రోలు రూమ్‌కి ఫోన్ చేసిందామె.

అయిదు నిమిషాలు రింగయాక మాట్లాడాడతను.

"పోలీస్ కంట్రోల్ రూమ్ -"

జరిగిందంతా చెప్పిందామె.

"ఆల్‌రైట్ - మేము అన్నీ కనుక్కుని మళ్ళీ ఫోన్‌చేస్తాం మీకు -" అంటూ ఫోన్ పెట్టేశాడతను.

తెల్లారేవరకూ ఫోన్లు చేస్తూనే ఉందామె. కానీ ఎవరూ ఏమీ చెప్పలేక పోతు న్నారు. తెల్లారుతూనే కమీషనర్ ఇంటికి బయల్దేరిందామె. రోడ్డుమీద కార్లో వెళ్తూంటే ఓ షాప్‌లో వేలాడదీసిన న్యూస్‌పేపర్లు కనిపించాయ్.

పత్రిక శీర్షికలో ఉన్న వార్త చదువుతూనే నిశ్చేష్టురాలయిపోయిందామె. ఆమెకు తెలీకుండానే కారు ఆగిపోయింది.

"పోలీస్ ఎన్‌కౌంటర్‌లో డాక్టర్ విష్ణు మృతి"

ఆమెకు కొద్దిక్షణాలు మెదడు పనిచేయలేదు. తనకు స్పష్టంగా తెలిసి పోతోంది యిది స్పష్టమయిన హత్య!

త్వరగా పేపర్ తీసుకుని వివరాలన్నీ చదవసాగింది.

"గతరాత్రి ఒక నక్సలయిట్ రహస్య స్థావరంపై పోలీసులు దాడి జరిపి,

నప్పుడు, కాల్పులు జరపడానికి ప్రయత్నించిన డాక్టర్ విష్ణుని పోలీసులు కాల్చి చంపారు."

జయలక్ష్మి కార్లో కూర్చుండిపోయింది చాలాసేపు.

పోలీసులు ఎంతటి కట్టుకథ కల్పించి అల్లారో తనకు తెలుసు. ఇంట్లోనుంచి నిద్రలేపి తీసుకెళ్ళి నగ్జలైట్స్ స్థావరంలో అతను దొరికినట్లు ప్రచారం మొదలుపెట్టారు.

ఆమెకు ఒక్కసారిగా విరక్తి కలిగింది రాజకీయాలమీద.

వారం రోజులు గడిచిపోయినా ఆమె యింకా ఆలోచిస్తూనే ఉంది. ఆలోచిస్తున్న కొద్దీ విష్ణు, ఇంద్రకాంత్‌ల మార్గమే సరయిన మార్గంలా కనిపించ సాగింది. ఇంత పెద్ద దేశానికి ప్రజాస్వామ్యం ఏమాత్రం సరిపడదని ప్రజాస్వామ్యం సూత్రాల్లోనే ఉంది. జనాభా తక్కువుండాలి, దేశం చిన్నదిగా ఉండాలి. అక్షరాస్యత ఎక్కువగా ఉండాలి. అప్పుడే ప్రజాస్వామ్యం విజయవంత మవుతుంది.

మన దేశం ఈ ముఖ్యమయిన సూత్రాలన్నింటికీ వ్యతిరేకపరిస్థితిలో ఉంది.

అది జరిగిన కొద్దిరోజుల తర్వాత ఆమెను కలుసుకున్నాడు ఇంద్రకాంత్.

"విష్ణు గురించి పేపర్లో చూశాను జయా! వెంటనే నీ దగ్గర కొచ్చి మాట్లాడేందుకు వీల్లేక పోయింది. మీ ఫోన్ పోలీసులు టాప్ చేశారు. మీ ఇంటి చుట్టూ పోలీసులు మఫ్టీలో కాపలా ఉన్నారు – ఆ పరిస్థితుల్లో నిన్ను కలుసు కోవటం క్షేమం కాదని పించింది –" అన్నాడతను.

జయలక్ష్మి చాలా సేపు అతని వంకే చూస్తూండి పోయింది. అతని రూపంలో చాలా మార్పులొచ్చాయ్. బాగా నల్లబడి పోయాడు. మొఖంలో అది వరకటి అందం లేదు. మొఖం మీదా, శరీరం మీదా చాలా గాయాల గుర్తులున్నాయ్.

హఠాత్తుగా ఆమె మనసు గతంలో కెళ్ళి పోయింది.

అతనిని పెళ్ళి చేసుకుని ఉంటే బాగుండేదేమో –

నీతి, న్యాయం లేని ఈ వ్యవస్థను తెలిపి తక్కువగా ఎన్నుకుందేమో తను!

"జయా!" పిలిచాడు ఇంద్రకాంత్.

"ఊ!"

"ఇప్పటికయినా నీ ఆలోచనా ధోరణి మారిందా? ఇంకా నీ ఆశలూ, ఆశయాలూ అలాగే ఉన్నాయా?"

జయ నవ్వింది.

"చిన్నప్పటి నుంచీ నాకు ధైర్యం ఎక్కువ ఇంద్రకాంత్ – నేనేది అనుకుంటే అదే పట్టుదలతో చేస్తాను. మధ్యలో వెనక్కి తిరగటం, గాలి మార్చటం నాకు చేత కాదు –"

అతను లేచి ఆమె చేతిని పట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"విష్ యూ గుడ్‌లక్ –"

అతను వెళ్ళిపోయాడు.

ఈసారి ఎన్నికల్లో ఎంతో తేలిగ్గా విజయం సాధించిందామె. తెలుగుదేశం ధాటికి ఎంతోమంది హేమా హేమీలు ఓడిపోవటం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది. ఆమెకు ఆ పరిస్థితి ఎంతో విచారం కలిగించింది. వ్యక్తిపూజతో అధికారం సంపాదించిన కాంగ్రెస్‌పార్టీ లాగానే ఇప్పుడు తెలుగుదేశం కూడా వ్యక్తి పూజతో అధికారంలో కొచ్చింది. ఆ వ్యక్తి ఉన్నంత కాలం ఆ పార్టీకి ఢోకా ఉండదు.

తెలుగుదేశం బలం చూస్తూంటే మరో పదేళ్ళ వరకూ దానికి ఎదురు మరే పార్టీ నిలబడలేదని అనిపిస్తోంది.

అంటే తను ఇలా ఎమ్మెల్యేగానే జీవితం గడిపేయటం తప్ప రాష్ట్రాన్ని ఏలాలన్న ధ్యేయాన్ని నెరవేర్చుకోవటం సాధ్యం కాదన్నమాట!

ఆ పరిస్థితినుంచి ఎలా బయట పడటమా అని రాత్రింబగళ్ళు ఆలోచించ సాగిందామె. కాంగ్రెస్, తెలుగు దేశాన్ని పడగొట్టాలని ఎంత ప్రయత్నించినా లాభం ఉండదన్న సంగతి ఆమెకు తెలుసు. ఏంచేతంటే ప్రజలే కాంగ్రెస్‌ని తిరస్కరించారు. ఇప్పుడు కావలసింది, ఆంధ్రప్రదేశ్‌కి సంబంధించిన మరో ప్రాంతీయపార్టీ.

తను మరికొంతమంది ప్రాంతీయ నాయకులను కూడదీసుకుని ఒక కొత్తపార్టీ స్థాపిస్తేగానీ తెలుగుదేశంమీద విజయం పొందటం సాధ్యంకాదు. ఎన్టీఆర్ తలపెట్టిన రిజర్వేషన్లకు వ్యతిరేకంగానూ, ఎన్జీవోల సమ్మెకు మద్దతుగానూ, ఉద్యమాలు నడిపి రాష్ట్రస్థాయిలో చాలా కొద్దిరోజులలో ఎక్కువ గుర్తింపు పొందిందామె.

మళ్ళీ అసెంబ్లీ ఎన్నికలకు కొత్తపార్టీ స్థాపించాలని నిర్ణయించుకుందామె. ఆమె ఆలోచనకు వెన్వెంటనే విపరీతమయిన మద్దతు లభించింది.

వజ్రాన్ని వజ్రంతోనే కోయలన్న సూత్రం జయలక్ష్మికి తెలుసు. అందుకే కొత్త ప్రాంతీయ పార్టీకి ఎక్కువ 'ప్రాంతీయత' స్ఫురించేలా పేరు పెట్టాలని నిర్ణయించుకుంది. ఆ పార్టీకి ప్రాంతీయత స్ఫురించేలా పేర్లు సూచించమని అన్ని పేపర్లలోనూ తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేసిందామె.

మొదటి సూచన ఇంద్రకాంత్ నుంచి వచ్చింది.

"సరయిన మార్గంలో ప్రయాణిస్తున్నావ్ జయా! నీ పార్టీకి నేనూ ఓ పేరు సూచిస్తున్నాను. "తెలుగుతల్లి"! బావుందా?"

ఆ రోజు నుంచీ లక్షల పేర్లు సూచిస్తూ ఉత్తరాలు వస్తూన్నాయామెకి.


ఆఖరికి "తెలుగు భారతి" పేరుతో పార్టీ ప్రారంభించాలన్న నిర్ణయం జరిగింది.

అప్పుడు ఆ పార్టీకి ఒక నాయకుడిని ఎన్నుకోవాలన్న ఆలోచన వచ్చింది. ఆ నాయకుడికి ఎన్టీఆర్ కున్నంత గ్లామర్ ఉండాలి! ప్రజా బలం ఉండాలి. అభిమాన సంఘాలుండాలి. నీతిమంతుడయి ఉండాలి. పదవీ వ్యామోహం ఉండకూడదు.

ఆమె దృష్టిలో ఈ అర్హతలన్నీ ఒకే ఒక్క వ్యక్తికి కనిపించినయ్.

(ఇంకావుంది)

పిల్లల్లో మానసిక రుగ్మతలు వొచ్చే అవకాశాలు ఎలా తెలుస్తాయి?



పసిపిల్లలని మనం ఎంతో ప్రేమతో చూడగలం - కానీ జాగ్రత్తగా చూడ్డం అనేవి పిల్లల మానసిక ఆరోగ్యాన్ని కాపాడుతుంది... ఇవి మనం పిల్లల్ని గమనించడంలో వుంటుంది...

పసివాడికి 3, 4 నెలలు నిండుతూనే పక్కకి దొర్లగలగడం ... 6 నెలలకి కూర్చోగలగడం, 8, 9 నెలలకి నిలవగలగడం, ఓ సంవత్సరం గడవగానే అడుగులు వేయడం, 12, 15 నెలలు దాటుతూనే కొంచెం అర్థమయ్యే మాటలు పలకగలగడం సహజం. కాని ఈ దశలు ఆలస్యంగా జరిగితే - మరీ ఆలస్యంగా ఐతే వైద్యుడిని కలవడం మంచిది..." దాంతేవుంది - కొందరంతే - అన్నీ ఆలస్యంగా వొచ్చేస్తాయి" అంటారుకొందరు. కానీ అలాటి పిల్లల్లో ఎక్కువ భాగం మానసిక రుగ్మతలు వొచ్చే అవకాశం లేకపోలేదు.

జాగ్రత్త తీసుకోవాల్సొచ్చే అలవాట్లు!

కొందరు పిల్లలు స్కూలు వయసు దాటినా ఇంకా రాత్రిళ్ళు పక్క తడిపేస్తుంటారు. ఇంకొందరు కాలేజీ దశలోనూ తమ చేతి గోళ్ళని బిస్కట్లలా కొరుక్కుంటుంటారు. స్కూలు వయసు వచ్చినా కొందరు 'గుక్క' పడతారు ఏడుపులో. కొందరు స్కూలు వయసు దాటినా బొటనవేలుని ఐస్‌క్రీమ్‌లా ఖావిస్తుంటారు.

ఇవన్నీ స్కూలు వయసు దాటినా వుంటే డాక్టర్ని సంప్రదించి నయం చేసుకోడం అవసరం - లేదంటె మానసిక రుగ్మతలని తయారు చేస్తాయి అవే!

కొందరికి "హైపర్ కైనెటిక్ సైన్‌డ్రోమ్" వుంటుంది. అంటే పిల్లలు చురుగ్గానే, తెలివిగా వుంటారు. కానీ దేని మీదా ఏకాగ్రత, ధ్యాస వుండదు. చదువులో వెనకబడతారు. కానీ తెలివిగలవారే! — వీరిని మామూలుగా వైద్యుడు నయం చేయగలడు. దీనిని పట్టించుకోకపోయినా మానసిక అనారోగ్యానికి దారి తీయగలదు.

ఇవికాక పెద్దవాళ్ళ ప్రవర్తననిబట్టి కూడా పిల్లలకి మానసిక వ్యాధి అంటుకునే అవకాశం వుంది ... పన్నెండు సంవత్సరాల పిల్లని పట్టుకుని నోటికొచ్చినట్టు తిట్టెయ్యడం, చేతికందినదాంతో బాదెయ్యడం — పైగా ఇంటికొచ్చిన అతిథి మహాజనంముందు ఘోరంగా తిట్టడం — వీటివలన కూడా పిల్లలకి మానసిక జబ్బులు అంటుకునే అవకాశం లేకపోలేదు!

పిల్లల్ని అతిగా ముద్దు చెయ్యడం, అతిగా హింసించడం - ప్రేమతో చేసినాసరే ప్రమాదమే!

ఈ నెల అత్యుత్తమ అబద్ధం పోటీ

మొదటి అత్యుత్తమ అబద్ధం

రూ॥ 100/-

"రూ. 1,25,000/- విలువగల బహుమతులు గెల్వండి. ఎంట్రీ ఫీ లేదు." రెండు అడ్వర్‌టయిజ్‌మెంట్లు (శివరంజని వారపత్రిక ఫిబ్రవరి 27 - 6 మార్చి)

వి. శ్రీనివాస్
వరంగల్

రెండవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 75/-

ఈసారి పరీక్షలలో ముందుగా పరీక్షా పత్రాలు బయట పడటం, కాపీలు కొట్టడం వంటి అపక తవకలు జరగవని విద్యామంత్రి హామీ ఇచ్చారు.

(ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి-26)

ఎ. భారతి
విశాఖపట్నం

మూడవ అత్యుత్తమ అబద్ధం

రూ॥ 50/-

ఇటుపైన సిటీ బస్సులు ఖచ్చితంగా స్టాపుల్లోనే ఆగుతాయి.

(రవాణా శాఖామంత్రి)

ఎస్. సాయిప్రసాద్
విజయనగరం

ఇతర అత్యుత్తమ అబద్ధాలు

"వేగము కాదు ముఖ్యం, సురక్షిత ప్రయాణం మా లక్ష్యం"

(ఎ.పి.ఎస్.ఆర్.టి.సి.)

వాసిరెడ్డి శ్రీనివాసరావు
ద్రాక్షారామం

"ఫిరాయింపు నాయకుల్ని పార్టీలో చేర్చుకోము" — చంద్రబాబునాయుడు ప్రకటన (ఈనాడు 7-3-87)

కె.వి. లక్ష్మి
తాళ్ళపూడి

"ప్రజలే నా దైవాలు"

స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగిన ఎన్నికల సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు అన్నారు.

(ఈనాడు మార్చి 10, 1987)

వి.వి. పార్వతీశం
వరంగల్

"రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను చూసి దేశంలో ఇతర రాష్ట్రాలు మాత్రమే కాక ఇతర ఖండాంతరాలు కూడా విస్తుపోతున్నాయని రామారావు అన్నారు".

(వార్త ఈనాడు ఫిబ్రవరి 7)

ఆర్. రామకృష్ణారావ్
గోపాలపురమ్

"తెలుగుదేశం ప్రభుత్వానికి గ్రామాలే ఆలయాలని, సామాన్య ప్రజలే



దేవుళ్ళని, ధర్మకర్తృత్వ నిర్వహణతో వారిని పూజించుకుంటామని". రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి. రామారావు (విశాఖజిల్లా) పాయకరావుపేట బహిరంగ సభలో అన్నారు.

(వార్త : ఉదయం 6-3-87)

గెద్దం రమేష్ బాబు
ప్రత్తిపాడు

పాకిస్తాన్‌కు అణుబాంబు వున్నదని, ఆదేశం యురేనియం శుద్ధిచేయగలిగిందని, తానొక ఇంటర్వ్యూలో చెప్పినట్లుగా వచ్చిన వార్తను అణుశాస్త్రవేత్త ఖాదర్‌ఖాన్ ఖండించారు.

(ఈనాడు మార్చి 3)

టి. శ్రీనివాస్ కుమార్
కాకినాడ

"విదేశీ పాలన అంతమొందించడానికి ఆనాడు మన్యంలో అల్లూరి సీతారామరాజు వెలిశాడని, కాంగీ దుష్టపాలన అంతానికి తెలుగుదేశంపార్టీ ఆవిర్భవించిందని ఎన్.టి.ఆర్. అన్నారు"

(ఈనాడు 10-3-87)

వి.హెచ్. రామమోహనశర్మ
విజయవాడ

"మండలాధీశుడు" చిత్రంలోని పాత్రలు, సన్నివేశాలు ఎవరినీ ఉద్దేశించినవి కావు.

(నటుడు, దర్శకుడు డా॥ యం. ప్రభాకర్‌రెడ్డి)

యన్. రవి
నత్తుపల్లి

ఆదాయపుపన్ను బాకీలు ఉండటం తప్పుకాదని, తాను బాకీఉన్న ఆదాయపు పన్నును చెల్లిస్తానని, గతంలో ఉజ్వల జీవితాన్ని చవిచూసిన తనకు ప్రస్తుతం ఆదాయం లేదని ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు శనివారంనాడిక్కడ తెలిపారు.

(వార్త ఉదయం 8-3-87)

ఎ. ఫణిభూషణ్
అనంతపూర్

Edited & Published by V. Leelavathy Raghaviah, at 1-8-519/11, Chikkdadpally, Hyd 20. & Printed by P. Ramakrishna at Raghava Printers, 1-8-4/1/1, Chikkdadpalli, Hyderabad-20


మీ సొగసుల ఫ్రూజకు
విరిసిన తోట
మురిపాలు మూటగట్టిన
నారాయణపేట
మీ సులోచనల ఆలోచనలకు
చేనేత కళాకారుల ఈ రూపకల్పన
నారాయణపేట చీరలు
పట్టు చీర కట్టినవేళ -
పరువాలు మూటగట్టిన వేళ
మీ సౌందర్యానికి వేస్తాయి
నారయణపేట చీరలు
పట్టుదారాల కుసుమా కాలలు
చేనేతలు